ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 14.08.2025 | సంపుటి : 12 సంచిక : 26 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# అధికారులూ.. అప్రమత్తంగా ఉండండి



## ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగొద్దు
## భారీ వర్షాలపై సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రానికి మూడు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నందున ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు- చేసుకోవాలన్నారు. అందరి సెలవులు రద్దు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఉన్నతాధికా రులంతా ఈ 3 రోజులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కాగా సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు అతిభారీ వర్షల సూచనలు ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్, హనుమకొండ, ఆదిలాబాద్, జనగామ, కామారెడ్డి, కుమురం భీం,

మిగతా 2లో..

## రాష్ట్రవ్యాప్తంగా భూములకు ‘భూధార్’

నెంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలి

వారసత్వ, ఇతర మ్యుటేషన్ల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2 లో..



## తెలంగాణ వ్యాప్తంగా రెడ్అలర్ట్

- రాష్ట్రంలో మూడు రోజులపాటు అతిభారీ వర్షాలు
- పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు
- నిండుకుండలా సాగర్, శ్రీశైలం జలాశయాలు
- గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన అధికారులు

3 లో..

## గాడ్సే,సావర్కర్ భావజాలం వల్ల
# నాకు ప్రమాదం పొంచి ఉంది

నాకు భద్రత కల్పించండి • ఆ బాధ్యత కేంద్రానిదే..

పుణె కోర్టుకు తెలిపిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ(జనంసాక్షి): వి.డి.సావర్కర్‌ను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే.. సావర్కర్, గాడ్సే భావజాలాన్ని అనుసరిస్తున్న వారి నుంచి తనకు ముప్పు పొంచి ఉండొచ్చని రాహుల్ పుణె కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో తనకు అవసరమైన భద్రత అందించడం కేంద్రం బాధ్యత అని పేర్కొన్నారు. 2023లో లండన్ పర్యటన సమయంలో సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సావర్కర్ మునిమనవడు సాత్యకి సావర్కర్ ఆయనపై పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు పోలీసులు గతంలో తేల్చారు. దీనిపై పుణెలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది.

మిగతా 2లో..

ఓబుళాపురం మైనింగ్ కేసు..



## సబితా నిర్దోషిత్వంపై హైకోర్టుకు సీబీఐ

తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసిన ధర్మాసనం

హైదరాబాద్(జనంసాక్షి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ కేసులో హైకోర్టులో సీబీఐ అప్పీల్ దాఖలు చేసింది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కృపానందంను నిర్దోషులుగా పేర్కొంటూ గతంలో నాంపల్లి సీబీఐ కోర్టు తీర్పు వెలువరించింది. ఆ తీర్పును సీబీఐ అధికారులు తాజాగా హైకోర్టులో అప్పీల్ చేశారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

## న్యాయపోరాటం చేస్తా

తీర్పు ఇలా వస్తుందని అనుకోలేదు

ఆమీర్ అలీ ఖాన్

## సుప్రీం తీర్పు చెంపపెట్టు

కాంగ్రెస్, బీజేపీలకు ఇదో గుణపాఠం కావాలి: కేటీఆర్

## రాజ్యాంగ రక్షణకే మా పోరాటం

సుప్రీం తీర్పుతో కళ్లు తెరవాలి: దాసోజు

వివరాలు లోపలి పేజీల్లో..

కోదండరామ్, అమీర్ అలీఖాన్ కౌన్సిల్ సభ్యత్వంపై

# సుప్రీం కోర్టు స్టే..

- దాసోజు శ్రవణ్, సత్యనారాయణ పిటిషన్‌లపై తీర్పు వెలువరించిన అత్యున్నత ధర్మాసనం
- తదుపరి విచారణ సెప్టెంబర్ 17కు వాయిదా
- మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం సరికాదని వ్యాఖ్య



ఇటు పరావ్యరణ పరిరక్షణ.. అటు అభివృద్ధి

# రెండూ ముఖ్యమే

- వీటిని సమతుల్యం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి
- కంచ గచ్చిబౌలి కేసులో తెలంగాణ ప్రభుత్వానికి ‘సుప్రీం’ ఆదేశాలు
- రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణ పరిరక్షణ చర్యలపై ధర్మాసనం అభినందనలు .. సమగ్ర ప్రతిపాదనలు తీసుకొచ్చేందుకు ఆరు వారాల గడువు కోరిన తెలంగాణ ప్రభుత్వం

2 లో..

వీధి కుక్కల తీర్పుపై సుప్రీం కోర్టు

## యూటర్న్?

పునరాలోచిస్తామన్న సీజేఐ

9 లో..

ఎక్కువ ధృవీకరణ పత్రాలకు అనుమతి

## మంచిదే కదా!

బీహార్‌లో ఓటరు జాబితా సవరణపై విచారణ సందర్భంగా సుప్రీం వ్యాఖ్య



## చైనాపై వడ్డింపులకు విరామం

ఆ దేశంపై అమల్లోకి రావాల్సిన టారిఫ్‌లను 90 రోజులు వాయిదా వేసిన ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి): ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా-చైనాల మధ్య ఉద్రిక్తతలకు కొంత విరామం దొరికింది. సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి చైనాపై అమల్లోకి రావాల్సిన భారీ టారిఫ్‌లను 90 రోజులపాటు వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుపై సంతకం చేశానని సొంత ట్రూత్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

మిగతా 2లో..

# భారత్‌పై సుంకాలు.. రష్యాకు పెద్దదెబ్బ

మా టారీఫ్‌లతో ఆగమవుతున్న ఆ దేశ ఆర్థిక వ్యవస్థ: ట్రంప్



వాషింగ్టన్(జనంసాక్షి): ఉక్రెయిన్ శాంతి చర్చల్లో భాగం గా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యే వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రష్యా-భారత్ వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో.. ఇరు దేశాలవి డెడ్ ఎకానమీ అంటూ గతంలో వ్యాఖ్యానించింది తెలిసిందే. తాజా గా.. భారత్‌పై అమెరికా విధించిన భారీ సుంకాలు రష్యా ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బలాంటిదని అభిప్రా యపడ్డారు. వైట్‌హౌజ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. “రష్యా ఆర్థిక పరిస్థితి ఏమంత బాగోలేదు. అమెరికా విధిస్తున్న వాణి జ్య ఆంక్షలు, అదే సమయంలో అంతర్జాతీయ ఒత్తిళ్ల తో ఆగమాగమవుతోంది. అదొక విశాలమైన దేశం. అపారమైన సామర్థ్యమూ ఉంది. కాబట్టి తిరిగి తమ దేశ నిర్మాణంపై దృష్టి పెట్టాలి” అని సూచించారు. ఈ సమయంలో భారత్ ప్రస్తావన తీసుకొచ్చారాయన.. “రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే అతిపెద్ద, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశానికి.. ‘మీరు రష్యా నుంచి చమురు కొంటే 50% టారిఫ్ వేస్తాం’ అని హెచ్చరించాం. చెప్పినట్లే చేశాం కూడా. ఇది ముమ్మాటికీ రష్యాకు పెద్ద దెబ్బనే” అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే ట్రంప్ చేసిన ఈ ఎకానమీ వ్యాఖ్యలపై రష్యా ఎలా స్పందిస్తుందో చూడాలి..ఇదిలా ఉంటే.. భారత్ అమెరికాకు మిత్రదేశమేనని, వాణిజ్యం మాత్రం సక్రమంగా లేదని చెబుతూ ట్రంప్ 25 శాతం ప్రతీకార సుంకాలను విధించారు. ఆ సమయంలో రష్యా నుంచి భారత్ చమురు కోనుగోళ్ల నేపథ్యంపైనా ఆయన తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయినప్పటికీ భారత్ వెనకడుగు వేయలేదు. ఆ సమయంలో ఇరు దేశాల తమ డెడ్ ఎకానమీలను మరింత దిగజారచుకుంటున్నాయని.

మిగతా 2లో..

సుంకాలు విధించినా

## భారత్ వెనక్కి తగ్గట్లేదు

ఇలాగైతే ఇరుదేశాల మధ్య చర్చలు మరింత నెమ్మదిస్తాయి

అమెరికా ట్రెజరీ కార్యదర్శి

వాషింగ్టన్(జనంసాక్షి): రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై భారీగా సుంకాల భారాన్ని మోపారు. ఈ విషయంపై తాజాగా అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ.. సుంకాలు విధించినప్పటికీ వాణిజ్య చర్చల విషయంలో భారత్

మిగతా 2లో..



# ఏపీకి అందలం

తెలంగాణపై మాత్రం వివక్ష

పక్కరాష్ట్రానికి ప్రాజెక్టులు కేటాయించి, మనల్ని పక్కన పెడుతోంది

కేంద్ర ప్రభుత్వం తీరుపై మంత్రి శ్రీధర్ బాబు అసహనం



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణకు వచ్చే కంపెనీలకు అనుమతి ఇచ్చే విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. బుధవారం మంత్రి మాట్లాడుతూ.. ఏపీకి కొత్త ప్రాజెక్టులు కేటాయించి, తెలంగాణను మాత్రం పక్కన పెడుతోందన్నారు. ప్రపంచస్థాయి అధునాతన ప్యాకేజింగ్ కంపెనీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, ఇందుకోసం మహేశ్వరంలో 10 ఎకరాల విలువైన భూమిని కేటాయించడంతో పాటు-, రాయితీలు ఇచ్చేందుకు ఆమోదిస్తూ అన్ని అనుమతులను రికార్డు స్థాయిలో పూర్తి చేశామన్నారు. అయినా కానీ, కేంద్ర క్యాబినెట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. ఏపీలో మాత్రం ఇలాంటి ప్రాజెక్టుకే కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. అయితే అక్కడ ఇప్పటివరకు ఎలాంటి భూకేటాయింపులు జరగలేదని, ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైనా వారికి అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించారు. కేంద్రం ఇలాంటి చర్యల వల్ల అంతర్జాతీయ పెట్టు-బడిదారులకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి రాజకీయ నిర్ణయాలు తెలంగాణ అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయని, కేంద్ర వ్యవహారశైలిని రాష్ట్ర ప్రభుత్వం తూర్పారబడుతుందన్నారు.



## ప్రారంభమైన ‘బాహుబలి’ పంపులు

గాయత్రీ పంప్ హౌస్ నుంచి గోదావరి జలాల ఎత్తిపోతలు • నిండనున్న మధ్యమానేరు

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్ హౌస్ నుంచి గోదావరి నదీ జలాల ఎత్తిపోతలు ప్రారంభించారు. మూడు బాహుబలి పంపులతో 9450 క్యూసెక్కుల జలాలను ఎత్తిపోస్తున్నారు. ఇక్కడి నుంచి మధ్యమానేరు ప్రాజెక్టుకు ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా నీటిని తరలిస్తున్నారు. శ్రీపాద సాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి లభ్యత మేరకు ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎత్తిపోతలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. భారీ స్థాయిలో కాలువలు ద్వారా గోదావరి జలాలు ప్రవహించడంతో ఈ ప్రాంతంలో జలకళ సంతరించుకుంది

## డీఆర్డీఓలో ఉంటూ పాక్‌కు రహస్యాలు చేరవేత..

గెస్ట్‌హౌస్ మేనేజర్ అరెస్ట్



జైసల్మేర్(జనంసాక్షి): డీఆర్డీఓ శాస్త్రవేత్తల, భారత ఆర్మీ అధికారుల రహస్య వివరాలను పాకిస్తాన్ నిఘా సంస్థతో సోషల్ మీడియా ద్వారా పంచుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఆర్డీఓ ఉద్యోగిని సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో గల డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీఓ) గెస్ట్ హౌస్‌లో కాంట్రాక్టు మేనేజర్‌గా పనిచేస్తున్న మహేంద్ర ప్రసాద్‌ను సీఐడీ

మిగతా 2లో..

## ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా ఫలితం సున్నా

- ఎన్నికలున్నాయని యూరియానంతా బీహార్‌కు తరలిస్తున్నారు
- తెలంగాణలో యూరియా కోసం క్యూలో అన్నదాతల అగచాట్లు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ పాత పద్ధతి అమలు: హరీష్ రావు



సిద్దిపేట(జనంసాక్షి): యూరియా కోసం అన్నదాతలు నడిరోడ్డెక్కి ధర్నాలు చేసే దుస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రైతులకు యూరియా ఇవ్వలేని చేతగాని, దద్దమ్మ ప్రభుత్వాలు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలను అరిగోస పెడుతున్న కాంగ్రెస్, బీజేపీలకు రైతుల ఉసురు తగులుతుందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామం వద్ద ఎరువుల కోసం క్యూలో బారులు తిరిన రైతులను చూసి మాజీ మంత్రి హరీష్ రావు ఆగారు. ఈ సందర్భంగా వారిని పలుకరించగా.. ఉదయం 5 గంటల నుండి ఇక్కడే ఉంటున్నాం.. ఒక ఆధార్ కార్డుకి ఒకటే బస్తా ఇస్తామంటున్నారు. ఆధార్ కార్డు, ఓటీపీ అంటూ కాలయాపన చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని హరీశ్ రావుతో రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఈ గోస లేదని.. కాంగ్రెస్ వచ్చాక

మిగతా 2లో..

## ఒక్క నీటి చుక్కా వాడుకోనివ్వం

- సింధు జలాల ఒప్పందం ఆపితే తీవ్రచర్యలు
- మర్చిపోలేని విధంగా గుణపాఠం చెబుతాం
- భారత్‌కు పాక్ ప్రధాని షరీఫ్ బెదిరింపులు



ఇస్లామాబాద్(జనంసాక్షి): సింధు జలాల ఒప్పందం నిలిపివేతతో అల్లాడిపోతున్న పాక్ నేతలు ఏం చేయాలో పాలుపోక నోటికి పని చెబుతున్నారు. యుద్ధోన్మాదంతో ఊగిపోతూ పిచ్చి ప్రేలాపనలకు దిగుతున్నారు. తాజాగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్‌పై నోరు పారేసుకున్నారు. భారత్‌కు ఎన్నడూ మర్చిపోలేని గుణపాఠం చెబుతామంటూ హెచ్చరించారు. పాకిస్తాన్‌కు చెందాల్సిన జలాల్లో భారత్‌ను ఒక్క నీటి చుక్క కూడా తీసుకోనివ్వబోమని ఆ దేశ ప్రధాని షహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. ఏప్రిల్ 22న కశ్మీర్‌లో పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన అనంతరం భారత ప్రభుత్వం పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా పలు చర్యలను ప్రకటించింది.

మిగతా 9లో..



జనంసాక్షి www.janamsakshi.org
గురువారం 14.08.2025

## గాడ్సే,సావర్కర్ భావజాలం వల్ల నాకు ప్రమాదం పొంచి ఉంది

ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ తరపు న్యాయవాది కోర్టుకు తాజాగా ఓ అప్లికేషన్ సమర్పించారు. "తనకు నాథూరాం గాడ్సే, సావర్కర్ కుటుంబాలతో సంబంధం ఉందని సాత్యకి గతంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయన గత చరిత్రను దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. సావర్కర్, గాడ్సే భావజాలానికి మద్దతు ఇచ్చే వ్యక్తుల నుంచి రాహుల్ గాంధీకి ముప్పు పొంచి ఉండే అవకాశాలను కొట్టిపారేయలేం. ఇటువంటి పరిస్థితుల్లో ఆయనకు రక్షణ కల్పించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత" అని అందులో పేర్కొన్నారు.విచారణను ఆలస్యం చేయాలనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీ ఈ అప్లికేషన్‌ను దాఖలు చేశారని సాత్యకి సావర్కర్ ఆరోపించారు. అందులో పేర్కొన్న వాస్తవాలకు, ప్రస్తుత కేసుతో ఎటువంటి సంబంధం లేదని మీడియాతో అన్నారు. ఇదిలా ఉండగా.. ఈ కేసులో రాహుల్ గాంధీకి కోర్టు ఇప్పటికే బెయిల్ మంజూరు చేసింది.

## ఎక్కువ ధృవీకరణ పత్రాలకు అనుమతి మంచిదే కదా!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బీహార్‌లో ఓటర్ల జాబితాను సవరించాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఏడు ధ్రువీకరణ పత్రాలకంటే.. ప్రస్తుతం 11 పత్రాలను అనుమతించడం ఓటర్లకు ప్రయోజనకరంగా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆధార్ మినహా అనేక ఇతర డాక్యుమెంట్లను పరిగణలోకి తీసుకోవడాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. గతంలో బిహార్‌లో నిర్వహించిన రివిజన్‌లో ఏడు ధ్రువీకరపత్రాలను అనుమతించారని.. ప్రత్యేక సవరణలో 11 డాక్యుమెంట్లను ఈసీ అనుమతి ఇస్తుందని.. దీన్ని పరిశీలిస్తే ఓటర్లకు అనుకూలంగానే కనిపిస్తుందని ధర్మాసనం తెలిపింది. ఆధార్ అనుమతించడం లేదనే పిటిషనర్ల వాదనను అర్థం చేసుకున్న ప్పటికీ అనేక పత్రాలను పరిగణలోకి తీసుకుంటున్నట్లుగా ధర్మాసనం గుర్తు చేసింది. అయితే, ఈ వాదనలతో పిటిషనర్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ విభేదించారు. ధ్రువపత్రాల సంఖ్య ఎక్కువగా ఉన్నా.. అందరికీ అందుబాటులో లేవని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాస్‌పోర్టులను ఉదహరించారు. బిహార్‌లో కేవలం ఒకటి నుంచి రెండుశాతం మంది వద్దే పాస్ పోస్టులు ఉన్నాయన్నారు. దీనికి స్పందించిన ధర్మాసనం 36లక్షల మందికి పాస్‌పోర్టులు ఉన్నాయని.. ఇది మంచి సంఖ్యగానే కనిపిస్తోందని చెప్పింది. ఆయా ప్రభుత్వ విభాగాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తర్వాతే ధ్రువపత్రాల జాబితా రూపొందిస్తారని జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ అంశంపై మంగళవారం సైతం సుప్రీంకోర్టులో విచారణ జరిగిన విషయం తెలిసిందే. పౌరులను చేర్చడం, కానివారిని ఓటరు జాబితా నుంచి మినహాయించడం ఎన్నికల కమిషన్ అధికార పరిధిలోనిదని ధర్మాసనం పేర్కొంది. సర్‌లో ఆధార్, ఓటర్ కార్డును పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమన్న ఈసీ వాదనలను సమర్థించింది. పార్లమెంట్ లోపల, వెలుపల 'సర్' అంశంపై వివాదం పెరుగుతున్న నేపథ్యంలో.. ఈసీ చేపట్టిన ఈ కార్యక్రమంపై విశ్వాసం కోల్పోవడమే సమస్య అని.. అంతకు మించి ఏమీ లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

## ట్రంప్ టారిఫ్‌ల వేళ.. మాస్కోకు విదేశాంగ మంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పాశ్చాత్య దేశాల ఆంక్షలు ఎదుర్కొంటున్న రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపేయాలని..లేదంటే అధిక పన్నులు విధిస్తామని అమెరికా భారత్‌పై బెదిరింపులకు దిగుతున్న విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ రష్యా పర్యటనకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 20-21 తేదీలలో మాస్కోలో పర్యటించనున్న విదేశాంగ మంత్రి ఇరుదేశాల మధ్య సంబంధాలపై ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌తో చర్చలు జరపనున్నట్లు సమాచారం. కాగా జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ ప్రస్తుతం మాస్కో పర్యటనలో ఉన్నారు. భారీ సుంకాలతో అమెరికా విరుచుకుపడుతున్న వేళ...రష్యాతో స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్ అడుగులువేస్తోంది. ఇందులో భాగంగానే భారత ప్రధాని మోదీ ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక బంధం బలోపేతంతో పాటు పెట్టుబడులు, వాణిజ్యం, ఆర్థిక విషయాలపై చర్చించుకున్నారని దిల్లీ, మాస్కోల నుంచి విడివిడిగా విడుదలైన అధికారిక ప్రకటనలు తెలిపాయి. ఉక్రెయిన్‌తో ఘర్షణ తాజా పరిస్థితిని పుతిన్ వివరించగా శాంతియుత చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్న తన సూచనను ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ఈ ఏడాది చివర్లో భారత్ పర్యటనకు వచ్చే పుతిన్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు ఎదురు చూస్తున్నట్లు రాసుకొచ్చారు.మరో వైపు 15వ తేదిన పుతిన్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అవ్వనున్నారు. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు, ఉక్రెయిన్‌తో యుద్ధం, వాణిజ్య ఒప్పందాలు మొదలైన విషయాలపై వీరిరువురు చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కూడా పాల్గొనే అవకాశముంది.

## నీట్(యూజీ) తొలి విడత కౌన్సెలింగ్ తుది ఫలితాలు విడుదల

దిల్లీ: దేశ వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి చేపట్టిన నీట్ (యూజీ) కౌన్సెలింగ్ తొలి రౌండ్ ఫలితాలు విడుదలయ్యాయి. అభ్యర్థులు సాధించిన ర్యాంకుల ఆధారంగా మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ వైద్య కళాశాలల్లో సీట్లు కేటాయించింది. సీట్లు పొందిన విద్యార్థులు కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 14 నుంచి సంబంధిత కళాశాల/సంస్థల్లో రిపోర్టు చేసుకోవచ్చని సూచించింది. రిపోర్టింగ్‌కు ముందు అభ్యర్థులు తమ అలాట్‌మెంట్ లెటర్‌ను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (%వీజజ%)అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ధ్రువీకరణ కోసం అవసరమైన అన్ని ఒరిజినల్ డాక్యుమెంట్లు, ఫొటోకాపీలను తీసుకెళ్లాలని సూచించింది. చివరి తేదీ తర్వాత ఎలాంటి క్లెయిమ్‌లు స్వీకరించరు గనక నిర్ణీత సమయం లోపే రిపోర్టింగ్ చేయాలని సూచించింది. మరిన్ని అప్‌డేట్స్ కోసం అభ్యర్థులు ఎప్పటికప్పుడు నీట్ యూజీ కౌన్సెలింగ్ వెబ్‌సైట్‌ను చెక్ చేసుకోవాలని ఎంసీసీ విజ్ఞప్తి చేసింది.

## కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ రెడీ

**- బిడ్ దాఖలుకు ఐవోఏ ఆమోదం**

అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ సిద్ధమవుతోంది. ఇప్పటికే 2036 ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు ఆసక్తిగా ఉన్నామని కేంద్రం వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా 2030 కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణ కోసం బిడ్ దాఖలు చేయడానికి భారత ఒలింపిక్ అసోషియేషన్ ఆమోదం తెలిపింది. ప్రత్యేక సాధారణ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణ కోసం బిడ్లను దాఖలు చేసేందుకు ఆగస్ట్ 31 తుది గడువు.2030 ఎడిషన్ కామన్వెల్త్ గేమ్స్‌ను నిర్వహించేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని ఐవోఏ గత మార్చిలోనే ఇంట్రెస్ట్ ఆఫ్ హోస్టింగ్ అంటూ లెటర్‌ను పంపింది. ఈ పోటీలకు అహ్మదాబాద్ వేదికను కేంద్ర మంత్రిత్వ శాఖ ఖరారు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఒలింపిక్స్ 2036 పోటీలకు అనుమతి లభిస్తే అహ్మదాబాదే కేంద్రబిందువు కానుంది.

# అధికారులూ.. అప్రమత్తంగా ఉండండి



ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు- చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రమంతటా రేపు కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని నాగరత్న వివరించారు. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశాం. రేపు మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇవాళ జీహెచ్‌ఎంసీ పరిధిలో రెడ్ అలర్ట్.. రేపు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామని అన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా భూములకు 'భూధార్'

**హైదరాబాద్(జనంసాక్షి):**
రాష్ట్ర వ్యాప్తంగా భూములకు భూధార్ నెంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ అధికారులను ఆదేశించారు. అలాగే, రెవెన్యూ సదస్సుల్లో వారసత్వ, ఇతర మ్యుటేషన్లకు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని చెప్పారు.కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై ముఖ్యమంత్రి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. లైసెన్డ్ సర్వేయర్లు సర్వే చేసిన అనంతరం రెగ్యులర్ సర్వేయర్లు వాటిని స్క్రూటినీ చేసేలా చూడాలని ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాలో నూతనంగా నిర్మించనున్న 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, ఇతర మౌలిక వసతులు ఉండాలని, కార్యాయాలు పూర్తిగా ప్రజలకు స్నేహ పూర్వక వాతావరణంలో, సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని సూచించారు.రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు వివరించగా, ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి గారు అధికారులకు సూచించారు.హైదరాబాద్ నగరంలోని హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టుల్లోని తలెత్తిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

# ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా ఫలితం సున్నా..

నీళ్ళు లేవు, యూరియా లేదు అంటూ రైతులు ఆవేదన వెలిబుచ్చారు. యూరియా ఎప్పుడు వేసుకోవాలి.. ఎప్పుడు పంట పండాలి అంటూ ఆందోళన వ్యక్తం చేశారు.కేసీఆర్ హయంలో హమాలీ ఖర్చులు ఇచ్చి ఇంటికి యూరియా పంపించామని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఉదయం నుండి రైతులు వచ్చి ఇబ్బందులు పడుతుంటే పట్టించుకొనే అధికారి లేదు అని అగ్రికల్చర్ అధికారులపై హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచి రాష్ట్రానికి ఎరువుల కొరత తీర్చడంలో విఫలం అయ్యారని హరీశ్‌రావు మండిపడ్డారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఎరువుల కొరతపై నోరు మెదపడం లేదు.. రైతుల ఉసరు ఉట్టిగా పోదు.. 4 రోజుల నుండి వ్యసాయ పనులు వృధా చేసుకొని యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపీలకు తగిన గుణపాఠం చెపుతారని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి 51 సార్లు ఢిల్లీకి పోయాడు.. కానీ ఎరువుల కొరత తీర్చలేదు. మీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నాడు. రేవంత్ రెడ్డి తిట్లు- ఎక్కువ పని తక్కువ అని. ప్రజలకు కావాల్సింది తిట్లు కాదు, పని కావాలి. రేవంత్ రెడ్డికి తిట్ల మీద ఉన్న ధ్యాస.. పని మీద లేదు. రైతులు సూటిగా అడుగుతున్నారు కేసీఆర్ ఉన్నపుడు ఎరువులు ఎట్లా వచ్చాయి.. ఇప్పుడు ఎట్లా రావు అని. వెంటనే ఓటీ-పీ, ఒక్క బస్తా విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నట్లు- హరీశ్‌రావు పేర్కొన్నారు.

పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎరువుల ఇబ్బంది లేదు. ప్రతి మండలానికి గోదాంలు ఏర్పాటు- చేసుకొని, వేసవి కాలంలోనే ఎరువులు స్టాక్ పెట్టినం. గ్రామం నుండి రైతు కాలు బయట పెట్టకుండా.. హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు లేకుండా రైతు సమయం వృధా కాకుండ గ్రామంలోనే ఎరువులు అందిచాం. నాలుగు రోజుల నుండి ఇక్కడికి వచ్చి ఉంటే ఒక్క బస్తా ఇస్తామని చెప్పడం బాధాకరం. దేవుడు దర్శనం దొరుకుతుంది కానీ ఎరువుల బస్తా దొరకడం లేదని మహిళా రైతు భాగ్యమ్మ చెప్పడం ఈ ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపునకు నిదర్శనం. వెంటనే ఓటీ-పీ విధానం, ఒక బస్తా విధానంను తీసేయాలని డిమాండ్ చేశారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువుల బస్తాలు ఇవ్వాలని డిమాండ్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు.మళ్ళీ పాత రోజులు వచ్చాయి.. ఇదేనా కాంగ్రెస్ మార్పు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రైతు వ్యతిరేక ప్రభుత్వం, నానో యూరియా వాడాలని చెప్పడం రైతులపై 500 రూ. అదనపు భారం వేయడమే. నానో యూరియ తో రైతులకు ఎకరానికి రూ. 500లు భారం పడుతుంది. ప్రభుత్వం సబ్సిడీ నుండి తప్పించుకోడానికి కృత్రిమ ఎరువులను సృష్టిస్తుంది. ఎన్నికలు ఉన్నాయని బీహార్‌కు ఎరువులను తరలిస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం సబ్సిడీ నుంచి తప్పించుకునేందుకు కృత్రిమ కొరతను సృష్టిస్తోందని విమర్శించారు. ఎన్నికలు ఉన్నాయని బిహార్‌కు ఎరువులు తరలిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాకు గుణపాఠం చెప్పాలన్నారు.

**కాళేశ్వరం జలాశయాలు నింపండి**

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఉన్న జలాశయాలు నింపాలని అందులో విజ్ఞప్తి చేశారు. మధ్య మానేరు, అన్నపూర్ణ, రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ జలాశయాలను నింపాలని కోరారు. రైతుల కోసం ఆరో ప్యాకేజీ వద్ద ఉన్న మోటార్లు ఆన్ చేయాలన్నారు. జలాశయాల్లో నీరు నింపకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. వెంటనే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లు నింపాలని లేఖలో పేర్కొన్నారు. రిజర్వాయర్‌లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల రైతులు ఆందోళనలో ఉన్నారని చెప్పుకొచ్చారు.

## డీఆర్డీఓలో ఉంటూ పాక్‌కు రహస్యాలు చేరవేత

పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ కోసం గూఢచర్యం చేశాడనే ఆరోపణలతో మహేంద్ర ప్రసాద్‌ను రాజస్థాన్ సీఐడీ ఇంటెలిజెన్స్ అరెస్టు చేసింది.మహేంద్ర ప్రసాద్ భారతదేశానికి సంబంధించిన రహస్య, వ్యూహాత్మక సమాచారాన్ని పాకిస్తాన్‌కు పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. బుధవారం అతనిని కోర్టు ముందు హాజరుపరచనున్నారు. తరువాత తదుపరి విచారణ కోసం రిమాండ్‌కు తీసుకువెళ్లనున్నారు. రాబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు, రాజస్థాన్ సీఐడీ ఇంటెలిజెన్స్ రాష్ట్రంలోని భద్రతను చురుకుగా పర్యవేక్షిస్తోందని రాజస్థాన్, జైపూర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సిఐడి (సెక్యూరిటీ), డాక్టర్ విష్ణుకాంత్ మీడియాకు తెలిపారు.ఉత్తరాఖండ్‌లోని అల్మోరాకు చెందిన కాంట్రాక్టు మేనేజర్ మహేంద్ర ప్రసాద్ పాకిస్తాన్ నిఘా సంస్థతో సోషల్ మీడియా ద్వారా సంభాషిస్తున్నట్లు సీఐడీ నిఘా సమయంలో వెల్లడయ్యింది. క్షిపణి, ఆయుధ పరీక్షల కోసం ఫైరింగ్ రేంజ్‌ను సందర్శించే డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు, భారత ఆర్మీ అధికారుల కదలిక గురించి అతను పాకిస్తాన్‌లోని హ్యాండ్లర్లకు రహస్య సమాచారాన్ని అందిస్తున్నట్లు సీఐడీ పోలీసులు అనుమానిస్తున్నారు.జైపూర్‌లోని సెంట్రల్ ఇంటరాగేషన్ సెంటర్‌లో వివిధ నిఘా సంస్థలు నిందితుడిని సంయుక్తంగా విచారించాయి. మహేంద్ర ప్రసాద్ మొబైల్ ఫోన్‌ను సాంకేతికంగా పరీక్షించగా, అతను డీఆర్‌డీఓతో పాటు భారత సైన్యానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్తాన్ నిర్వాహకులతో పంచుకుంటున్నాడని స్పష్టమయ్యింది. ఈ నేపథ్యంలో అధికారిక రహస్యాల చట్టం, 1923 కింద మహేంద్ర ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు.

## ఒక్క నీటి చుక్కా వాడుకోనివ్వం

ఇందులో 1960ల నాటి సింధూ జలాల ఒప్పందం(ఐడబ్ల్యూటీ)నుంచి వైదొలగడం కూడా ఉంది. తద్వారా సిందూ జలాలను దిగువకు విడుదల చేయకుండా ఆపేసింది. దీనిపై పాక్ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఇది యుద్ధ నేరమే అవుతుందంటూ ప్రకటనలు కూడా చేసింది.ఈ నేపథ్యంలోనే మంగళవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న పాక్ ప్రధాని షరీఫ్..'మా శత్రు దేశానికి ఒక విషయం చెప్పాలనుకుంటున్నా.. మా నీళ్లను ఆపుతామంటూ మీరు బెదిరిస్తున్నారు కదా. పాకిస్తాన్‌కు చెందాల్సిన ఒక్క నీటి చుక్కను కూడా మిమ్మల్ని తీసుకోనివ్వం. ఇది గుర్తుపెట్టుకోండి'అంటూ వ్యాఖ్యానించారు. పాక్ మాజీ మంత్రి బిలావల్ భుట్టో కూడా సోమవారం ఇలాంటి ప్రేలాపనలే చేయడం గమనార్హం.ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ మునీర్, మరో నేత బిలావల్ భుట్టో కూడా భారత్‌పై యుద్ధోన్మాదంతో రెచ్చిపోతూ నోటికొచ్చినట్టు- మాట్లాడారు. భారత్‌ను ఉద్దేశిస్తూ మునీర్ అణుయుద్ధ హెచ్చరికలు చేశారు. పాక్ ఉనికికి ముప్పు వస్తే తమతో పాటు- సగం ప్రపంచం అంతమవు తుందని వార్నింగ్ ఇచ్చారు. ఇక భారత్‌కు వ్యతిరేకంగా పాక్ ప్రజలు ఏకం కావాలని బిలావల్ భుట్టో పిలుపు నిచ్చారు.

## భారత్‌పై సుంకాలు.. రష్యాకు పెద్దదెబ్బ

ఆ అంశాన్ని అమెరికా పట్టించుకునే స్థితిలో లేవని అన్నారు. అటుపై భారత్‌పై మరో 25 శాతం పెనాల్టీ టారిఫ్ విధించడంతో ఆ సుంకాలు 50 శాతానికి చేరాయి. అయితే భారత్ ఈ సుంకాలను అన్యాయంగా పేర్కొంది. అదే సమయంలో.. జాతీయ ప్రయోజనాల దృష్ట్యానే తాము ముందుకు సాగుతామని స్పష్టం చేసింది.మరో పక్క.. తాను అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఐదు యుద్ధాలను ఆపినట్లు ట్రంప్ ప్రకటించుకున్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని తానే ఆపుతానంటూ చెబుతూ వస్తున్నారు కూడా. ఈ క్రమంలో.. ఉక్రెయిన్ శాంతి చర్చల్లో భాగంగా ఈ నెల 15వ తేదీన అలస్కాలో ట్రంప్-పుతిన్ భేటీ కానున్నారు. అయితే తమను చర్చల్లో భాగం చేయకుంటే ఆ చర్చలకు అర్థం ఉండదంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లోదిమిర్ జెలెన్స్కీ మొదటి నుంచి వాదిస్తున్నారు. ఈ క్రమంలో అలస్కా భేటీలో జెలెన్స్కీకి చోటు ఉంటుందా? లేదంటే ట్రంప్‌తో విడిగా భేటీ అవుతారా? అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

## సుంకాలు విధించినా భారత్ వెనక్కి తగ్గట్లేదు

కాస్త కూడా వెనక్కి తగ్గడం లేదని అన్నారు. దీనివల్ల చర్చలు నెమ్మదిగా సాగుతున్నట్లు పేర్కొన్నారు. భారత్‌తో సహా స్విట్జర్లాండ్, ఇతర దేశాలతో పెద్ద పెద్ద వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరగబోతున్నాయని అన్నారు. అక్టోబర్ చివరి నాటికి న్యూదిల్లీ సహా అన్ని ముఖ్యమైన దేశాలతో చర్చలు ముగిసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా ట్రంప్ యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని ట్రంప్ హెచ్చరించినా భారత్ పట్టించుకోలేదు. దీంతో భారీగా సుంకాలు విధించారు. ఇప్పటికే 25% సుంకాలను విధించిన ఆయన.. దానిని 50 శాతానికి పెంచారు. ఆ 25 శాతం అదనపు సుంకాలు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే, ట్రంప్ టారిఫ్‌లకు భారత్ కూడా దీటుగా స్పందించింది. .

## చైనాపై వడ్డింపులకు విరామం

చైనా వాణిజ్య శాఖ కూడా ఇదే రకమైన ప్రకటన చేసింది. అమెరికా ఉత్పత్తులపై అదనంగా విధించిన టారిఫ్‌లకు 90 రోజుల పాటు విరామమిస్తున్నట్లు తెలిపింది.ఈ పరిణా మంతో రెండు దేశాలు తమ మధ్య విభేదా లను చర్చల ద్వారా పరిష్కరించుకునే వెసులుబాటు లభించినట్లయింది. అంతేకాదు, ఈ ఏడాది చివర్లో జరగాల్సిన ట్రంప్- జిన్‌పింగ్‌ల శిఖరాగ్రానికి మార్గం సులువైనట్లేనని భావిస్తున్నారు. తాజా పరిణామాన్ని చైనాతో వాణిజ్యం చేసే అమెరికా కంపెనీలు స్వాగతించాయి. ప్రమాదకర డ్రగ్ ఫెంటానిల్‌పై ఒప్పందం కుదిరితే, అమెరికా టారిఫ్‌లు తగ్గుతాయి, చైనా ప్రతీకార చర్యలను ఉపసంహ రించుకుంటుందని అమెరికా-చైనా బిజి నెస్ కౌన్సిల్ ప్రెసిడెంట్ సీన్ స్టెయిన్ అభి ప్రాయపడ్డారు.దాదాపు అన్ని దేశాలపైనా అత్యధికంగా టారిఫ్‌లు, పన్నులు విధించడం ద్వారా ప్రపంచ వాణిజ్య వ్యవస్థను కకావికలం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా విషయంలో మాత్రం తాత్సారం చేస్తున్నారు.

# కోదండరామ్, అమీర్ అలీఖాన్ కౌన్సిల్ సభ్యత్వంపై సుప్రీం స్టే..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. వారి నియామకాలను నిలిపివేస్తూ తీర్పు ఇచ్చింది. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలను భారత రాష్ట్ర సమితి నేత దాసోజు శ్రవణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్లపై విచారించిన సుప్రీంకోర్టు.. నేడు తీర్పు వెలువరించింది. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని పేర్కొంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పు అని సుప్రీంకోర్టు పేర్కొంది. కోదండరాం, అలీఖాన్‌లు తెలంగాణ గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా నియామకం అయిన విషయం తెలిసిందే. అయితే వీరి నియామకం అక్రమంగా జరిగిందని.. దాసోజు శ్రవణ్, సత్యనారాయణలు గవర్నర్‌కు తెలిపారు. గవర్నర్ వీరి వాదనను తిరస్కరించడంతో.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి నియామకాలపై విచారణ జరిపి నియామకాన్ని రద్దు చేయాలని బీఆర్‌ఎస్ నేతలు సుప్రీంను కోరారు. ఈ మేరకు బుధవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. ఆగస్టు 14, 2024 తీర్పులో మార్పులు చేస్తూ.. వారి నియామకం చెల్లదని తీర్పును వెలువరించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్, అమిర్ అలీఖాన్ నియామకాలపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. వారి నియామకాలను నిలిపివేస్తూ తీర్పు ఇచ్చింది. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని పేర్కొంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పు అని సుప్రీంకోర్టు పేర్కొంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక గవర్నర్ కోటాలో కోదండరామ్, ఆమిర్ అలీఖాన్ నియామకమైన విషయం తెలిసిందే. ఇద్దరిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. అయితే, దీన్ని సవాల్ చేస్తూ బీఆర్‌ఎస్ అప్పటి ఎమ్మెల్సీ అభ్యర్థులు దాసోజు శ్రావణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయా పిటిషన్లపై విచారించిన సుప్రీంకోర్టు.. ఎమ్మెల్సీలుగా కోదండ రామ్, ఆలీఖాన్ ప్రమాణ స్వీకారాన్ని తప్పుపట్టింది. గతంలో ఇద్దరు ఎమ్మెల్సీల ఎన్నికపై సుప్రీంకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పని సుప్రీంకోర్టు పేర్కొంది. ఉత్తర్వులు జారీ చేస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహత ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. వీరిద్దరిని అభ్యర్థిత్వాలను అప్పటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. గవర్నర్ అభ్యర్థిత్వాలను తిరస్కరించడంతో శ్రావణ్, సత్యనారాయణ ఇద్దరూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల అనంతరం 2024 జనవరి 13న ప్రొఫెసర్ కోదండ రామ్, అలీఖాన్ పేర్లను రేవంత్‌రెడ్డి సర్కారు ప్రతిపాదించింది. గవర్నర్ వీరిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదించారు. గవర్నర్ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయించారు.

## న్యాయపోరాటం చేస్తా

**తీర్పు ఇలా వస్తుందని అనుకోలేదు: ఆమీర్ అలీ ఖాన్**

**హైదరాబాద్(జనంసాక్షి):**గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియాకం రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పుపై ఆమీర్ అలీ ఖాన్ మీడియాతో మాట్లాడారు. 'సుప్రీం కోర్టు ఈ విధమైన తీర్పు ఇస్తుందని అనుకోలేదు. కోర్టు ఆర్డర్ చదివిన తర్వాత అన్ని మాట్లాడుతాను.కొద్ది సేపటి క్రితమే సుప్రీం కోర్టులో జరిగిన విషయాల గురించి తెలుసుకున్నారు. నేను మొన్నటి వరకు జర్నలిస్టును.నాకు ఎలాంటి రాజకీయం బ్యాక్ గ్రౌండ్ లేదు.నాటి ప్రభుత్వ పెద్దలు ఇంకా ఏం మాట్లాడలేదు.ఇదే అంశంపై న్యాయ పోరాటం చేస్తాం' అని అన్నారు.

## సుప్రీం తీర్పు చెంపపెట్టు

**కాంగ్రెస్, బీజేపీలకు ఇదో గుణపాఠం కావాలి: కేటీఆర్**

**హైదరాబాద్(జనంసాక్షి):**ఎమ్మెల్సీలు కోదండరాం, అలీఖాన్‌ల నియామకం రద్దు చేస్తూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వాగతించారు. అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పు అటు- బీజేపీకి, ఇటు కాంగ్రెస్‌కు చెంపపెట్టు అని విమర్శించారు. గతంలో బీజేపీ గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేసి బీఆర్‌ఎస్ పంపిన ఇద్దరు ఎమ్మెల్సీ ప్రతిపాదనలకు అడ్డుపడ్డారని గుర్తు చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఆ ప్రక్రియ పెండింగ్‌లో ఉండగానే మరో ఇద్దరి పేర్లను సిఫార్సు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని మండిపడ్డారు.

## రాజ్యాంగ రక్షణకే మా పోరాటం

**సుప్రీం తీర్పుతో కళ్లు తెరవాలి: దాసోజు**

తెలంగాణలో గవర్నర్ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీ నియామకాలను సుప్రీంకోర్టు నిలిపివేస్తూ తీర్పు వెలువరిండాన్ని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ స్వాగతించారు. రాజ్యాంగాన్ని అతిక్రమించి పనిచేసే వారికి ఇదో హెచ్చరిక అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ అంశంపై తాను రెండేళ్ల పాటు- పోరాటం చేశానన్నారు. ఇది వ్యక్తులపై పోరాటం కాదని.. రాజ్యాంగ బద్ధ హక్కుల కోసం చేసిన పోరాటమని ఆయన అభివర్ణించారు. రాజ్యాంగ బద్ధంగా ప్రభుత్వాలు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరికి తగినట్లు- వారు రాజ్యాంగాన్ని అనువదించుకొని అమలు చేయడం సరి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కేసు విషయంలో సెప్టెంబర్ 17వ తేదీన మరోసారి విచారణ జరగనుందని గుర్తు చేశారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి తన రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇక గతంలో తన అభ్యర్థిత్వాన్ని గవర్నర్ తిరస్కరించారని చెప్పారు. ఈ నేపథ్యంలో ధర్మం గెలిచినట్లుగా తాను భావిస్తున్నానని తెలిపారు. గతంలో హైకోర్టు తమ నియామక నిర్ణయాన్ని సైతం తప్పుబడుతూ తీర్పు ఇచ్చిందని తెలిపారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పాత ఆర్డర్‌ను తీసుకు వచ్చి.. ఈ ఇద్దరితో ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయించారని వివరించారు. సుప్రీంకోర్టు ఆర్డర్ కాపీ పూర్తిగా వచ్చిన తర్వాత మిగతా వివరాలు తెలుస్తాయన్నారు. సెప్టెంబర్ 17వ తేదీన సుప్రీంకోర్టు ఏం చెప్తుందో చూడాలని తెలిపారు. భవిష్యత్తులో ఏ గవర్నర్ కూడా ఇలాంటి తప్పిదాలు చేయకుండా సుప్రీంకోర్టు ఆర్డర్ ఇవ్వబోతుందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ స్పష్టం చేశారు. 2024 ఆగస్టు 14న సుప్రీంకోర్టు తీర్పులో మార్పులు చేసిందని గుర్తు

## ఇటు పర్యావరణ పరిరక్షణ, అటు అభివృద్ధి రెండూ ముఖ్యమే

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**తెలంగాణ ప్రభుత్వం పర్యావరణాన్ని, అభివృద్ధిని సమతుల్యం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కంచ గచ్చిబౌలి కేసు విచారణలో సుప్రీంకోర్టు సూచించింది. కంచ గచ్చిబౌలి భూముల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన చర్యలపై బుధవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి కీలక వ్యాఖ్యలు చేశారు. పర్యావరణాన్ని, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం మంచి ప్రతిపాదనలు తీసుకురావాలన్నారు. ఈ సమస్యకు సంతోషకరమైన ముగింపు పలకాలన్నారు. అలాగే అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని జస్టిస్ బీఆర్ గవాయి పేర్కొన్నారు.పర్యావరణాన్ని కాపాడితే అన్ని ఫిర్యాదులు ఉపసంహరిస్తామని, అప్పుడు తాము కూడా రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతామని జస్టిస్ అన్నారు. పర్యావరణాన్ని, అభివృద్ధిని సమతుల్యం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సుప్రీం సూచనల దరిమిలా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రతిపాదనలు తీసుకొచ్చేందుకు ఆరు వారాల సమయం కావాలని సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీ కోరారు.హైదరాబాద్ లోని కంచ గచ్చిబౌలి ప్రాంతంలో ఐటీ పార్క్ అభివృద్ధి కోసం చెట్లను నరికివేయడం, వన్యప్రాణులను మరో ప్రాంతానికి తరలించడం లాంటి చర్యలను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై ఇప్పటికే రెండుసార్లు జరిగిన వాదనల్లో చెట్లను నరికిన వంద ఎకరాల్లో పునరుద్ధరణ పనులు చేపట్టాలని సుప్రీం కోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత అధికారులకు జైలుశిక్ష తప్పదని హెచ్చరించింది.




## యువతిపై సామూహిక లైంగికదాడి

- యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు

**జనగామ ప్రతినిధి, ఆగష్టు 13 (జనంసాక్షి) :** స్నేహితురాలి పై యువకులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. జనగామ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏసిపి పండరి చేతన్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ ప్రాంతానికి చెందిన ఓ బాధితురాలని స్నేహం ప్రేమ పేరుతో కార్లో ఎక్కించుకొని సూర్యాపేట రోడ్లోని టీ వరల్డ్ వెనకాల ఉన్న ఒక రూమ్ లో ఒకరి తర్వాత ఒక అత్యాచారం చేశారు. ప్రేమ పేరుతో వంచించి గోవాకు తీసుకెళ్లి పలుమార్లు అఘాయిత్యం చేశారు.ఈ విషయాన్ని నిందితులు ఒప్పుకున్నారు.ఈ విషయం తెలిసిన బాధితురాలు యొక్క చిన్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి చిన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఈ అత్యాచారానికి పాల్పడిన 10 మంది నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్కు తరలించారు. పై నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన జనగామ ఇన్స్పెక్టర్. దామోదర్ రెడ్డి, ఎస్ ఐ భరత్, మరియు ఎన్ చెన్నకేశవులు, కానిస్టేబుల్లు, రామ క్రిష్ణ,కరుణాకర్, .క్రిష్ణ,మహేందర్,అరవింద్, చరణ్, ఏపీసీ ఆఫీస్ ఆఫీస్ రైటెర్ మాధవ్ కుమార్, అర్చన మరియు సల్మాన్, నాగేష్ లను కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్ ప్రీత్ సింగ్ అభినందించినారు.

## హైడ్రా అన్ని రాష్ట్రాలకు అవసరం

- బతుకమ్మ కుంటను సందర్శించిన ఢిల్లీ మున్సిపల్ బృందం
- 3 నెలల వ్యవధిలో చెరువు నిర్మాణం అపూర్వం
- చెరువు ఇన్లెట్, ఔట్లెట్లను పరిశీలించిన అధికారులు



**హైదరాబాద్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** హైడ్రా వంటి సంస్థ ప్రతి రాష్ట్రంలో ఉండాలని ఢిల్లీ మున్సిపల్ అధికారుల బృందం అభిప్రాయపడింది. అప్పుడే చెరువులు, నాళాలు, కాలువలు ఆక్రమణకు గురికాకుండా ఉంటాయని పేర్కొంది. అంబర్పేటలోని బతుకమ్మ కుంటను ఢిల్లీ మున్సిపల్ అధికారుల బృందం మంగళవారం సాయంత్రం సందర్శించింది. చెరువు చుట్టూ తిరుగుతూ.. అభివృద్ధిని దశలవారీ తెలుసుకుంది. ఒకప్పుడు చెత్త, నిర్మాణ వ్యర్థాలతో నిండిన ప్రాంతం చెరువులా రూపాంతరం చెందడాన్ని చూసి ఆశ్చర్యపోయింది. ఈ చెరువు నిర్మాణం జాతీయ స్థాయిలో చర్చకు వచ్చిందని ఈ బృందానికి నేతృత్వం వహిస్తున్న ఢిల్లీ మున్సిపల్ హార్టికల్చర్ విభాగం అధిపతి డా. ఆశిష్ అన్నారు. కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించడం.., మండు వేసవిలో రెండు మీటర్ల లోతు తవ్వగానే గంగమ్మ తల్లి ఉబికి వచ్చిన వీడియోలను పరిశీలించారు. చెరువు చుట్టూ ఇంకా అభివృద్ధి చేయాల్సిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఢిల్లీలో కూడా చెరువులు చాలవరకు కబ్జాకు గురి అయ్యాయని... హైడ్రా వంటి సంస్థతో వాటిని పునరుద్ధరించడం, పరిరక్షించడం సులభం అవుతుందని అన్నారు.

### ప్రయోజనాలపై ఆసక్తి..

ఈ చెరువు లేనప్పుడు వరద ప్రభావం ఎలా ఉంది... ఇప్పుడు ఎలా ఉంది అనే అంశంపై ఢిల్లీ బృందం ఆరా తీసింది. చెరువుకు ఆనుకుని సాగే మురుగు కాలువలోంచి వరద నీరు మాత్రమే వచ్చేలా ఇన్లెట్ను నిర్మించడాన్ని పరిశీలించింది. ఇటీవల కురిసిన వర్షాల సమయంలో వరద నీరు ఎలా వచ్చి చేరిందో వీడియోల ద్వారా హైడ్రా అధికారులు బృందానికి చూపించారు. ఈ వరద నీరు గతంలో ఎటు వెళ్లేదని.. స్థానికులతో కూడా మాట్లాడి ఈ బృందం తెలుసుకుంది. వరద నీరు తమ బస్తీలను, కాలనీలను ముంచెత్తేది.. ఈ సారి ఆ ముప్పు తప్పిందని వారంతా పేర్కొన్నారు. చెరువు ఔట్లెట్లను కూడా ఈ బృందం పరిశీలించింది. హైడ్రా అధికారులు మోహనరావు, బాలగోపాల్, చెరువులను అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్ ఎండీ పి. యూనస్తో పాటు హెచ్ఎండీఏ, ఏఎస్సీఐ అధికారులు కూడా ఢిల్లీ బృందంతో పాటు బతుకమ్మకుంటను సందర్శించినవారిలో ఉన్నారు.



## తాళ్ల సాయంతో గర్భిణిని వాగు దాటించిన పోలీసులు

**మంచిర్యాల, ఆగస్ట్13 (జనంసాక్షి) :** జిల్లాలో భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. తాండూరు మండలంలోని నర్సాపూర్ వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మారుమూల గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దొడ్డిగూడెంలో తొమ్మిది నెలల గర్భిణి యమునకు పురిటి నొప్పులు వచ్చాయి. ఆమెను వాగు దాటించేందుకు కుటుంబసభ్యులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై కిరణ్ కుమార్.. పోలీసు సిబ్బంది, ఈతగాళ్లను ఘటనాస్థలికి పంపారు. వారు తాళ్ల సాయంతో గర్భిణిని వాగు దాటించి అంబులెన్సులో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె మగబిడ్డకు జన్మనిచ్చినట్టు వైద్యులు తెలిపారు.

## ఇందిరమ్మ రాజ్యంలో నెరవేరుతున్న పేదవారి సొంతింటి కల

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**వరంగల్ ప్రతినిధి, ఆగస్ట్ 13 (జనం సాక్షి):** అర్హుడైన ప్రతి ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించి ఇందిరమ్మ కలలు సహకారం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. బుధవారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని రేకంపల్లి గ్రామంలో మొదటి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం. సందర్భంగా ఘనంగా గృహప్రవేశాన్ని నిర్వహించి ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి అన్నారు.దుగ్గొండి మండలం రేకంపల్లి గ్రామంలో ఇజ్జగిరి విజయ - చేరాలు అనే లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం పూర్తి చేయగా,నర్సంపేట నియోజకవర్గంలో మొట్ట మొదటి ఇల్లు గృహప్రవేశానికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి,లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లతో పేద ప్రజల సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. నియోజకవర్గంలో 3750 ఇండ్లు మంజూరు అయ్యాయని, వాటి నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయని అన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియ అని, అర్హత ఉండి కూడా ఎవరికైనా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాకపోతే వాళ్ళు నిరాశ చెందవద్దని,నిజమైన లబ్ధిదారులు అయితే కచ్చితంగా ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపల్లి దేవేందర్ రావు నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోకల శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చుక్క రమేష్, మాజీ సర్పంచ్ ఎర్రల బాబు వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నూరు కిరణ్ రెడ్డి, ఒలిగే నర్సింగరావు, ఇంగోలి రాజేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జిలు మట్ట రాజు, రొట్టె రమేష్, డైరెక్టర్లు దంజా నాయక్ హింగ రామారావు, మండల నాయకులు జంగిల్ రవి, అజ్మీర రవీందర్ నల్ల వెంకటయ్య పొగాకు వెంకటేశ్వర్లు బ్లాక్ యూత్ అధ్యక్షులు బొమ్మినేని భరత్ రెడ్డి ఎస్సీ సెల్ అధ్యక్షులు మాదాసి సాంబయ్య మండల యూత్ నాయకులు కోరే రాజేష్ సుకిన నాగరాజు సుకిన శ్రీను కొరకల ప్రశాంత్ ఈద సురేందర్ కొలుగూరి సుమంత్ గాండ్ల ప్రతిష్ నిజయోగవర్గ నాయకులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ యంత్రాగం హైఅలర్ట్

- వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్ల పర్యటనలు



**హైదరాబాద్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధిక వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జీహెచ్ఎంసీ యంత్రాగం సర్వసన్నద్ధంగా ఉందని కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు. బుధవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లోని కంట్రోల్ రూం ను కమిషనర్ తనిఖీ చేశారు. ఫిర్యాదులు పై ఆరా తీశారు. కంట్రోల్ రూం కార్యకలాపాలను సమీక్షించారు. 24 ? 7 అప్రమత్తంగా ఉండాలని కంట్రోల్ రూం సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో మోడరేట్ వర్షాలు కురుస్తున్నాయని, బుధవారం సాయంత్రం నుండి అధిక వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ అప్రమత్తం చేసిందన్నారు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ ఉద్యోగులకు సెలవులు రద్దు చేశామని చెప్పారు. ఉన్నతాధికారులను హెడ్ క్వార్టర్ లో ఉండాలని ఆదేశించామన్నారు. ఇప్పటికే జోనల్ కమిషనర్ లు, డిప్యూటీ కమిషనర్ లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని గమనిస్తూ అపసవ్యతలను చక్కదిద్దుతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారని అన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు శిథిలావస్థకు చేరిన భవనాల లో నివాసం ఉంటున్న ప్రజలను ఖాళీ చేయిస్తున్నారు. పౌరుల ఫిర్యాదులపై స్పందించేందుకు, సహాయక కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ప్రభావంతంగా చేపట్టేందుకు పోలీస్, హైడ్రా, విద్యుత్, జలమండలి, మెట్రో రైలు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సమన్వయంతో నగరంలో ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం వాటిల్లకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. రిలీఫ్ కార్యకలాపాలను డిప్యూటీ కమిషనర్, స్థానిక తహసీల్దార్లు చూసుకుంటున్నారు. జీహెచ్ఎంసీకి అప్లికేషన్ , కంట్రోల్ రూమ్, మీడియం ద్వారా వచ్చే ప్రజా ఫిర్యాదుల పై సత్వరమే స్పందిస్తున్నామని చెప్పారు. నాలా ల వద్ద రక్షణ చర్యలు చేపట్టామనీ ప్రజలు లోతట్టు ప్రాంతాల లోకి వెళ్లకూడదని కమిషనర్ సూచించారు.

### అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దు

నగరంలో వర్షాల నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. నగర ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దనీ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మ్యాన్ హోల్ లను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవవద్దు అని కమిషనర్ జీహెచ్ఎంసి, జలమండలి, హైడ్రా సిబ్బంది, ప్రజలకు సూచించారు. మ్యాన్ హోల్ పై ఏమైనా ఫిర్యాదులు ఉంటే జీహెచ్ఎంసి కంట్రోల్ రూమ్ కు సమాచారం ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ చోకింగ్ పాయింట్ లపై ప్రత్యేక ఫోకస్ పెట్టాం. ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీస్, హైడ్రాతో సమన్వయం చేసుకుంటున్నాం. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా కృషి చేస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో భూగర్భ సంపులను నిర్మిస్తామని కమిషనర్ తెలిపారు.

## తెలంగాణ వ్యాప్తంగా రెడ్అలర్ట్

- రాష్ట్రంలో మూడు రోజులపాటు అతిభారీ వర్షాలు
- నిండుకుండలా సాగర్, శ్రీశైలం
- ఇరు జలాశయాల నుంచి గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన అధికారులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ అంతటికీ రెండ్రోజుల పాటు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న తెలిపారు. రాష్ట్రంలో ఐదు రోజుల పాటు- గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. ఉత్తర తెలంగాణలో 17న వర్ష తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిరది. దీని ప్రభావంతో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు- భారీ వర్షాలు కురుస్తాయని నాగరత్న తెలిపారు. శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో ఏడు గేట్ల ద్వారా అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు ఇన్ఫ్లో 1,89,651 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 2,89,784 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 35,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,336 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఏడు స్పిల్ వే గేట్ల ద్వారా 1,89,133 క్యూసెక్కులు నాగార్జునసాగర్కు విడుదల చేస్తున్నారు. శ్రీశ్కెలం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.70 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 202.05 టీఎంసీలుగా కొనసాగుతోంది నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టులో 26 గేట్లు- ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. జలాశయం వద్ద ఇన్ఫ్లో 2,28,601 క్యూసెక్కులు, ఔట్ ఫ్లోలో 2,47,986 క్యూసెక్కులుగా ఉంది. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు.. కాగా ప్రస్తుత నీటిమట్టం 589.20 అడుగులుగా నమోదైంది. పూర్తి నీటినిల్వ సామర్థం 312.04 టీఎంసీలు.. కాగా ప్రస్తుతం 309.65 టీఎంసీలకు చేరింది. తెలంగాణ వ్యాప్తంగా గత వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు జిల్లాల్లో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు చెరువులు, కుంటలు వరదలతో నిండిపోయాయి. దీంతో దుగువ ప్రాంతాలకు వరద ప్రవాహం ఉదృతంగా కొనసాగుతోంది. ఇక, భారీ వర్షాలతో నాగార్జునసాగర్ జలాశయంలోకి పెద్ద ఎత్తు వరద నీరు వచ్చే చేరుతుంది. దీంతో సాగర్ డ్యామ్ నిండుకుండలా మారింది. ఈక్రమంలో అధికారులు జలాశయం 26 గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం వద్ద జలకళ సంతరించుకోవడంతో అధిక సంఖ్యలో జనాలు వస్తున్నారు. సాగర్ అందాలను చూసేందుకు వచ్చే సందర్శకులతో డ్యామ్ వద్ద సందడి వాతావరణం నెలకొంది.

## బోనమెత్తిన మంత్రి కొండా సురేఖ



**పాలకుర్తి, ఆగస్టు 13 (జనంసాక్షి):** దేవాదాయ శాఖ అడిషనల్ కమీషనర్ శ్రీనివాస్ రావు పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మెన్ గంగు ఉపేంద్ర శర్మ మరియు రాష్ట్ర జాక్ కన్వీనర్ డి.వి.ఆర్ శర్మ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో స్వయంభువు గా వెలసిన బంగారు మైసమ్మ తల్లి బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించారు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు, .పోతరాజు ల విన్యాసాల మధ్యన దేవాదాయ శాఖ మహిళ ఉద్యోగుల నృత్యాల తో అమ్మ వారి ఉత్సవం మహా వైభవంగా నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.బంగారు మైసమ్మ తల్లి చాల మహిమాన్వితురాలు అమ్మ దయతో దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ దేవాలయాల నిర్వహణతో భక్తులకు పూజ కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దీవించారు. తదనంతరం గత కొన్ని నెలలుగా దేవాదాయ శాఖ పరిధిలోనీ పలు దేవాలయాలలో పని చేస్తూ సర్వీసు మధ్యలో అకాల మరణం చెందిన అర్చక సిబ్బంది పిల్లలకు 8 మందికి కారుణ్య నియామక పత్రాలు మంత్రి సురేఖ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సంయుక్త కమిషనర్ రామకృష్ణారావు.డిప్యూటీ కమిషనరులు వినోద్ రెడ్డి కృష్ణప్రసాద్, వెంకటేష్ లు,కమిషనరేట్ సూపరిండెంట్ బాబు శంకర్, సిబ్బంది హరీష్,భాస్కర్,అర్చక ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు మూర్తి సత్యనారాయణ శర్మ రామలింగశర్మ,తదితరులు పాల్గొన్నారు.

## మేకకు ఆకుల కోసం వెళ్లి నాలాలో పడ్డ వ్యక్తి

- నిచ్చెన వేసి కాపాడిన స్థానికులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మేకకు ఆహారం కోసం ఆకులు కోయడానికి వెళ్లిన ఓ వ్యక్తి.. పట్టుతప్పి నాలాలో పడిపోయాడు. హైదరాబాద్లోని పాతబస్తీ పరిధి యాకుత్పురాలో ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. గౌస్ అనే వ్యక్తి తన మేక కోసం ఆకులు కోస్తూ.. ఉధృతంగా ప్రవహిస్తున్న నాలాలో ప్రమాదవశాత్తూ పడిపోయాడు. స్థానిక ఎంఐఎం కార్పొరేటర్ మహమ్మద్ వాసే.. స్థానికుల సాయంతో అతడిని కాపాడారు. నిచ్చెన వేసి తాడు సాయంతో బయటకు లాగారు. అతడు క్షేమంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. హైదరాబాద్ పరిధిలో భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే.

### వామన్రావు దంపతుల హత్యకేసులో
## సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** న్యాయవాద దంపతులు గట్టు వామన్ రావు – నాగమణి హత్య కేసులో సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్రావు అన్నారు. ఈ తీర్పు, రాష్ట్ర ప్రభుత్వాల విచారణ సంస్థలపై ప్రజలలో పెరుగుతున్న అవిశ్వాసానికి స్పష్టమైన నిదర్శనమన్నారు. బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రజలు ఆశించినట్లుగానే, ఈ దారుణ హత్య కేసు దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగిస్తూ సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేయడం, న్యాయం పట్ల నమ్మకాన్ని మరింత బలపరుస్తుందని పేర్కొన్నారు. వామన్ రావు – నాగమణి దంపతులపై జరిగిన ఈ క్రూరమైన హత్య, రాష్ట్రంలో న్యాయవాదుల భద్రతపై పెద్ద ప్రశ్నలు లేవనెత్తింది. స్థానిక విచారణ సంస్థలు నిజాన్ని వెలికితీయడంలో విఫలమవుతాయన్న భయం, సాక్ష్యాలను మాయ చేయడం, ఒత్తిళ్లతో కేసును బలహీనపరిచే ప్రయత్నాలు ప్రజల్లో ఆందోళన కలిగించాయని, సీబీఐ విచారణ ద్వారా నిజానిజాలను వెలికితీసి, దోషులకు చట్టపరమైన కఠిన శిక్షలు విధించడానికి కృషి చేస్తుందని, ఈ కేసు, భవిష్యత్తులో ఇలాంటి దారుణాలకు పాల్పడే వారికి గట్టి హెచ్చరికగా నిలవాలి. అదేవిధంగా, ఈ తీర్పు దేశవ్యాప్తంగా న్యాయం పట్ల విశ్వాసాన్ని పెంపొందించడానికి ఒక మైలురాయి అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఎమ్మెల్సీగా ఉన్న సమయంలోనే, న్యాయవాదుల భద్రత కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలని నేను రాష్ట్ర ప్రభుత్వాన్ని అనేకసార్లు డిమాండ్ చేశానని, ఈ అంశంపై శాసన మండలిలో పునరావృతంగా మాట్లాడానని, కానీ అప్పటి ప్రభుత్వాలు ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేశాయని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తన మేనిఫెస్టోలో న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీని ఇప్పటికైనా నెరవేర్చాలని సూచించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ ను తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## భారత్పై అమెరికా సుంకాలతో తీవ్రనష్టం

- సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు రాఘవులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** భారత్పై అమెరికా 50 శాతం సుంకాలను విధించడం వల్ల తీవ్ర–నష్టం కలుగుతుందని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. అమెరికా విధించిన సుంకాలను వెంటనే ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు. భారత్పై అమెరికా విధిస్తున్న టారిఫ్లకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్లోని ఆర్టీసీ క్రాస్రోడ్స్పై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్లకార్డులను ప్రదర్శించి అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ అమెరికా విధించిన సుంకాలతో తీవ్రనష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. భారత్ ఎగుమతులు చేసే వస్తువులపై అమెరికా 50 శాతం సుంకాలను మోపిందని వివరించారు. ఇప్పటికే ఎగుమతులు పడిపోయాయని అన్నారు. సుంకాల భారంతో విదేశాల్లో భారతీయ వస్తువులను ఎక్కువ ధరకు అమ్మాల్సి వస్తుందన్నారు. దీంతో కొనుగోళ్లు లేక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్లో ఫార్మా పరిశ్రమ విస్తరించి ఉందన్నారు. సుంకాల పెంపుతో ఫార్మారంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్పారు. హైదరాబాద్ ఐటీ సేవలకూ నష్టం కలుగుతుందన్నారు. సుంకాల విధించడం వల్ల ఐటీ సంస్థలు నష్టపోతాయని అన్నారు. అమెరికా సుంకాల వల్ల ఐటీ పరిశ్రమ కుదేల్ అవుతుం దన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని చెప్పారు. సుంకాలు విధించడం వల్ల రాష్ట్రంపై ఎలాంటి ప్రభావం పడుతుందో ప్రభుత్వం ఓ పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విదేశాల నుంచి వ్యవసాయం, ఇతర వస్తువులను దిగుమతి చేసుకోవద్దంటూ కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ట్రంప్నకు సేవకుడిగా మోడీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భారత ప్రజలకు మోడీ సేవకుడిగా పనిచేయాలని సూచించారు.

### అమెరికా వస్తువుల దిగుమతిపై జీరో సుంకాలా? : జాన్వెస్లీ

ప్రపంచ దేశాలపై అమెరికా పెత్తనం సాగిస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ విమర్శించారు. సైనిక చర్యలు, ఆయుధవ్యాపారంతో దోపిడీ చేస్తున్నదని చెప్పారు. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై 50 శాతం సుంకాలు విధిస్తున్నదని అన్నారు. కానీ అమెరికా నుంచి భారత్కు దిగుమతి అయ్యే వస్తువులపై జీరో సుంకాలుండాలంటూ మోడీ ప్రభుత్వంపై ట్రంప్ ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. అమెరికా సామ్రాజ్యవాదానికి లొంగిపోవడం సమంజసం కాదన్నారు. అమెరికాకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య, టి సాగర్, ఎండీ అబ్బాస్, బండారు రవికుమార్, ఎండీ జహంగీర్, హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం వెంకటేష్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థపై

# నమ్మకం లేని పాలకులు



అబ్రహం లింకన్ "ప్రజాస్వామ్యం అనేది ప్రజలచే, ప్రజల కొరకు, ప్రజలచే ఏర్పడిన ప్రభుత్వం" అని నిర్వచించాడు. ఇది గెట్టిస్‌బర్గ్ ప్రసంగంలో ఆయన చేసిన ప్రసిద్ధ ప్రకటన. "ప్రజాస్వామ్యం అనేది ప్రజలచే, ప్రజల కొరకు, ప్రజలచే ఏర్పడిన ప్రభుత్వం" అనే లింకన్ యొక్క నిర్వచనం, ప్రజాస్వామ్యం యొక్క సారాంశాన్ని తెలియజేస్తుంది. ఈ నిర్వచనం ప్రకారం, ప్రభుత్వ అధికారం ప్రజల నుండి ఉద్భవించి, ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలి.లింకన్ ఈ మాటలను గెట్టిస్‌బర్గ్‌లో జరిగిన యుద్ధంలో అమరవీరులైన సైనికుల జ్ఞాపకార్థం ఒక సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రసంగం అమెరికన్ చరిత్రలో ఒక మైలురాయిగా పరిగణించబడుతుంది. ప్రజాస్వామ్యం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.

భారతదేశాన్ని సార్వభౌమ, సోషలిస్ట్, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ప్రకటిస్తుంది, దాని పౌరులకు న్యాయం, సమానత్వం, స్వేచ్ఛను హామీ ఇస్తుంది ,సోదరభావాన్ని ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తుంది. 1950 నాటి అసలు రాజ్యాంగం న్యూఢిల్లీలోని పార్లమెంట్ లైబ్రరీ భవనంలో హీలియం నిండిన కేసులో భద్రపంచబడింది. భారత్ అని కూడా పిలువబడే భారతదేశం, రాష్ట్రాల యూనియన్. ఇది పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థ కలిగిన సార్వభౌమ సోషలిస్ట్ లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం. రాజ్యాంగ సభ 1949 నవంబర్ 26న ఆమోదించి, 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం ప్రకారం ఈ గణతంత్రం పరిపాలించబడుతుంది. రాజ్యాంగం కొన్ని ఏకీకృత లక్షణాలతో సమాఖ్య నిర్మాణంలో ఉండే పార్లమెంటరీ ప్రభుత్వ రూపాన్ని అందిస్తుంది. యూనియన్ కార్యనిర్వాహక వ్యవస్థ యొక్క రాజ్యాంగ అధిపతి అధ్యక్షుడు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 79 ప్రకారం, యూనియన్ పార్లమెంట్ కౌన్సిల్‌లో అధ్యక్షుడు, రాష్ట్రాల మండలి (రాజ్య సభ), ప్రజల సభ (లోక్‌సభ) అని పిలువబడే రెండు సభలు ఉంటాయి.రాజ్యాంగంలోని ఆర్టికల్ 74(1) ప్రకారం ప్రధానమంత్రి అధిపతిగా ఒక మంత్రి మండలి ఉంటుంది, రాష్ట్రపతికి సహాయం చేయడానిక, సలహా ఇవ్వడానికి, ఆయన సలహా మేరకు తన విధులను నిర్వర్తిస్తారు. నిజమైన కార్యనిర్వాహక అధికారం ప్రధానమంత్రి అధిపతిగా ఉన్న మంత్రి మండలిలో ఉంటుంది.

2.పాలకులు పెట్టుబడిదారీ వ్యవస్థను. రాజ్యాంగ నిర్మాతకు పాలకుల మీద నమ్మకం లేనందున ప్రజా విద్రోహ పాలనను ప్రజలు చిదిమి వేసి అనుకూల యంత్రాంగాన్ని నిర్మించుకుంటారని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన హెచ్చరిక సాకారమయ్యేరోజెంతో దూరంలో లేదు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారానికి వస్తున్న పాలకులే రాజ్యాంగాన్ని నిర్లక్ష్యం చేసి ప్రజలను అవమానించి ప్రజా పాలన మీద అసహనం వ్యక్తం చేస్తున్న కారణంగా ఎంతో గొప్పగా రచించుకున్న రాజ్యాంగం అమలు లోపభోయిష్టంగా మారడం ప్రజల ఆశలు ఆకాంక్షలు నామమాత్రం కావడం ఆలోచించ తగినది రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా. 2 సంవత్సరముల 11 నెలల 18 రోజులపాటు దేశ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి భారత ప్రజానీకం యొక్క ఆకాంక్షలకు అనుగుణంగా 395 ప్రకరణములు 8 షెడ్యూలు 22 భాగాలతో రాజ్యాంగం అమలులోనికి వస్తే నేడు అనేక రాజ్యాంగ సవరణల తర్వాత 448 ప్రకరణములు 25 భాగాలు 12 షెడ్యూలతో విస్తృత రూపాన్ని సంతరించుకున్నప్పటికీ రాజ్యాంగం ఆమోదం పొంది 78 సంవత్సరాల తర్వాత కూడా రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి దేశవ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల తో పాటు అభద్రతకు గురైనటువంటి ప్రజానీకం గొంతెత్తి నినదించడం ఆందోళన కలిగించే విషయం. రాజ్యాంగం ఒక సమగ్ర శాసనమైతే ఆ చట్టాన్ని ఆమోదించి తగను గుణంగా జన రంజక పాలన సాగించే బదులు బాధ్యతలు విస్మ రించి, ప్రజలను వంచించి, బానిసలుగా మార్చి రాజ్యాంగం పట్ల అసహనం వ్యక్తం చేసే దుస్థితికి పాలకులు దిగజారడాన్ని ముక్తకంఠముతో ఖండించవలసిన అవసరం ఉన్నది .అంతేకాదు ఊరు వాడ ప్రతిచోట కూడా రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడిన ప్రభుత్వ చర్యలను ఏ కరువు పెట్టాల్సిన అవసరం కూడా ఎంతో ఉన్నది. రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసి, మత్తు మద్యం తదితర రుగ్మతల బారిన యువతను నిండా ముంచుతున్న ప్రభుత్వ చర్యలను యావత్ దేశ ప్రజానీకం ఖండించవలసిన అవసరం ఉన్నది . దోపిడీ, పీడన, వంచన, హత్యలు, ఆత్మహత్యలు, అత్యాచారాల నీడన అనగారిన అట్టడుగు వర్గాలు క్షణక్షణం భయాందోళనల మధ్యన కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వ మద్దతుతో గూండాలు రౌడీయిజం నేరస్తులు చట్టసభల్లో చట్టసభల బయట ఇష్టా రాజ్యంగ వ్యవహరిస్తూ దేశాన్ని నేరపూరితంగా మార్చడం అంటే పెట్టుబడుదారులకు వంత పాడడమే కాదు తమ సామాజిక రాజకీయ బాధ్యతలను పాలకులు విస్మరించడమే అవుతుంది. ప్రపంచంలోనే చాలా దేశాల రాజ్యాంగాలను పరిశీలించి సమగ్రమైన శాసనాన్ని తయారు చేసే క్రమంలో ప్రజలే కేంద్రంగా ఎంతో శ్రద్ధ కనపరిచినప్పటికీ ఆ తదనంతరం గత 75 సంవత్సరాలుగా మాత్రం ప్రభుత్వం క్షణక్షణం పెట్టుబడిదారులకు వంత పాడుతూ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతూ నేర సామ్రాజ్యాన్ని ఏలుతూ చట్టసభలను నేరస్తులకు అడ్డాగా మార్చిన టువంటి ప్రస్తుత పరిస్థితి పైన ప్రజలందరూ తిరుగుబాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉన్నది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆ తదనంతర కాలంలో దేశ న్యాయశాఖ మంత్రిగా కొనసాగినప్పటికీ దేశ అవసరాలు, ప్రజల యొక్క ఆకాంక్షలకు అనుగుణంగా, పాలన దారితప్పినప్పుడు రాజీనామా చేసి తన చిత్తశుద్ధిని ప్రదర్శించుకున్నాడు తప్ప పాలన యంత్రాంగాన్ని ప్రభావితం చేయలేక పోయినాడు అంటే ప్రభుత్వం అనాదిగా ఎవరి చేతుల్లో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ 90 శాతం గా ఉన్నటువంటి మెజారిటీ పేద అట్టడుగు ఆదివాసి వర్గాలకు పాలనలో చట్టసభల్లో విద్యా ఉద్యోగ అవకాశాలలో అంతగా అవకాశం లేకపోగా చట్ట సభల్లో మాత్రం అధికారమంతా తమ గుప్పిట్లోనే పెట్టుకొని 56% ఉన్నటువంటి బీసీ వర్గాలు తమ దామాషా ప్రకారంగా రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించాలని అధికారంలో వాటా కావాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా పోరాటం చేస్తున్నప్పటికీ న్యాయబద్ధమైన డిమాండ్ ను కనీసంగా ఆలోచించడానికి కూడా కేంద్ర ప్రభుత్వం అంగీకరించడం లేదు. అధికారానికి దూరమైతే పాలకుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. పాలన గాడి తప్పినప్పుడు ప్రజల ఆకాంక్షలు నెరవేరనప్పుడు సాధారణంగా రాజ్యాంగము భ్రష్టు పట్టిపోయిందని రాజ్యాంగము తన కర్తవ్యాన్ని సామాజిక ధర్మాన్ని కోల్పోయిందని విమర్శించడం ఆనవాయితీగా ఉంటుంది కానీ రాజ్యాంగము తన ధర్మాన్ని ఎక్కడా కూడా విస్మరించకుండా పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారిన సందర్భం అనేక అంశాలను నిర్లక్ష్యానికి గురిచేస్తూ మొక్కుబడి రాజ్యాంగాన్ని కొనసాగిస్తున్నటువంటి పాలకులను వారికి అనుకూలమైనటువంటి పెత్తందారి పెట్టుబడిదారీ వర్గాన్ని మాత్రమే నిందించాల్సిన అవసరం ఎంతగానో ఉన్నది . ఇప్పటికీ రాజ్యాంగబద్ధ పదవులలో ఉన్నటువంటి అనేకమంది అత్యంత దయనీయ స్థితి నుండి వచ్చిన వాళ్లే అయినా రాజ్యాంగంలోని వెసులుబాటు కారణంగా ఆ పదవిలో ఉన్నారు అని వాస్తవాన్ని రాజకీయ నాయకులు గుర్తిస్తే మంచిది.

విద్యా వైద్యాన్ని సామాజిక న్యాయాన్ని ఈ దేశంలో ప్రజలకు ఉచితంగా అందించాలని భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు స్పష్టంగా ప్రకటిస్తూ ఉంటే అంతేకాదు ఈ దేశ సంపద ఏ కొద్ది మంది చేతుల్లో పోగు పడకూడదు అని ఆదేశిస్తుంటే కూడా 40% సంపద కేవలం ఒక్క శాతంగా ఉన్నటువంటి బడా సంపన్న వర్గాల చేతిలోనే బందీ అయిపోయింది అంటే అర్థం చేసుకోవచ్చు ఏ రకంగా ఈ రాజ్యాంగాన్ని పాలకులు భ్రష్టు పట్టించి బురద చల్లే ప్రయత్నం చేసినారో.. విద్యా వైద్యానికి సంబంధించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఒక దశలో ఉచితంగా ప్రజలకు అందించడానికి పాలకులు ఎప్పుడూ కూడా సిద్ధపడరని ఉచితంగా అందించడానికి ప్రయత్నం చేస్తే పాలకుల యొక్క మనుగడ పునాదులే పెకిలించబడతాయని ప్రజలు చైతన్యవంతులై ఆరోగ్యంగా ఉన్నప్పుడు పాలకుల యొక్క లోపాలను గుర్తించి తరిమి కొడతారని తెలుసు కనుకనే అని హెచ్చరించిన తీరు మనం స్మరణకు తెచ్చుకోవాల్సిన అవసరం కూడా ఉన్నది . "అయితే రాజ్యాంగం ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయనప్పుడు లేదా పాలకులు రాజ్యాంగాన్ని నామమాత్రంగా ఉంచి తమ వ్యక్తిగత ఎజెండాను అమలు చేస్తూ రాజ్యాంగానికి ద్రోహం తలపెట్టినప్పుడు ప్రజలు నీశబ్దంగా ఉండరని తమ చైతన్యాన్ని ఆలోచన ధోరణిని ప్రదర్శించి దుష్ట పరిపాలనను చి దిమివేస్తారని తమకవసరమైనటువంటి అనుకూలమైన రాజ్యాంగ యంత్రాంగాన్ని నిర్మించుకుంటారని కూడా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ హెచ్చరిక చేసి ఉన్నాడు. అంటే రాజ్యాంగం అమలులో ఎదురయ్యే సమస్యలు పాలకుల యొక్క నాటకాలు ఏ స్థాయిలో ఉంటాయో అర్థం చేసుకోవడానికి కుట్ర,కుతంత్రాలు మనకు తోడ్పడుతాయి. 75 సంవత్సరాల తర్వాత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని కొందరు పిలిపిస్తుంటే మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి అందులోని సారాన్ని ప్రజలకు పంచడానికి అనుకూలమైన పాలకవర్గాలను ఎంపిక చేసుకోవడానికి తగిన సమర్థత కలిగిన నిబద్ధత కలిగిన పాలకులను ఎన్నుకోవడమే గీటురాయి అని ఆ వైపుగా ప్రజా ఉద్యమాలతో నికృష్ట పాలనను అంతం చేసి అనుకూల పాలన వైపుగా ప్రజలు దృష్టి సారించాలని వస్తున్న ప్రజా పోరాటాలను కూడా ప్రజలు పరిశీలించి ఆ వైపుగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం కూడా ఎంతగానో ఉంది. 17వ లోక్సభలో 87% ప్రస్తుత రాజ్యసభలో 36 శాతం మంది నేర ప్రవృత్తి లేదా నేరచరిత్ర ఉన్నవాళ్లే సభ్యులుగా ఉన్నారని ప్రభుత్వ గణాంకాలే తెలియజేస్తున్నప్పుడు పార్లమెంటు వంటి చట్టసభలు ప్రజలకు అనుకూలమైనటువంటి చట్టాలను తయారు చేసే సందర్భంలో సుదీర్ఘంగా చర్చించకుండా నామమాత్రంగానే ఆమోదిస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం గతంలో చేసిన విమర్శ పరిశీలించవలసిన బాధ్యత కూడా ప్రజలదే. ప్రజలు తమను తాము మరిచిపోయినా, పాలకుల యొక్క లొసుగులను పట్టించుకోకపోయినా నేరస్తులు రాజ్యమేలుతుంటే మౌనంగా ఉన్న దేశ ప్రజలు నిరంతరం బానిసలుగా బతకాల్సిందే. అత్యున్నత పదవిలో ఉన్న వారికి సామాన్యుని కూడా ఒకే ఓటు హక్కును సమకూర్చడం ద్వారా వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని ప్రజలు యజమానులుగా ప్రభువులు గా కొనసాగుతారా లేక బానిసలుగా మిగిలిపోతారా తేల్చుకోమని అంబేద్కర్ చేసిన హెచ్చరికపై ఇకనైనా దృష్టి సారించి రాబోయే ప్రమాదాలను అరికట్టడానికి ప్రజా ఉద్యమాల ద్వారా ఒకటి కాకుంటే రాజ్యాంగ నినాదం రాజ్యాంగ పరిరక్షణ మొక్కుబడిగా మిగిలిపోతే పాలకులు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉంటుంది అనేది గత 78 ఏళ్ల పాలన అనుభవంగా తీసుకుంటే కానీ అర్థం కాదు.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

## ఆ అగ్నిశిఖని మరువం

### స్నేహ శీలి,ధీర వనిత, ప్రముఖ కవయిత్రి, ప్రజా గాయని,అనిశెట్టి రజితకు నివాళి



తెలుగు సాహిత్య లోకంలో ఒక ధిక్కార స్వరం మూగబోయింది. ప్రముఖ కవయిత్రి, ప్రజా గాయని, రచయిత్రి అనిశెట్టి రజిత గుండెపోటుతో ఆగస్ట్ 11, 2025న వరంగల్‌లో మనలను శాశ్వతంగా విడిచిపోయారు. ఆమె లేని లోటు కేవలం ఒక వ్యక్తి నష్టం మాత్రమే కాదు, తెలంగాణ సాహిత్యం, ఉద్యమాలకు, స్త్రీవాద భావనలకు తీరని లోటు. రజిత జీవితం ఒక స్ఫూర్తి దాయకం. శ్రమజీవుల పక్షాన నిలిచి, అణచివేతలకు వ్యతిరేకంగా కలం పట్టిన యోధురాలు. ఆమె రచనలు సామాజిక అసమానతలను ఎధిరిస్తూ, ప్రశ్నిస్తూ, మానవత్వాన్ని ప్రకటిస్తాయి.

అనిశెట్టి రజిత 1958 ఏప్రిల్ 14న వరంగల్‌లో జన్మించారు. విద్యార్థి దశ నుంచే ఆకాశవాణి ద్వారా తెలంగాణ ఉద్యమ సంఘర్షణలు, కవి సమ్మేళనాలు, దాశరథి, ఆరుద్ర వంటి మహనీయుల ఉపన్యాసాలకు ఆకర్షితులయ్యారు. 1969లో తొమ్మిదో తరగతి చదువుతుండగానే తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పాల్గొన్నారు. మలి దశ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ ప్రోత్సాహంతో బహిరంగ సభల్లో ప్రసంగాలు చేసి, ప్రజలను ఉద్యమం వైపు మళ్లించారు. ఈ అనుభవాలు ఆమె రచనల్లో ప్రతిబింబిస్తాయి. 1973లో ఇంటర్ చదువుతున్నప్పుడు 'చైతన్యం పడగెత్తింది' అనే తొలి రచనతో సాహిత్య విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఆమె జీవితం ఉద్యమం మరియు సాహిత్యం మధ్య సమన్వయంతో సాగింది. ఒక చేత్తో ఉద్యమ జెండా, మరో చేత్తో కవిత్వ పతాక చేపట్టింది.

అనిశెట్టి రజిత రచనలు సామాజిక యథార్థాలను స్పృశిస్తాయి. 'గులాబీలు జ్వలిస్తున్నాయి' ఉద్యమ అనుభవాల నుంచి జన్మించింది. అందులో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ప్రతిధ్వనిస్తాయి. 'నేనొక నల్లమబ్బునవుతా' స్త్రీవాద ఉద్యమ ప్రభావంతో రూపుదిద్దుకుంది. మహిళల అణచివేతలను విమర్శిస్తుంది. 'చెమట చెట్టు', 'ఓ లచ్చువ్వ', 'ఉసురు', 'గోరంత దీపాలు', 'దస్తఖత్', 'అనగనగా కాలం', 'మట్టి బంధం', 'నన్వే ఓ నన్వే', 'మార్కెట్ స్మార్ట్ శ్రీమతి', 'నిర్భయాకాశం కింద' వంటి సంపుటాలు ఆమె సాహిత్య పిపాసను చాటుతాయి. హైకూల సంపుటి, ఆచార్య పాకాల యశోదా రెడ్డిపై మోనాగ్రాఫ్ కూడా రాశారు. మొత్తం 500కి పైగా కవితలు, 100కి పైగా వ్యాసాలు, 30కి పైగా పాటలు రచించారు. ఆమె సాహిత్యం కేవలం కళాత్మకం కాదు, సామాజిక మార్పుకు సాధనం. స్త్రీవాదం, దళిత ఉద్యమాలు, తెలంగాణ గొంతుకలు ఆమె రచనల్లో మిళితమవుతాయి. ఉదాహరణకు, 'నిన్ను నీవు వదులుకున్న రోజు' కవితలో ఆమె ఇలా అంటారు: "నిన్ను నీవు వదులుకోని రోజు/ ఎవరిని ప్రేమించలేవు/ బతికున్న శవంగానే మిగిలిపోతావు". ఇది వ్యక్తిగత స్వేచ్ఛ మరియు ప్రేమ మధ్య సంబంధాన్ని విశ్లేషిస్తుంది, మానవత్వాన్ని హృదయానికి దగ్గర చేస్తుంది.

ఆమె వ్యక్తిత్వం స్నేహశీలి, సాదాసీదా. ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) జాతీయ అధ్యక్షురాలిగా, సాహిత్య సమావేశాల్లో ఆమె మాటలు యువ రచయితలను ప్రేరేపిస్తాయి. ఆమె సాహిత్యం మట్టి బంధం లాంటిది – సమాజం పట్ల బాధ్యతావంతం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనేక అవార్డులు అందుకున్నారు: 2014లో తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, 2016లో అలిశెట్టి ప్రభాకర్ పురస్కారం. ఆమె రచనల్లో స్త్రీవాదం ప్రబలంగా కనిపిస్తుంది. 'ధిక్కారం' కవితలో: "ఇక నీ ఆటలు సాగనివ్వం/ నీ తోకను ముడువకుంటే/ నీ పీకను వధ్యశిలపై పెట్టు/ నరకటానికి సిద్ధంగా ఉన్నాం/ ఖబడ్దార్! మృగాధిపత్యమా". ఇది పురుషాధిక్యతపై ధిక్కారం, స్త్రీల శక్తిని ప్రకటిస్తుంది. ఆమె సాహిత్యం మానవత్వాన్ని ఉద్దీప్తం చేస్తుంది – పీడితుల పక్షాన నిలిచి, సమానత్వం కోసం పోరాడుతుంది.

రజిత మానవత్వం ఆమె చర్యల్లో ప్రతిఫలిస్తుంది. గతేడాది శరీర దానం అంగీకరించి, మరణానంతరం నేత్రదానం చేసి, భౌతికకాయాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఇది ఆమె సదాశయానికి నిదర్శనం. ఆమె రచనలు కేవలం పదాలు కావు, జీవిత దర్శనం. 'ఆఖరి మగాడు'లో: "మేము ఊరుకోము, మనుస్మృతుల అగ్నికీలల్లో కాలము.. కదంతొక్కుతాం" / "ఈ యుద్ధంలో సమిధలై/ ఆఖరి మొగాళ్లుగా.. నిలుస్తారో... మీ ఇష్టం! / ఆడవాళ్ళు పువ్వులే కాదు... అగ్నిశిఖలని మరువకండి!". ఇది స్త్రీలను అగ్నిశిఖలుగా చిత్రీకరిస్తూ, మార్పుకు పిలుపునిస్తుంది. ఆమె సాహిత్యం సమకాలీన సమస్యలను స్పృశిస్తుంది. లింగ అసమానతలు, వర్గ భేదాలు, పర్యావరణం వంటివి.

రజిత సాహిత్యం ప్రజా పక్షపాతమే. ఆమె కవిత్వం కాకి బంగారం కాదు, అది జీవితాన్ని మార్చే ఆయుధం. స్త్రీవాద ఉద్యమంలో ఆమె రచనలు మహిళల చైతన్యాన్ని పెంచాయి. మానవత్వ దృక్పథం ఆమెలో సహజంగా తోటి మనుషుల బాధల్లో తనను తాను చూసుకునేది. 'నేను అనంతమయిని'లో: "నన్ను గుప్పిట బంధించాలని చూడకు/ అదృశ్యరూపంలో ఉన్న అనంతమయిని/ పుష్పవికాసాన్నే కాదు/ విశ్వప్రళయాన్నీ చూస్తావు". ఇది స్త్రీ శక్తిని అనంతంగా చూపిస్తుంది.

అనిశెట్టి రజిత మరణం తెలుగు సాహితీలోకాన్ని దుఃఖసాగరంలో ముంచింది. ఆమె రచనలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబానికి,బంధు, మిత్రులకు, సాహితీ అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. రజిత లాంటి యోధురాళ్లు మనకు నిరంతర స్ఫూర్తిగా నిలుస్తారు.




**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

### నిశ్శబ్ద రాత్రి ఆలింగనం

ఏదో ఒక రోజు,
నువ్వూ నేనూ
రాత్రి నిశ్శబ్దంలోకి
అదృశ్యమవుతాము.
మన మాటల ప్రతిధ్వనులు
మాత్రమే
గాలిలో మిగిలి,
మన నవ్వుల జాడలు
నక్షత్రాల మధ్య తేలుతాయి.
మన అడుగుల గుర్తులు
ఇసుకలో చెరిపేయబడి,
కాలం అనే అల,
మన జ్ఞాపకాలను నెమ్మదిగా
కడిగేస్తుంది.
కానీ – ఆ రాత్రి,
ఆ నిశ్శబ్దంలో,
మనిద్దరి ఆత్మలు
చంద్రుడి వెలుగులో
ఒకరిని ఒకరు గుర్తించుకుని
నిశ్శబ్దంగా
కౌగిలించుకుంటాయి.
అప్పుడు –
మనం లేమన్న భావమే
ఒక కలలాగా మారిపోతుంది.

**-బాలాజీ పోతుల**
8179283830

## బుద్ధుడు ప్రౌధాన్ మార్క్స్, స్వేఛా వాదాలు




పోతులూరి వీర బ్రహ్మం కూడా కాలజ్ఞానం చెప్పాడు. ఆమ్ స్టర్ డామన్ కూడ చెప్పాడు. వాళ్ల తర్వాత కూడా ప్రపంచం ముందుకు నడిచింది. కత్తుల కాలంలో ఊహించారు కనక కల్కి అనే దశావతారంను గుర్రం, కత్తితో చెప్పారు. ఇట్లా మనిషికోతీరు చెప్పారు. అట్లా మార్క్సుకు ముందు ఎందరో వచ్చారు పోయారు. మార్క్స్ తర్వాత కూడా ఎందరో వచ్చారు . పోయారు. మల్లా కొత్తగా కొత్త తరం వచ్చి కొత్త ఊహలు చేస్తుంది. మార్క్స్ మార్క్సిజం కూడా సవాలక్ష భావాల్లో ఒకటి!. బౌద్ధమే ఆఖరు అనుకున్నారు! అక్కడికి ఆగిందా? మార్క్సిజం, అదే ఆఖరు అంటే ఆగుతుందా? భవిష్యత్‌లో నాలాగ ఇంకా ఎందరో పుడుతారు. వస్తారు. పోతారు. మార్క్సిజం శాశ్వతం కాదు. ఏదీ శాశ్వతం కాదు. శాశ్వతమన్నది ఏదీ శాశ్వతంగా నిలిచి పోలేదు. నిలిచి పోదు. అంతా మారుతుంది. మార్పు నిరంతరమైనది. నిరంతర చలనమే దాని స్వభావం. మార్క్స్ మార్క్సిజం నిరంతర చలనం, మార్పులగురించి మాట్లాడి నప్పటికీ సోషలిజం, కమ్యూనిజం తిరుగలేని మార్పు లేని సత్యాలనుతాయని, అవ్వాలని ఊహించారు. ఆశ పడ్డారు. అది వారి ఆదర్శ వాదం. అంతిమ సత్య అదే పోరాటం కూడా మేం చెప్పినట్టే చేయాలి అన్నారు. తద్వారా మార్క్సిజం మార్పులేని ఒక మ్యాచ్ ఫిక్సింగ్‌గా మారిపోయి కొనసాగుతున్నది. అందువల్లనే ఏ కొత్తది వచ్చినా భయపడి అభద్రతకు లోనై వ్యతిరేకిస్తారు. ప్రజలు ముందుకు పోయి తాము వెక బడిడాము, తమ వెనకున్న జారుకున్నారు అని గమనించి అపుడు వాటిని కులుపుకునే పని మొదలు పెడుతారు. అప్పటికి అవి స్వతంత్ర ఉద్యమాలతో స్వతంత్ర నూతన నాయకత్వంతో ముందుకు సాహుతుంటారు. వారి నాయకత్వంలో పని చేసే బదులు మా నాయకత్వంలో కలిసి పని తేయండి అని పిలుపు నిస్తారు. కుల వ్యవస్థ, పురుషాధిపత్య పితృస్వామిక వ్యవస్థ అంతర్గత వలసాధిపత్యం మొదలైన సమస్యలో వెనకబడి పోయి కేడర్ ను, ప్రజలను కోల్పోయి కేడర్ లేని లీడర్లుగా విగ్రహాలుగా మిగిలి పోతూ వచ్చారు. నాలాగా పేదరికం నుండి కష్టాలుపడి ఎదిగిన ప్రౌధాన్ అంటే నాకు ఇష్టం. పేదలు, కార్మికులు ప్రౌధాన్‌ను మా వాడు అని ప్రకటిస్తేపేదల నాయకత్వం నిలబడు తుంది. మార్క్స్ రావాలా? ఫ్రౌధాన్ కావాలా అంటే మార్పు వైపు మద్దతు ఇస్తే అనుభవంతో కాకుంజా పుస్తకాలు పచ్చి ఎదిగిన అగ్రకుల నాయకత్వమే ఎదుగుతుంది. చదువుకున్న విద్యావంతుల మాటలు ఆకర్ష నీయంగా ఉంటాయి. కష్టజీవుల నుంచి వచ్చిన వారి మాటలు కొందరికి మొరటుగా వుండవచ్చు.

అలా నాకు ప్రౌథాన్ అంటే ఇష్టం. పైగా ఆయన శాంతియుత ఉద్యమం వైపు మొగ్గు చూపాడు. ఇలా ప్రౌధాన్‌కు, బకూనిన్ కు, ట్రాట్స్కీ కు, కొలొంటాయ్ కు, సైమన్ ది బోవర్‌కు , పూలేకు, సావిత్రి బాయి పూలేకు, అంబేద్కర్ కు , పెరియార్ కు, కాన్సీరాం కు కొన్ని ఆదర్శ భావాలున్నాయి. మార్క్సుకు ఒక బలహీనత వుంది. ఎవరినుంచి తీసుకుంటారో వారిని క్షమించడం కష్టం అంటాడు తెలుగు సాహితీవేత్త చలం. కృతజ్ఞత చూపలేనపుడు , గురువుని నమస్కారంతో గౌరవించి ముందుకు పోతే ఈ సమస్య ఉత్పన్నం కాదు. పల్లి చేనులో పల్లి కాయలు అడగకుండా పీక్కొని తింటే దొంగతనం అంటారు. అడిగి కీసుకుంటే పరస్పర గౌరవం.

మార్క్స్ ఎవరి నుంచి తీసుకున్నాడో వారందరిని గౌరవించే బదులు విమర్శించి కించ పరిచే పని చేశాడు. ఈ స్వభావం మార్క్సిస్టు డి ఎన్ఏలో ఇప్పటికీ కొనసాగుతున్నది. కుల సమస్య, దళిత సమస్య, ప్రాంతీయ అసమానతల సమస్య, స్త్రీ పురుషుల అసమానతల సమస్య , వారి పీడన అణిచి వేత, అంతర్గత వలసాధిపత్యం వంటి వాటిని మొదట లేవ నెత్తిన వారిని తిట్టి తిట్టి పూర్వ పక్షం చేయ బోతారు. ఆ ఉద్యమాలు నూతన నాయకత్వంతో ముందుకు సాగి బలమైన శక్తిగా ఎదుగుతాయి. కొంత కాలానికి ప్రజలు ముందుకు పోయి తామే వెనకబడి పోయామని గుర్తించాక మొదట కృషి చేసిన వారిని అపుడైనా గౌరవించకుండా అకస్మాత్తుగా తమకే జ్ఞానోదయం జరిగినట్టు చెప్పుకుంటారు. వారితో కలిసి పనిచేసే బదులు తమ నాయకత్వంలో వచ్చి పని చేయిమంటారు.

వామ పక్ష వాదులకు ఈ స్వభావం మార్క్స్ నుండి అంటు వ్యాధిలా కొనసాగుతున్నది. ఇలా అనేకుల సిద్దాంతాలను, వ్యూహం ఎత్తుగడలను కలుపుకుంటూ సాగిన మహా నదీ ప్రవాహం / అంతర్జాతీయ బ్యాంకు, / అతుకుల బొంత గా ఎదుగుతూ వస్తున్నది. పేదల నుండి ఎదిగిన వారంటే మార్క్సుకు చాలా చిన్న చూపు. ఈసడింపు. ఫ్రౌధాన్ ను విమర్శించి దూరం చేయడంతో అంతర్జాతీయ సోషలిస్టు క్యాంపు రెండుగా చీలి పోయింది. ఒకరు మార్క్సిస్టులయ్యారు. మరొకరు ఫ్రెంచి సోషలిస్టులయ్యారు.

స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం అనే భావం ఫ్రెంచి సోషలిస్టులది. భారత దేశంలో రాం మనోహర్ లోహియా, జయ ప్రకాశ్ నారాయణ్, మధులి మయే, మొదలైన వారు ప్రౌధాన్, సోషలిస్టుల క్రమానికి చెందిన వారు. ప్రౌధాన్ కు చరిత్రలో ప్రధాన్యత తగ్గించడం వల్ల సోషలిస్టు శిబిరమే చీలికలైంది. మార్క్స్ లోని ఇగోయిస్టిక్ బలహీనతే ఇందుకు ప్రధాన కారణం అనుకుంటాను. ప్రౌధాన్ ఒక సోషలిస్టు, తత్వవేత్త. పరస్పర తత్వ శాస్త్రం స్థాపించాడు. ఆర్థిక వేత్త. 1848 ఫ్రాన్సు విప్లవం తర్వాత ఒప్రౌధాన్ ఫ్రెంచ్ పార్లమెంటు సభ్యుడయ్యాడు. . తనను తాను సమైఖ్య వాదిగా పేర్కొన్నాడు. స్వేచ్ఛ సమాజం, వ్యక్తి వాదం యొక్క సంశ్లేషణ అని పేర్కొన్నాడు. దీనిని వ్యక్తి వాద అరాచక వాదం , సామాజిక అరాచక లాదం అని పిలిచారు.

బెనాస్కాన్ లో జన్మించిన ప్రౌధాన్ పుస్తకాలు బాగా ముద్రించడానికి తనకు తానుగా లాటిన్ నేర్చుకున్నాడు. వాటీజ్ ప్రాపర్టీ పుస్తకం 1840 లో ప్రచురించాడు. ఆస్తి అనేది దొంగతనమే అన్నాడు. దాన్ని చదివి మార్క్స్ ప్రౌధాన్ తో ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రారంభించాడు.

ఇద్దరూ ఒకరినొకరు ప్రభావితం చేసుకున్నారు. . మార్క్స్ బహిష్కరణకు గురైనపుడు ఫ్రాన్సు చేరి ప్రౌధాన్ ను కలుసుకున్నాడు. సిస్టం ఆఫ్ ఎకనమిక్ కాంట్రడిక్షన్ అనేవిషయాన్ని ప్రౌధాన్ ఫిలాసఫీ ఆప్ పావర్టీ అని రాసాడు . దానికి మార్క్స్ సౌమ్యంగా కన భావాలను వివరించే బదులుగా రెచ్చగొట్టే శీర్శికతో "ది పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ "రాసాడు. దాంతో వారి స్నేహం ముగిసింది. ఈ వివాదం అంతర్జాతీయ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ యొక్క అరాచక వాదం మరియు మార్క్సిజం మధ్య చీలికకు మూలాలలో ఒకటిగా మారింది. ప్రౌధాన్ కార్మిక మండళ్లు, సహకార సంఘాలను స్థాపించాడు. వ్యక్తిగత రైతు ప్రయివేటు యాజమాన్యం శాంతియుత సామాజిక విప్లవం పద్ధతిలో సాధించ వచ్చని భావించాడు. వడ్డీ లేని రుణాలిచ్చే జాతీయ బ్యాంకు ఏర్పాటు చేయాలని భావించాడు. ప్రౌధాన్‌కు తల్లి చదువు నేర్పింది. కష్టపడి కన్సెషన్ ఫీజు మీద తల్లి కాలేజీలో చేర్పించింది.. ధన వంతుల పిల్లలచే అతను అవమానాలు తిరస్కారాలు ఎదుర్కున్నాడు. పుస్తకాల లైబ్రరీలో చదవడం ! 1827లో ప్రింటింగ్ ప్రెస్ లో అప్రెంటిస్‌గా ప్రారంభం! తరువాతి సంవత్సరం అతని స్కూల్ మేట్ ఆంటోనియన్ గౌథియర్ కుటుంబానికి చెందిన బైసాన్ కాలో చేరాడు. మతపరమైన సాహిత్యం చదివి చదివి వాటిని ప్రశ్నించడం ప్రారంభించాడు. చివరకు క్రైస్తవాన్ని వదిలేసాడు. ఆస్తి అంటే ఏమిటి పుస్తకంలో తన మత పరమైన ప్రయాణం ప్రొటెస్టెంటిజంతో మొదలై నియో క్రిస్టియనిజంగా ముగిసిందన్నాడు. ప్రౌధాన్. క్రమంగా పుస్తకాల ప్రూఫ్ రీడర్ గా ఎదిగాడు. 1829 నాటికి మతం కంటే సామాజిక సమస్యలపై దృష్టి పెంచుకున్నాడు. చార్లెస్ ఫోరియర్ తో పరిచయం జరిగింది. ఆయన తన పుస్తకం ముద్రణ కోసం వస్తే ఆ పుస్తకం ప్రూఫులు ముద్రణ పని చూసాడు ప్రౌధాన్. అతని పుస్తకం, అతనితో చర్చలు జీవితాంతం ప్రభావం వేసాయి. ఇలా ప్రాక్టికల్ జీవితం నుండి అధ్యయనం అవగాహన వికసించింది.

అవగావన.. పెరగడంలో గుస్తావ్ ఫాలోట్, మైఖేల్ డి మోంటైగ్నే , ఇతర ఫ్రెంచ్ సాహిత్యం చదివాడు. సెప్టెంబర్ 1830 లో ట్రావెలో మాన్ కంపోజిటర్‌గా సర్టిఫికేట్ పొందాడు. ఆతరువాత ప్రౌధాన్ జీవితం నిరుద్యోగం పేదరికం. ఫాలోట్ అర్థశాస్త్రం అధ్యయనం చేయడానికి ప్రౌధాన్ ఫ్రాన్సుకు వస్తే ఆర్థిక సాయం చేసాడు. ఫాలోట్ మిత్ర బృందంతో సన్నిహితుడయ్యాడు. ఫాలోట్ కలరాతో చని పోయాడు. 1838 లో ప్రింటింగ్ వ్యాపారం విఫలమయ్యాక పండిత కార్యక్రమాలకు అంకితం కావాలనుకున్నాడు.

1863 లో తన భావాలను కొంత సవరించుకున్నాడు. ది ప్రిన్సిపల్ ఆఫ్ ఫెడరేషన్ c1863)లో రాజ్య వ్యతిరేకత ను సవరించుకున్నాడు. అరాచకత్వాన్ని స్వయంగా నియంత్రించుకునే ప్రభుత్వం అని సవరించాడు. బబుద్ధుడు లా చెప్పిన ప్రౌథాన్‌ను అరాచక వాదం అని కావాలని తప్పుడు అన్వయంతో చితక బాది చివరకు మార్క్స్ అదే స్వీకరించి దాన్ని కొత్త పదాల్లో రాజ్యం క్రమంగా అదృశ్యమవుతుంది అన్నాడు. ఎడం చెయ్యి తీసి పుర్ర చెయ్యి పెట్టు అన్నట్టు! ఇలా మాటల గారడీ తో చదువుకున్న వాల్లు బురిడీ కొట్టిస్తారు. ప్రౌథాన్ బుద్ధుడికి సమీపంగా వచ్చాడు. మార్క్స్ రాజ్యంను అంగీకరించి కమ్యూనిజంలో అదృశ్యమవుతుంది అని వాయిదా వేసాడు. అనుకుంటే మార్పు ఈ క్షణం ఇపుడే మొదలు కావాలి అంటాడు జిడ్డు కృష్ణ మూర్తి. రాజ్యాంగాలు ప్రజాస్వామీకరణను ఆదర్శీకరించాయి. అలా రాజ్యం ప్రజల సమ్మతికి లోబడి కొనసాగే క్రమం మొదలైంది. ఇది బుద్ధుడు, ప్రౌథాన్, జిడ్డు కృష్ణ మూర్తి, బెట్రాండ్ రసెల్, అంబేద్కర్, ఆశించిన క్రమం. దీనిని ఈ నాటికీ అంగీకరించకుండా రాజ్యాంగాన్ని వెనకటి లా అణిచివేత సాధనమనే తప్ప అభివృద్ధి, సంక్షేమంకు ప్రధాన సాధనం అంగీకరించలేకపోతున్నారు.



– యుగకర్త
సామాజిక తత్వవేత్త
**బి ఎస్ రాములు**
తెలంగాణ రాష్ట్ర తొలి
బీసీ కమిషన్ చైర్మన్
శతాధిక గ్రంథకర్త

# కోటీమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలి
- కొడంగల్ ఏపీఎం గోపాల్



**కొడంగల్, ఆగస్టు 13 (జనం సాక్షి) :** కోటీమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కొడంగల్ ఏపీఎం గోపాల్ అన్నారు. కోడంగల్ ఐకెపి మండల ఆఫీస్ లో గ్రామాలలో కొత్త స్వయం సహాయక సంఘాలు ఏర్పాటులో భాగంగా వివో ఏలు లకు , వివో ఓబీ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలలో లేని మహిళలను సంఘాలుగా ఏర్పాటు చేయటం,వికలాంగుల,15 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికల, 60 సంవత్సరాల దాటిన మహిళలను వృద్ధ మహిళా సంఘాలు ఏర్పాటు చేయాలని ట్రైనింగ్ లో వివో ఏలకు, ఓబి లకు సూచించారు. సంఘాలతో పాటు ఉల్లాస్ ,లోకస్ లో అజీవిక గురించి , బ్యాంక్ లింకేజ్ టార్గెట్, అచివ్మెంట్, ఇతర ప్రాజెక్ట్ చేపట్టే కార్యక్రమాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కోడంగల్ మండల మహిళా సమాఖ్య కార్యదర్శి మాసనమ్మ, కోశాధికారి సత్యమ్మ, సీసీలు, జి.రాములు, ఆర్. రాములు,బసంత్, నర్సింలు,వాణి , వివో ఏలు,ఈసి సభ్యులు, ఆపరేటర్ విజయ్,అకౌంటెంట్ పుష్ప పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ హర్‌ఘర్ తిరంగాను ఎగురవేద్దాం



**రాజేంద్రనగర్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** రేపు జరిగే స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్ కుమార్ గౌడ్ మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్ రెడ్డి లు అన్నారు. మంగళవారం మణికొండ మున్సిపాలిటీలోని మణికొండ పాఠశాల ప్రాథమిక పాఠశాలలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లో భాగంగా విద్యార్థులలో దేశభక్తి పెంపొందించే విధంగా అలాగే ప్రతి ఒక్కరు కుల మతాలకు అతీతంగా జాతీయ జెండాన్ని గౌరవిస్తూ తమ,తమ ఇంటి పైన జాతీయ జెండా ఎగిరే విధంగా చూసుకోవాలని, అలాగే మన దేశానికి సైనికులు. పోలీసులు చేస్తున్న సేవలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ భాజపా అధ్యక్షులు బి.రవికాంత్ రెడ్డి. రాష్ట్ర ఎస్సీ మోర్చా సలహాదారులు పి.సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ స్వామి, మాజీ కోఆప్షన్ సభ్యులు జె. సిద్ధప్ప, జిల్లా కౌన్సిల్ మెంబర్ సి. బీరప్ప, వేణు, మహిళా మోర్చా అధ్యక్షురాలు అనిత దేవి, మణికొండ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి జి. వినోద్, కె. శివరాంరెడ్డి, మధు ఓర్స్ రేఖ ఆనందరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దశరథ్, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

## ప్రజలు వాగు దాటకుండా సహకరించాలి



**మానవపాడు, ఆగస్టు 13 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజకవర్గం ఉండవెల్లి మండలం మేన్నిపాడుకు వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు మీదుగా వాగు ఉధృతంగా ప్రవేశిస్తుంది.. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దాదాపు సుమారు 80 గ్రామాల నుంచి వచ్చే వరద నీరు ఇక్కడ ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. దీంతో ఎక్కడి ప్రయాణాలు అక్కడే నిలవాల్సిందే. వర్షాలు పడి చిన్న వాగు వచ్చినా ఎక్కడి ప్రయాణంలు అక్కడ ఆపుకొని ప్రాణాలు నిలుపుకోవాల్సిందే అని.. గ్రామ ప్రజలు అంటున్నారు. రాబోయే రోజుల్లో ఓట్ల కోసం వచ్చిన ఏ రాజకీయకుడైన, ఏ నాయకుడైన ఓట్లతోనే బుద్ధి చెబుదామని గ్రామస్తులు తెలిపారు. తహసిల్దార్ ప్రభాకర్ తన సిబ్బందితో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజలు వాగు దాటకుండా ఉండేందుకు కల్వర్టుకు ఇరువైపులా బార్కెడ్లు ఏర్పాటుచేసి అక్కడ సిబ్బందిని కాపలాగా నియమించారు.

# రూ.5 కోట్ల 65 లక్షలతో ఏకో టూరిజం పార్కు ఏర్పాటుకు భూమి పూజ

- వనమహోత్సవంలో మొక్కలు నాటిన తిరుపతి రెడ్డి



**బొంరాస్‌పేట, ఆగస్టు 13 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని హైదరాబాద్ బీజాపూర్ 163వ జాతీయ రహదారి సమీపంలోని అటవీ భూమిలో రూ.5 కోట్ల 65 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఏకో టూరిజం పార్కు నిర్మాణానికి సంబంధించి బుధవారం జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్,కొడంగల్ కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి తో కలిసి సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డి భూమి పూజ నిర్వహించారు.అనంతరం అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వనమహోత్సవ కార్యక్రమానికి హాజరై మొక్కలు నాటారు.ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాడని గుర్తు చేశారు.బొంరాస్ పేట పెద్ద చెరువు సమీపంలో పర్యాటకుల తాకిడిని దృష్టిలో ఉంచుకొని రోప్ వే,రెస్టారెంట్,బోటింగు,పార్కులు, వాచింగ్ టవర్ మొదలగునవి ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యుడు నర్సింలు గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్,కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అంజిల్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్,దేశ్య నాయక్,రాములు,సంతోష్, రవి గౌడ్ తదితరులు ఉన్నారు.

# వికారాబాద్ జిల్లాలో హై అలర్ట్

- అధికారుల సెలవులు రద్దు
- హెడ్ క్వార్టర్‌లో ఉండాలని ఆదేశాలు జారీ
- అనంతగిరిలో కి పర్యాటకుల నిలిపివేత
- అందుబాటులో గజ ఈతగాళ్లు
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి) :** నిరంతర వర్షాల నేపథ్యంలో రానున్న మూడు రోజుల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించినందున అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్లోని ఎన్ ఐ సి కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అధికారులతో కలిసి భారీ వర్షాల వల్ల తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, వన మహోత్సవం, ఇందిరమ్మ ఇండ్లపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశము నిర్వహించారు. రానున్న మూడు రోజులు సెలవులు ఉన్నందున అనంతగిరి కి పర్యాటకులు ఎవ్వరు కూడా రాకుడదని, అనంతగిరి ట్రెక్కింగ్ ను మూసి వేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.అధికారులందరూ హెడ్ క్వార్టర్ మేంటైన్ చేయాలనీ, ఎలాంటి సెలవులు ఇవ్వడం జరుగదని ఈ సందర్భంగా తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ అలెర్ట్ ప్రకటించినందున జిల్లా లో ప్రజలు ఎవ్వరు కూడా అత్యవసర మైతే తప్ప బయటికి రాకూడదని , ప్రజలకు , పశువులకు, ఎలాంటి ప్రాణ నష్టం జరుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా లో ఆయా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తమ యాక్షన్ టీంలకు సంబంధించి ఫీల్డ్ ఆఫీసర్లు, సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని, తప్పనిసరిగా కంట్రోల్ రూమ్లను ఏర్పాటు చేసుకుని 24/7 అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. విద్యుత్, రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్ బీ, పంచాయితీరాజ్, ఇరిగేషన్ శాఖలను సమన్వయం చేసుకుని ప్రమాదకరంగా ఉండే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా భారీ వర్షాల వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం (మనుషులు/ జంతువులు) జరగకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. పశువులకు వ్యాదులు రాకుండా వెటర్నరి సిబంది అందుబాటులో ఉండి సరిపడా మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పాఠశాలలు, హాస్టల్స్తో పాటు శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి ఖాళీ చేయించాలని, పురాతన భవనాల్లోని సాధారణ పౌరులను కూడా సురక్షిత భవనాలకు తరలించాలన్నారు. పెద్ద ఎత్తున (15 సెంటీ మీటర్ల )వర్షం పడినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, భారీ వర్షాలపై మున్సిపాలిటీల్లో, మండలాల్లో ప్రజలకు ప్రచారం ద్వారా అవగాహన కల్పించాలని, ఫంక్షన్ హాల్స్ సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు. ప్రమాదరంగా ఉన్న చెరువులు, ప్రాజెక్టులను పరిశీలించి లీకేజీలు ఉంటేగుర్తించి వెంటనే పరిష్కరించాలని, షార్ట్ సర్క్యూట్ జరగకుండా విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. వర్షాల నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని, ముందస్తుగా నిల్వ చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారికి ఆయన సూచించారు. రోడ్లపై విరిగిన చెట్లను అప్పటికప్పుడు తొలగించాలని, భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో ఫీల్డ్లో ఉండాలని కలెక్టర్ తెలిపారు .అంగన్వాడి , స్కూల్స్ , రెసిడెన్షియల్ లలో ఎలాంటి సమస్య రాకుండా చూడాలన్నారు. గజ ఈతగాళ్ళు, ఫిషర్ మెన్స్‌ను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారికి



ఆదేశించారు. జిల్లాలో 155 సబ్ సెంటర్లు, పబ్లిక్ హెల్త్ సెంటర్లు , అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్ల లో యాంటి స్నేక్ వినాన్(ఏఎస్వి) మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి సెంటర్ లో ఎ ఎన్ ఎం ద్వార ఇంజక్షన్ తీసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.జిల్లా ఎస్ పి నారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎస్ పి నారాయణ రెడ్డి మాట్లాడుతూ అధికారులు ,సిబ్బంది అందరు అందుబాటులో ఉండి భారి వర్షాల నేపథ్యంలో జిల్లా లో ఎలాంటి ప్రాణ నష్టం, పశువుల నష్టం, జరుగకుండా అన్ని శాఖల సమన్వయం తో పని చేయాలనీ అధికారులకు ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో కాజువే ల దగ్గరకు ప్రజలు ఎవ్వరు కూడా వెల్ల కుండ బారికేడ్స్ ఏర్పాటు చేయడము జరుగుతుందన్నారు.72 గంటలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ ఏ సమస్య వచ్చిన రెండు బృందాలు రోప్ తో రెడి గా ఉంటారని తెలిపారు. ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలతో సమన్వయము చేసుకుంటామన్నారు.వరదలు, ప్రమాదాలు సంభవిస్తే అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ - 7995061192, 08416235291 కు సమాచారం అందించాలని, కంట్రోల్ రూం 24 గంటకు పనిచేస్తుందని కలెక్టర్ వివరించారు.సమావేశం లో అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ , అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి,ఆర్డి ఓ వాసు చంద్ర, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు నేరస్తులకు జీవిత ఖైదు..

- ఒక్కొక్కరికీ ఐదువేల జరిమానా
- హత్య కేసులో న్యాయమూర్తి తీర్పు
- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి వెల్లడి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి) :** హత్య కేసులో ఇద్దరికీ జీవిత ఖైదు జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.2012 సంవత్సరంలో వికారాబాద్‌లో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులకు వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. ఎస్. శ్రీనివాస్ రెడ్డి ఈరోజు జీవిత ఖైదు విధించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ శ్రీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్ తెలియజేయడం జరిగింది వివరాలు ఇలా ఉన్నాయి.2012 సంవత్సరంలో వికారాబాద్ పట్టణంలోని బీటీఎస్ కాలనీకి చెందిన మిర్యాల భాగ్యలక్ష్మిని ఆమె భర్త మిర్యాల రాజు అతని పెదనాన్న కుమారుడు మల్లేశం కలిసి దారుణంగా హత్య చేశారు.మిర్యాల రాజు జులాయిగా తిరుగుతూ, మద్యానికి బానిసయ్యాడు. తన సొంత ఇంటిని అమ్మాలని ప్రయత్నించగా, భార్య భాగ్యలక్ష్మి పిల్లల భవిష్యత్తు కోసం ఇంటిని అమ్మవద్దని అభ్యర్థించింది. దీంతో ఆగ్రహానికి గురైన రాజు, మల్లేశంతో కలిసి 29 మే2012న భాగ్యలక్ష్మి మెడకు కేబుల్ వైర్ చుట్టి హత్య చేశారు.ఈ ఘటనపై మృతురాలి తల్లి కుర్వ కిష్టమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వికారాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ లచ్చి రామ్ క్రైమ్ నంబర్ 143/2012, సెక్షన్ 302 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు అనంతరం చార్జ్ షీట్ దాఖలు చేశారు.ఈ కేసులో సమగ్ర దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాల ఆధారంగా గౌరవ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డా. ఎస్. శ్రీనివాస్ రెడ్డి వాదోపవాదనలు విని, నిందితులు మిర్యాల రాజు, మల్లేశంలను దోషులుగా నిర్ధారించారు. నేరానికి పాల్పడిన ఇద్దరు నిందితులకు ఒక్కొక్కరికి జీవిత ఖైదుతో పాటు రూ. 5,000 జరిమానా విధిస్తూ బుధవారం తుది తీర్పు వెలువరించారు.ఈ కేసులో సమర్థవంతమైన దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు ప్రాసిక్యూషన్ అధికారులను జిల్లా ఎస్పీనారాయణ రెడ్డిఅభినందించారు. ముఖ్యంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధాకర్ రెడ్డి, మొదటి దర్యాప్తు అధికారి లచ్చిరామ్, అప్పటి ఎస్ఐ శ్రీనివాస్, ప్రస్తుత వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ప్రస్తుత వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ భీమ్ కుమార్, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ ఎల్. నరేందర్ లైజన్ ఆఫీసర్ వీరన్న (ఎస్ఐ)లను ఆయన పేరు పేరునా ప్రశంసించారు. నేరస్థులకు శిక్ష పడినప్పుడు మాత్రమే న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## కార్మికుల అరోగ్య పరిరక్షణ కోసం ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తా..

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**కాప్రా, ఆగస్టు 13 (జనం సాక్షి) :** పారిశ్రామికవాడలోని కార్మికుల అరోగ్య పరిరక్షణ కోసం చర్లపల్లి పారిశ్రామికవాడలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తానని ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం, చర్లపల్లి ఐలా, లయన్స్ క్లబ్ అఫ్ గోల్డెన్ జూబ్లీ, లయన్స్ ల్లబ్ అఫ్ హైదరాబాద్ ఇండస్ట్రీస్ వారి అధ్వర్యంలో బుదవారం ఏర్పాటు చేసిన ఉచిత మల్టీ వైద్యశిభిరంకు విశేష స్పందన లబించింది. జీనియా అసుపత్రి, ఏసియన్ ఇనిస్టూట్ అప్ నెఫ్రాలజీ, రెనోవా డిడిహెచ్ ఆసుపత్రి, ఎమ్ ఎస్ రెడ్డి లయన్స్ ఐ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్యశిభిరంలో రెండు వేల మందికి జెనరల్ చెకప్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, గుండె, కంటి, కిడ్నీ, క్యాన్సర్ స్రీనింగ్ వంటి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. అలాగే 350 మందికి కంటి పరీక్షలు నిర్వహించి రెండు వందల మందికి కంటి అద్దాలు అందజేశారు. చేసి ఈకార్యక్రమంలో ముఖ్య అతిదిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ లు పాల్గొని వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో చర్లపల్లి పెద్ద పారిశ్రామికవాడ అని ఇక్కడ కార్మికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నమని తెలిపారు. పారిశ్రామికవేత్తలు సొంత లాభం కోసం కాకుండా కార్మికుల సంక్షేమం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం అధ్యక్షుడు డి. శ్రీనివాస రెడ్డి, చర్లపల్లి ఐలా అధ్యక్షుడు కె గోవిందరెడ్డి, మాజీ కార్పొరేటర్ పావనిరెడ్డి, మాజీ ఐలా అధ్యక్షుడు హరీష్ రెడ్డి, పిఎస్ మోహన్, రాఘవయ్య, గంగాధర్ బాబు, సుధాకర్ రెడ్డి, వైద్య సిబ్బంది, పారిశ్రామిక వ్యక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా ప్రజా సంబంధాల అధికారి సీతారాం నాయక్, జిల్లా సి.పి.ఆర్. ఇన్స్ట్రక్టర్ డా. మంజుల



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి) :** సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రజా సంబంధాల అధికారి సీతారాం నాయక్, జిల్లా సి.పి.ఆర్. ఇన్స్ట్రక్టర్ డా. మంజుల పేర్కొన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఐ డి ఓ సి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. అల్లే శ్రీనివాసులు సూచనలతో జిల్లా ప్రజా సంబంధాల అధికారి శ్రీ సీతారాం నాయక్ ఆధ్వర్యంలో పత్రిక విలేకరులకు సీపీఆర్ (హృదయ-శ్వాస పునరుద్ధరణ) పై అవగాహన శిక్షణ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా సంబంధాల అధికారి శ్రీ సీతారాం నాయక్, జిల్లా సి.పి.ఆర్. ఇన్స్ట్రక్టర్ డా. మంజుల హాజరై వారు మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన వ్యక్తికి తక్షణమే ప్రథమ చికిత్స అందించడం వల్ల వారి ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. ఆకస్మికంగా గుండెపోటుతో కుప్పకూలితే వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి వాహనం వచ్చే వరకు సీపీఆర్ చేస్తే నిండు జీవితాన్ని కాపాడిన వారమవుతామనీ సూచించారు. సీపీఆర్ చేసే విధానంపై విలేకరులకు అవగాహన కల్పించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రజలకు చేరవేయడంలో, పత్రికా విలేకరులు తమ వృత్తి ద్వారా సహకరించాలని జిల్లా ఎన్సిడి ప్రోగ్రాం అధికారి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్సిడి ప్రోగ్రాం అధికారి డా. రామచంద్ర రావు, నోడల్ అధికారి డా. రియా శ్రీ, మీడియా ప్రతినిధులు మల్యాల బాలస్వామి, మాధవరావు, ఎం భాస్కర్ యాదవ్, అరుణ్ రాజ్, కమల్, రవికాంత్, అరుణ్ ,ఫారుక్ పటేల్, చంద్రమౌళి, జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు 18 వేల వేతనం అమలు చేయాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆశా యూనియన్ కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి



**కాప్రా, ఆగస్టు 13 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశ వర్కర్లకు 18 వేల వేతనాన్ని వెంటనే అమలు చేయాలని మేడ్చల్ జిల్లా ఆశా యూనియన్ కార్యదర్శి ఎం రేవతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కుషాయిగూడ పి. హెచ్ . సి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు నేటికి జూలై నెల పారితోషికాలు రాలేదు. జూలై నెల పూర్తయి 13 రోజులు. గడుస్తున్నది. నేటికీ పారితోషికాలు రాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్లు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఉన్న అధికారులు ఆశా వర్కర్ల పారితోషికాలను ప్రతి నెల ముగింపు (30వ తేదీ) లోపు చెల్లించేవారు. కానీ ఇప్పుడు తమరు పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆశా వర్కర్లకు పారితోషికాలు గతంలో చెల్లించినట్లు సకాలంలో రావడం లేదు. దీంతో ఆశా వర్కర్లు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. కావున జూలై నెల పారితోషికాలు వెంటనే చెల్లించాలని, భవిష్యత్తులో ఈ విధంగా ఆలస్యం జరగకుండా ప్రతి నెల ముగింపు (30వ తేదీ) లోపు చెల్లించాలని కోరుతున్నాము. రాష్ట్రంలో ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారు. పారితోషికం ఉన్నవి, లేనివి అనే సంబంధం లేకుండా ప్రభుత్వం చెప్తున్న ప్రతి ఒక్క పనిని ఆశా వర్కర్లు అమలు చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మొత్తం ఆశాలు పనిలోనే ఉంటున్నారు. ఇంత పని చేస్తున్నా నేటికి కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర ఎలాంటి సౌకర్యాలు ఆశా వర్కర్లకు ప్రభుత్వం కల్పించలేదు. కేవలం రూ.9,900/- లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు చెల్లిస్తున్నది. ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం పారితోషికాలు పెంచి నాలుగు సంవత్సరాలు అవుతుంది. ఈ కాలంలో అనేక రెట్లు పని భారం పెరిగింది. నిత్యావసర వస్తువుల ధరలు అనేక రెట్లు పెరిగాయి. వీటితో పోల్చినప్పుడు వస్తున్న పారితోషికాలు కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదు. ఫిక్స్ వేతనం రూ.18,000/-లు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని అనేక సంవత్సరాల నుండి రాష్ట్రంలో ఆశా వర్కర్లు అడుగుతున్నారు. ఈ అంశాల పైన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించడం లేదు. ఇవి పరిష్కారం కాకపోగా వచ్చే పారితోషికాలు కూడా సకాలంలో రాకపోవడం వలన ఆశ వర్కర్లు ఆందోళన చెందుతున్నారు. కావునా పై సమస్యలు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాము. అనంతరం సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ ప్రభుత్వ వెంటనే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయకపోతే పోరాటం ప్రారంభించాల్సి వస్తుందని పోరాటం ఉధృతం కాకముందే కాంగ్రెస్ గవర్నమెంట్ ఇచ్చిన హామీలు నిలుపుకోవాలని ఆశలకు 18000 ఫిక్స్ వేతనం చేయాలని లేనియెడల ఆశా వర్కర్లు పోరాటానికి సన్నద్ధమవుతారని హెచ్చరించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో కుషాయిగూడా పీహెచ్ సి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 14 ఆగస్టు 2025

# చట్టం రైతు చుట్టం కావాలి

**కొల్చారం, ఆగస్టు 13 (జనంసాక్షి) :** పంటలు సాగు చేసే రైతులు విత్తనం వేసిన నాటి నుండి పంట చేతుకొచ్చి మార్కెట్‌కు తరలించే వరకు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేసిన చట్టాలను రైతులకు తెలియజేయడం ద్వారా చట్టం రైతులకు చుట్టంగా మారి ఎందుకు లీవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సాగు న్యాయ యాత్ర కార్యక్రమం చేపట్టినట్లు రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు భూమి సునీల్ అన్నారు. బుధవారం కొల్చారం, నర్సాపూర్, కౌడిపల్లి మండల కేంద్రాలలో నీ రైతు వేదికలలో ఆయా మండలాల తహసిల్దార్‌లు శ్రీనివాసచారి, శ్రీనివాస్, ల అధ్యక్షతన జరిగిన సాగు న్యాయ యాత్ర రైతు ముఖాముఖి కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు భూమి సునీల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భూమి నుండి పట్టాదారు పాసుపుస్తకం లేకపోతే తెలంగాణ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం 20 25 సెక్షన్ 4 (6) రూల్ 4 ప్రకారం భూభారతి పోర్టల్ లో మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకొని కొత్త పట్టాదారు పాసు పుస్తకం పొందవచ్చని తెలిపారు. గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. మీ పాస్ పుస్తకంలో భూమి తక్కువగా నమోదైన సర్వేనెంబర్ మిస్సయిన పట్టాదారు పేరు ఇతర వివరాలు తప్పుగా రాసిన భూమి స్వభావం మారిన భూమి సంక్రమించిన విధానం తప్పుగా నమోదైన భూభారతి చట్టం సెక్షన్ 4(5) రూల్ నాలుగు ప్రకారం భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకొని మార్పులు నమోదు చేసుకోవచ్చని అన్నారు.

### విత్తనం వల్ల నష్టం కలిగితే పరిహారం పొందవచ్చు

పంటల సాగులో కీలకమైన విత్తనం వల్ల రైతు నష్టపోతే రైతులు పరిహారం పొందేలా నూతన చట్టాలను ప్రభుత్వం తీసుకువచ్చింది అన్నారు. ఇందుకోసం రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా రసీదు తీసుకోవాలని విత్తనాలు తీసుకువచ్చిన డబ్బా, సంచిని దాచి ఉంచుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలుకు చెల్లించిన ధర సాగు అయిన ఖర్చు తగ్గిన దిగుబడి విలువ రైతులకు కలిగిన మానసికక్షోభకు పరిహారం పొందవచ్చని రైతులకు సూచించారు. పంటల సాగులో సాగునీరే కీలకం సాగునీటి కోసం అనేక చట్టాలు రైతులు పంట సాగులో ప్రతి చౌక్కా నీటు నీరు విలువైందని అందుకే ప్రభుత్వం వాల్టా చట్టం తీసుకువచ్చింది అని భూమి సునీల్ అన్నారు. తెలంగాణ వాల్టా చట్టం 2002 ప్రకారం బూరువేయాలన్నా భావితవ్వాలన్న చెట్టు కొట్టాలన్న ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బ్యాంకులకు రైతులు పంట రుణాలు ఇవ్వాలి.

పంట సాగులో రైతులు బ్యాంకు ద్వారా రుణాలు పొందవచ్చు అని ఆర్బిఐ ఆదేశాలను అనుసరించి బ్యాంకులు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు తెలంగాణ మనీ లీడర్స్ చట్టం 13 49 పసలేని అనుసరించి రుణాలు ఇవ్వాలని రైతులను వేధిస్తే చట్టపైన పైన చర్యలు ఉంటాయని భూమి



సునీల్ రైతులకు అవగాహన కల్పించారు చిన్న రైతుల రుణాల నుండి విముక్తి పొందడం కోసం తెలంగాణ రుణ విముక్తి చట్టం 2016 ప్రకారం రాష్ట్ర రుణ విముక్తి కమిషన్ను ఆశ్రయించవచ్చని ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు.

### పంటల భీమా రైతులకు ధీమా

రైతులు సాగు చేసే పంటలకు బీమా చేసినప్పుడే రైతులు ధీమా ఉంటుందనీ నీ రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు భూమి సునీల్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంటల బీమా కోసం పథకాలు తీసుకోవచ్చి అమలు చేస్తున్నాయని రైతులకు కూడా ప్రీమియం చెల్లించి పంటల బీమా పొందవచ్చు అన్నారు. అకాల వర్షాలు కరువు పరిస్థితులు, తదితర కారణాల వల్ల పంట నష్టపోతే రైతులు బీమా పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ చైర్మన్ ఓ ఎస్ డి వెంకట హరిప్రసాద్, భూధాన్ బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి, లీవ్ సంస్థ న్యాయవాదులు, ప్రతినిధులు అభిలాష్ జీవన్ మల్లేష్ ప్రవీణ్ సందీప్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, నర్సాపూర్ పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్ మండల వ్యవసాయ అధికారులు శ్వేతాకుమారి,దీపిక ఆయా మండలాల ఏఈవోలు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వాగులు దాటకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**ఝరాసంగం, ఆగస్టు 13 (జనం సాక్షి) :** రాష్ట్రంలో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురువనున్నాయని వాతావరణ శాఖ ముందస్తుగా రెడ్ అలర్ట్ జారీ చేసిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోట్ పల్లి, ప్యాలవరం వాగులను ఆయన పరిశీలించారు. ఉధృతంగా ప్రవహించే పోట్ పల్లి శివారులోని నారింజ వాగు, రేజింతల గ్రామ సమీపంలో గల మామిడి వాగులను మూసివేసి వాహనదారులు ప్రత్యామ్నాయంగా రాకపోకలు కొనసాగేలా చూడాలన్నారు. ఝరాసంగంలోని కేతకి సంగమేశ్వర స్వామి ఆలయానికి శ్రావణమాసం సందర్భంగా మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఇటువైపు నుంచి తరలి వస్తారని వారి కోసం ముందస్తుగా సూచిక బోర్డులను ఏర్పాటు చేసి వేరే రహదారుల గుండా వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని చెరువులు, వాగుల వద్దకు చిన్నారులు వెళ్ళకుండా ముందస్తుగా చాటింపు చేయించాలన్నారు. వీరి వెంట జహీరాబాద్ సీఐ శివలింగం, రూరల్ సీఐ హనుమంతు, ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్ లు ఉన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి
- అదనపు కలెక్టర్ నగేష్
- నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి) :** డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం లో నశా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం పురస్కరించుకొని జిల్లా మహిళ శిశు దివ్యాంగుల వయవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ ను అదనపు కలెక్టర్ నగేష్ చేయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామి గా ప్రతి ఒక్కరూ అవ్వాలని, మాదకద్రవ్యాల నిర్మూలనకు శక్తివంచన లేకుండా పోరాడాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, ఎస్సీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, బీసీ సంక్షేమ అధికారి జగదీష్, మైనారిటీ జామల నాయక్ , సిడిపిఓ హేమ భార్గవి, అధికారులు కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శివ్వంపేటలో పోలీసు తనిఖీలు



**శివ్వంపేట, ఆగస్ట్ 13 (జనంసాక్షి) :** ఈనెల 15న భారత స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఇలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మెదక్ ఎస్పీ డీ వీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ముందు జాగ్రత్తగా మండల కేంద్రమైన శివ్వంపేట బస్టాండ్ ప్రాంతం లో బుధవారం బాంబు స్క్వాడ్ అలాగే డాగ్, నార్కోటిక్ డాగ్ ల ద్వారా బస్టాండ్ తో పాటు బస్టాండ్ పరిసర ప్రాంతాలలో పోలీసు జాగిలాల ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో స్థానిక పోలీస్ సిబ్బంది, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది, జాగిలాలు పాల్గొన్నాయి.

# మత్తు పదార్థాల బారినపడకుండా అధికారులు కృషి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 13 (జనం సాక్షి) :** జిల్లాలో మత్తు పదార్థాల బారిన పడకుండా అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ అన్నారు. బుధవారం ఐడీఓసీ సమావేశ హాలులో "మిషన్ పరివర్తన మత్తు పదార్థాల వినియోగ నిర్మూలన కోసం సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం, ఆలోచనాశక్తి సామర్థ్యాన్ని దెబ్బతీసి ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని హెచ్చరించారు. మాదకద్రవ్యాల క్రయవిక్రయాలు గుర్తిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమస్య గ్రామీణ ప్రాంతాల వరకు వ్యాప్తి చెందుతున్నందున,గ్రామీణ యువకులు బానిసత్వానికి గురి కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లల్లో ప్రవర్తనలో మార్పులు గమనించిన వెంటనే కౌన్సిలింగ్ అందించాలన్నారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రాముఖ్యతను వివరిస్తూ,యువతకు ఆధునిక సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ అందించడంలో ఈ కేంద్రాలు కీలకమని తెలిపారు. సి. యెన్. ఎస్ మెషిన్ టెక్నీషియన్,



మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్,డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, ఇంజనీరింగ్ డిజైన్,ఆటోమేషన్ వంటి దీర్ఘకాలిక, స్వల్పకాలిక కోర్సులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మన గద్వాల జిల్లాలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయబడుతుందని,దీని ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సునంద,జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక,ఎల్డియం శ్రీనివాస రావు,డీపీఆరో ఆరీఫుద్దీన్,పౌర సరఫరాల శాఖ జనరల్ మేనేజర్ విమల,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్



**వనపర్తి టౌన్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా కేంద్రంలోని, 4వ వార్డు నల్లచెరువు మినీ ట్యాంక్ బండ్ దగ్గర గణేష్ నిమజ్జన ఏర్పాటును మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, స్థానిక మాజీ కౌన్సిలర్ పద్మ పరశురాంలు పరిశీలించారు. ఈ సందర్భంగా లక్కాకుల సతీష్ మాట్లాడుతూ గణేష్ పండుగ వస్తున్నందున నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను వారు కోరారు. ఈ యొక్క నిమజ్జనం సంబంధించినటువంటి ఏర్పాట్లలో కట్టపైన ముండ్ల చెట్లను, పిచ్చి మొక్కల తొలగించలి వీధిలైట్లు మంచినీటి సమస్య లేకుండా మెడికల్ సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలని వారు అధికారులను కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బి వెంకటేష్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పశువుల షెడ్డు దగ్ధం

- ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతుల వేడుకోలు
- మూడున్నర లక్షల ఆస్తి నష్టం

**శివ్వంపేట, ఆగస్టు 13 (జనంసాక్షి) :** పశువుల షెడ్డుపై బోర్ కు వెళ్లే విద్యుత్ సర్వీస్ వైరు తెగిపడి భారీ ఆస్తినష్టం సంభవించిన ఘటన శివ్వంపేట మండలంలో బొజ్యా తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మాల్యాతండాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. తాండవాసులు తెలిపిన వివరాల ప్రకారం మాల్యాతండాకు చెందిన బానోత్ లక్ష్మణ్, భానోత్ పాండులకు చెందిన పశువుల షేడ్ పై నుంచి బోరు మోటర్ కు వెళ్లే కరెంటు సర్వీస్ వైర్లు తెగిపడడంతో షార్ట్ సర్క్యూట్ సంభవించి, అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో ఆ ప్రదేశం మొత్తం మంటలు వ్యాప్తి చెంది, షెడ్లో ఉన్న రెండు గేదేలు, ఐదు దూడలు, వేయి మోపుల గడ్డి అలాగే 10 బస్తాల పశువుల దాన పూర్తిగా దగ్ధమయ్యాయని, అలాగే మిగతా ఆరు గేదే లకు తీవ్ర



గాయాలయ్యాయని బాధితులు తెలిపారు. తాండకు వెళ్లే రోడ్డు బురదతో ఉండడం వల్ల ఫైరింజన్ వచ్చిన ఘటన స్థాలికి వెళ్లకపోవడం వల్ల భారీగా ఆస్తి నష్టం జరిగిందని, అధికారులు స్పందించి, ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందించాలని పాడి రైతులు, బాధితులు కోరారు. ఈ దుర్ఘటన విషయం తెలుసుకున్న గిర్ధావర్ కిషన్ బుధవారం అక్కడికి చేరుకొని పంచనమా నిర్వహించారు. ఈ ప్రమాదంలో రెండు గేదెలు, 5 దూడలు, వేయి గడ్డిమోపులు, పది బస్తాల పశుదాన పూర్తిగా దగ్ధమైందన్నారు. మొత్తం ముదున్నారా లక్షల ఆస్తి నష్టం జరిగిందని దీనిపై ప్రభుత్వానికి నివేదిస్తామని ఆర్ఐ పేర్కొన్నారు.

# విద్యార్థులకు ఓటింగ్ ప్రక్రియపై అవగాహన

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 13 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు బుధవారం విద్యార్థులకు ఓటింగ్ పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఓటింగ్ ప్రక్రియ నిర్వహించడం జరిగిందనీ, ఈ ప్రక్రియలో విద్యార్థులు, గ్రామ యువకులు,ముఖ్య అతిథులుగా ఎర్రవల్లి మండల విద్యాధికారి అమీర్ భాష,ఇటిక్యాల మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు, బివిరాపురం జిహెచ్ఎం వెంకటేశ్వర్ రెడ్డి ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. అనంతరం కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటించడం, విజేతల చేత ప్రమాణ స్వీకారం చేయించడం



జరిగిందనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్యాట్ల లక్ష్మిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వివిధ మండలాల ఎంఈఓలకు, జిహెచ్ఎంలకు, గ్రామస్తులకు,పాఠశాల ఉపాధ్యాయ బృందమునకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# సోలార్ విద్యుత్ ప్యానల్ కోసం ప్రభుత్వ భవనాల పరిశీలన



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13 (జనం సాక్షి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం అయిన ప్రభుత్వ భవనాల పైన సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం గురించి, నారాయణపేట ఎంపీడీవో సుదర్శన్ విద్యుత్ శాఖ ఏఈ సాయినాథ్ నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం, పాఠశాల భవనాలు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను సందర్శించి సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు కోసం అంచనాలు తీసుకున్నారు..ఇట్టి కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చాణిక్య రెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సునీత ,నసీరుద్దీన్ ,స్థానిక నాయకులు ఎడ్ల రాజు, సౌడం సుధాకర్, స్థానిక పాత్రికేయులు,పంచాయతీ వర్కర్స్ నర్సింహులు,రామచందర్ మొదలైన వారు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

- సంగారెడ్డి టౌన్ సిఐ రమేష్




**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 13 (జనం సాక్షి) :** మాదకదవ్యాలని నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సంగారెడ్డి టౌన్ సిఐ రమేష్ అన్నారు. బుధవారం జిల్లా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం, నషా ముక్త్ భారత్ అభియాన్ సంయుక్త అవగాహన కార్యక్రమం, అంతర్జాతీయ యువజన దినోత్సవం సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా టౌన్ సీఐ రమేష్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, పోక్సో చట్టం, మాదక ద్రవ్యాల ప్రమాదాలపై విశదీకరించారు. యువత చదువుపై దృష్టి పెట్టి, మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ చురుకైన పాత్ర వహించాలని, ఈ దిశగా అందరూ ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి శోభారాణి, జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ పల్లవి, హెల్త్ సూపర్వైజర్ విష్ణు, షి టీం సభ్యులు, కానిస్టేబుల్స్, విశాల, ఉమేర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభివృద్ధికి కోసం స్వయం సహాయక సంఘాలలో చేర్పించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 13 (జనం సాక్షి) :** మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం మహిళను స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేర్చాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటు కోసం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల పేరిట అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని,వీటి ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన సాధించడానికి అవకాశాలు కలుగుతున్నాయని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కిశోర బాలికలు,దివ్యాంగులు,వృద్ధులను మహిళా సంఘాల్లో చేర్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. అర్హత కలిగిన ప్రతి మహిళను సంఘాల్లో చేర్చే బాధ్యత ఏపీఎంలు,సీసీలపై ఉందని,ప్రతి అర్హురాలిని సభ్యురాలిగా చేర్చేలా సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. స్వయం



సహాయక సంఘాలలో సభ్యత్వం ద్వారా లభించే ప్రయోజనాలపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు భద్రత, సామాజిక గుర్తింపుతో పాటు ఆర్థిక స్థిరత్వాన్ని అందిస్తున్నాయని వివరించారు. గ్రామ స్థాయిలో ఇటుకల తయారీ, సెంటరింగ్ వర్క్స్ వంటి గ్రౌండ్ యూనిట్లను ఏర్పాటు చేసి కుటుంబ ఆదాయాన్ని పెంచుకునే అవకాశాన్ని మహిళలకు కలిపిస్తామని తెలిపారు. గ్రామ స్థాయిలో మహిళా సంఘాలు నెలకు రెండు సార్లు సమావేశాలు నిర్వహించి,సభ్యుల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు పథకం కింద ఇళ్ల పట్టాలు మహిళల పేర్లపైనే మంజూరు అవుతాయని ఆయన వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు విడతల వారీగా అందజేయబడతాయని తెలిపారు. నిర్మాణానికి అవసరమైన నిధుల కొరత ఉంటే మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకొని ఇల్లు పూర్తి చేసుకోవచ్చని సూచించారు. బ్యాంకర్లు అన్ని పథకాల అమలు, మహిళలకు రుణ సదుపాయాల కల్పనలో పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. ప్రభుత్వం అందించే లబ్ధులు, పథకాలపై వచ్చే సమాచారాన్ని నమ్మదగిన మార్గాల ద్వారానే పొందాలని,అనధికారిక ఆన్‌లైన్ లింకులు,మోసాలకు లోనవకూడదని మహిళలకు సూచించారు. మహిళా సంఘాల ద్వారా ఆర్థిక సాయం,రుణాలు, శిక్షణ,పథకాల అమలు వంటి అన్ని అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్డియం శ్రీనివాస రావు,జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతి,జిల్లా సంక్షేమ అధికారి సునంద, జి.యం ఇండస్ట్రీస్ రామ లింగేశ్వర్ గౌడ్, ఆడిషన్ డి.ఆర్.డి.ఓ శ్రీనివాసులు, ఏపియంలు ,సిసిలు తదితరులు పాల్గొన్నారు.

# మైక్రోఫైనాన్స్ మోసగాడి ఆటకట్టు

- జిల్లా వ్యాప్తంగా 16 కేసులు నమోదు
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలో మైక్రో ఫైనాన్స్ పేరిట మోసం చేస్తున్న మోసగాడి మోసాలను ఆట కట్టించారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ప్రధాన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపించారు. ఈమేరకు ఎస్పీ స్థానిక హెడ్ క్వార్టర్స్ లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పటుచేశారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసం చేసిన వ్యక్తులను ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, ప్రతి ఒక్కరూ చట్టప్రకారం శిక్ష అర్హులని, అమాయక సాధారణ ప్రజలను బురిడీ కొట్టించి ఉద్యోగాలు ఇస్తానంటూ డబ్బులు వసూలు చేసి, జల్సాలకు తిరుగుతూ ఖర్చు చేసి, సామాజిక సేవ పేరుతో ప్రముఖుల పరిచయాలతో ప్రచారం చేసుకుని, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 300 మందిని మోసం చేసి నిందితుడిగా భావిస్తున్న జవాడే కృష్ణను అరెస్టు చేయడం జరిగిందని, ప్రజలను మోసం చేసిన ఎవరిని విడిచి పెట్టేది లేదని హెచ్చరించారు. నిందితునిపై ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 16 కేసులు, ఉట్నూర్‌లో 3, ఇంద్రవెల్లిలో - 3 ,నార్నూర్లో - 2, మావల లో 3 అదే విధంగా జిల్లా కేంద్రంలో వన్ టౌన్ లో 2, జైనథ్‌లో 3, చొప్పున దాదాపు 16 కేసులు నమోదు అయ్యాయని 2024 సంవత్సరం డిసెంబర్ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉట్నూరు ఎన్నారై అంటూ ఎస్కే మైక్రో ఫైనాన్స్ పేరుతో కార్యాలయాలను ప్రముఖులతో ప్రారంభించి తన నేర పద్ధతిని ప్రారంభించాడు. మైక్రో ఫైనాన్స్ ఉద్యోగాలు ఇప్పిస్తాను అని జిల్లావ్యాప్తంగా రెండు కార్యాలయాలలో దాదాపు 300 మంది వద్ద 20 వేల రూపాయల మెంబర్షిప్ తీసుకుని ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని చెప్పి మోసం చేయడం జరిగిందని, అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల స్టాఫ్ నర్స్, ఏఎన్ఎం మరియు అంగన్వాడీ ఉద్యోగాలు ఇప్పిస్తానని కొంతమంది వద్ద డబ్బులను తీసుకోవడం చేసి మోసం చేయడం జరిగిందని తెలిపారు. మొదటగా ఈ రెండు కార్యాలయాల్లో ఐదుగురు ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవడం వారి ద్వారా నగదు రూపంలో ఒక్కొక్కరి వద్ద 20 వేల రూపాయలను తీసుకొని దాదాపు జిల్లా వ్యాప్తంగా 54 లక్షలు అదే విధంగా ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగాల పేరుతో 15 లక్షలు వసూలు చేసి మొత్తం 69 లక్షల ఇప్పటివరకు జరిగిన వసూలు చేసినట్టు విచారణలో తేలిందని తెలిపారు. ఈ డబ్బు అంతా భవిష్యత్తులో దొరకకుండా నగదు రూపంలో స్వీకరించడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ నుండి ఆరు నెలల పాటు ఈ కార్యక్రమాలు చేసి ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో బాధితులు తరచూ అడుగుతూ ఉండడంతో జులై నెల మొదటి వారంలో తన సొంత గ్రామం శంకరగుడాలో తొమ్మిది లక్షల నగదు మూడు లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు దాచి, 15 లక్షల నగదు తో పారిపోవడం పారిపోవడం జరిగిందన్నారు. అప్పటినుండి జిల్లా పోలీస్ యంత్రాంగం అతనిని అన్వేషిస్తూ ఈరోజు పట్టుకోవడం జరిగిందని తెలిపారు. ఇతని వద్ద నుండి దాదాపు తొమ్మిది లక్షల నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని, 5.5 తులాల ఉంగరాలు, 1.2 తులాల బంగారు కాయిన్స్. 4 తులాల బంగారు చైన్ 3 చైన్లు మొత్తం 10.7 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రజల దగ్గర దోచుకున్న డబ్బులతో బంగారు ఆభరణాలు, కారు కొన్నట్లు తెలిపారు.ప్రజల వద్ద నుండి విడతలవారీగా మోసం చేసి తీసుకున్న డబ్బులలో ఆరు లక్షలు ఆదిలాబాద్ లో ఒక ప్రైవేటు హోటల్ యజమానికి. ఆరు లక్షల నాగపూర్ లో గల భవన యజమానికి. అదే విధంగా 3.5 లక్షలు ఆదిలాబాద్ ఉట్నూర్ కార్యాలయాలకు.2.1 లక్షలు తమ్ముని అవసరాల నిమిత్తం మిగిలినవి జల్సాలకు తప్పించుకోవడానికి ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. ఇతనికి సహకరించిన ఇతర నిందితులను త్వరలో పట్టుకోవడం జరుగుతుందని అన్నారు. ఎన్నారై పేరుతో, సామాజిక సేవ చేస్తానంటూ భారీ ఎత్తున ప్రజలను మోసం చేసి తప్పించుకు తిరుగుతున్న నిందితున్ని జిల్లా పోలీసులు పట్టుకుని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్, ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్, ఐటీ కోర్ ఎస్సై గోపికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీట మునిగిన పత్తి పంట

- వరదనీటిలో కొట్టుకుపోయిన వరిపంట
- చిన్న తిమ్మాపూర్ గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ సబ్ కలెక్టర్



**భీమిని ఆగస్టు13 (జనంసాక్షి) :** భీమిని మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి వాగులు వంకలు పొంగి పొర్లడం తో పాటు జనజీవనం పూర్తిగా స్తంభించి పోయింది.మండలంలో నీ పలు గ్రామాల్లో పత్తి పంట వరి నీటమునిగి నీటిప్రవాహానికి కొట్టుకు పోయింది. సుమారు 200ఎకరాల్లో వరి పంట 1200 ఎకరాల్లో పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు.మరో 72 గంటలు భబరివర్శాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసిందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలకు తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్ కుమార్‌లు చిన్నతిమ్మపూర్ పెద్దతిమ్మాపూర్ తంగళ్ళపల్లి రాజారం గ్రామాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. తిమ్మాపూర్ తంగళ్ళపల్లి గ్రామాల మధ్య నల్లవాగు ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటం తో రాకపోకలు నిలిచి పోయాయి తిమ్మాపూర్ గ్రామం చుట్టూ ఎటు చూసినా నీళ్ళే కనిపిస్తున్నాయి పాల్వాయి సాగర్ బ్యాక్ వాటర్ తో ఈ గ్రామాల్లోనీ ఇండ్లలోకి నీరు చేరింది దీంతో ప్రజలు రాత్రంతా అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని బిక్కుబిక్కు మంటూ గడిపారు వర్షం కొంచం తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు.మండలం లోని గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని వాగులు పొంగుతున్నప్పుడు దాటే సాహసం చేయవద్దని అవగాహన కల్పించాలని. కార్యదర్శులు ఏంపీడీఓ తహసిల్దార్ సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొంటూ ఉండాలని, ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. నీటమునిగిన పంటలకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు బరోసా కల్పించారు. గ్రామాల్లోని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భీమిని మండలకేంద్రం లోని ఎస్ టి కాలనీ లో ఇండ్లలోకి నీరుచేరింది దీంతో ఇంట్లో ఉన్న వస్తువులు నీట మునిగి పోయాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. మహదేవ్ తాలబ్ మత్తడి నీరుతోపాటు ఎర్రవాగు నీరు వెనక్కి తన్నడంతో కాలనీ నీటితో జలమయం అయ్యింది. కర్జి బీంపూర్ లో కలెక్టర్ కల్వర్టును పరిశీలించడం జరిగింది తగ్గు మొకం పట్టేవరకు మాకు పునరావాసం కల్పించేలా చూడాలని అంటున్నారు. కాలనీ చుట్టూ నీటి ప్రవాహం ఇంకా కొనసాగుతోంది రాత్రి వర్షం కురిస్తే ఇబ్బందులు తప్పేలా లేవు అధికారులు చర్యలు చేపట్టాలని అంటున్నారు. మొత్తానికి బారి వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. వెలరూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు మమ్మల్ని ఆదుకోవాలని కోరుతున్నారు. కలెక్టర్ వెంట తాసిల్దార్ వికార్నదాస్ ఏ డి ఏ సురేఖ ఏవో జమున దుర్గ ఆర్ ఐ వెంకటేశం ఏ ఈ ఓ వినోద్ పాల్గొన్నారు.

# పాఠశాలలో చోరీకి విఫలయత్నం



**మంగపేట ఆగస్ట్ 13(జనంసాక్షి) :** గ్రామీణ నిరుపేద విద్యార్థులు విద్యను అభ్యాసించే పాఠశాలకే కన్నం వేయాలనే ప్రయత్నంతో పాఠశాల తరగతి గది తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి తిమ్మంపేట జెడ్పి పాఠశాలలో చోటుచేసుకుంది. మండలంలోని తిమ్మంపేట గ్రామపంచాయతీని పరిధిలో గల తిమ్మంపేట జెడ్పి పాఠశాలలో గతవారం రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా విద్యార్థులకు ఉపయోగపడే సైన్స్ మెటీరియల్స్, కంప్యూటర్ లను పాఠశాలకు కేటాయించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనక సత్యనారాయణ వెల్లడించారు. పాఠశాలకు కేటాయించిన సైన్స్ మెటీరియల్స్, కంప్యూటర్ లను అదే రోజు పాఠశాలలోనీ తరగతి గదిలోనే భద్రపరచడం జరిగింది. ప్రతిరోజు వాటిని భద్రపరచిన గది తాళాలు సరిగా ఉన్నాయో లేదా అని ప్రతిరోజు పరిశీలించిన అనంతరమే సాయంత్రం పాఠశాలను ముగించుకొని ఇంటికి వెళ్లే వెళ్లేవరమని వారు వెల్లడించారు. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం కూడా పాఠశాలను ముగించుకొని ఇంటికి వెళ్లి మరల ఉదయం పాఠశాల సమయానికి వచ్చి చూడగా తరగతి గది తాళాలు పగలగొట్టి ఉండటాన్ని చూసి ఆందోళన గురయ్యామని వెంటనే గదిలోకి వెళ్లి చూడగా సైన్స్ మెటీరియల్స్ అంతా గదిలో చెల్లాచెదురుగా పడివేసి ఉన్నాయని ఇది అంతా దొంగల పనేనని గుర్తించి వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈ విషయంపై స్థానిక ఎస్సై టివిఆర్ సూరి పాఠశాలను సందర్శించి దొంగతనానికి ప్రయత్నించిన తీరును ఆయన పరిశీలించారు.

# పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టం

- రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డా.చంద్రశేఖర్ రెడ్డి



**నిర్మల్ రూరల్,ఆగస్టు13(జనం సాక్షి) :** పాలనలో పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారని,ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్ట్ ను తప్పనిసరిగా ప్రదర్శించాలని రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ డా. చంద్రశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టంపై రాష్ట్ర సమాచార కమిషనర్ ఆధ్వర్యంలో పీఐవో అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో సమాచార కమిషనర్లు పర్వీన్,భూపాల్,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ లతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలిపారు. ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువ అందిన జిల్లాల్లో నిర్మల్ ఒకటన్నారు.పీఐవో అధికారులు ప్రజలకు సమయానికి,పూర్తి సమాచారాన్ని అందించాలి అని సూచించారు. ఆర్.టి.ఐ దరఖాస్తుల పరిష్కారం ఆలస్యం కాకుండా చట్టంలో ఉన్న సమయపరిమితి లోపల సమాధానమివ్వాలని తెలిపారు.సమాచారాన్ని దాచిపెట్టడం తప్పుడు సమాచారం ఇవ్వడం వంటి చర్యలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు.ఆర్.టి.ఐ చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తే అవినీతి తగ్గిపోతుందని,ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ శాఖలు పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలన్నారు. నిర్మల్ జిల్లాలో ఆర్టీఐ అప్పీల్ కేసులను కలెక్టరేట్లో కమిషన్ ప్రత్యేకంగా పరిష్కారానికి చర్యలు చేపట్టిందన్నారు.జిల్లాలోని అన్ని పీఐవో అధికారులు చట్టపరమైన నిబంధనలను పూర్తిగా అనుసరించాలి అని పేర్కొన్నారు.రాష్ట్ర సమాచార కమిషన్ కమిషనర్లు పర్వీన్,భూపాల్ మాట్లాడుతూ,ఆర్టీఐ చట్టం సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత పీఐవో, ఏపీఐవోలదేనన్నారు. కమిషన్ ఏర్పాటు తర్వాత 18 వేల కేసుల్లో 2300కుపైగా పరిష్కరిం చామన్నారు. అనంతరం స.హ.చట్టంపై సందేహాలను నివృత్తి చేశారు. సదస్సులో పీఐవో అధికారులకు సమాచార హక్కు చట్టం నిబంధనలు,దరఖాస్తుల పరిష్కార విధానం,అప్పీల్ ప్రక్రియపై పవర్ పెయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు.అనంతరం కమిషనర్లను జ్ఞాపికలతో కలెక్టర్, అధికారులు సత్కరించారు. సమావేశానికి ముందు కలెక్టరేట్ ప్రాంగణంలో కమిషనర్లు,కలెక్టర్ మొక్కలు నాటి నీరుపోశారు.సదస్సు అనంతరం రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ ఆధ్వర్యంలో వివిధ సమాచార హక్కు దరఖాస్తులు,అప్పీల్స్‌పై ఇయరింగ్(విచారణ) నిర్వహించారు.సంబంధిత పీఐవో అధికారులు, దరఖాస్తుదారుల నుండి వివరాలు స్వీకరించి తగిన ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్,బైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్,ఆర్డీఓ రత్నకల్యాణి,వివిధ శాఖల అధికారులు,పిఐఓ లు, ఎపిఐఓలు,తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లి నుంచి ములుగు జాతీయ రహదారి మరమ్మతులు పూర్తి చేయాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్



**ములుగు బ్యూరో,ఆగస్ట్13(జనం సాక్షి):** మల్లంపల్లి నుండి ములుగు జాతీయ రహదారి మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు.ఇటీవలి భారీ వర్షాల ప్రభావంతో జాతీయ రహదారి-163 పై మల్లంపల్లి మరియు జాకారం మధ్య ఉన్న ఎస్ఆర్ఎస్పి కెనాల్‌పై పాత వంతెన దెబ్బతింది.దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నేషనల్ హైవే అధికారులు తాత్కాలిక వంతెన నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించి రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తాత్కాలిక వంతెన పనులు పూర్తయ్యే వరకు మల్లంపల్లి నుంచి ములుగు మార్గంలో వాహన రాకపోకలు క్రింది విధంగా మళ్లించబడతాయి.ప్రయాణికులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించి సూచించిన మార్గాలను అనుసరించాలి.

వరంగల్ నుంచి ములుగు (భారీ వాహనాలు) వెళ్లే దారి గూడెప్పాడు నుంచి పరకాల కు పరకాల నుంచి రేగొండ కు రేగొండ నుంచి జంగాలపల్లి కి ప్రయాణిస్తాయి. తిరుగు ప్రయాణం దారి జంగాలపల్లి నుంచి రేగొండ కు రేగొండ నుంచి పరకాల కు పరకాల నుంచి గూడెప్పాడు కు తిరుగు ప్రయాణం. వరంగల్ నుంచి ములుగు/ఏటూరునాగారం (ఆర్టీసీ బస్సులు,కార్లు, టూ వీలర్లు) వెళ్లే దారి మల్లంపల్లి నుంచి శ్రీనగర్ కు శ్రీనగర్ నుంచి పందికుంట కు పందికుంట నుంచి ములుగు కు ప్రయాణిస్తాయి. తిరుగు ప్రయాణం దారి జాకారం నుంచి అబ్బాపూర్,అబ్బాపూర్ నుంచి గోరుకోత్తపల్లి,గోరుకొత్తపల్లి నుంచి వరంగల్ వరంగల్ కు తిరుగు ప్రయాణం అవుతాయి. నర్సంపేట నుంచి ములుగు (ఆర్టీసీ బస్సులు మరియు కార్లు) వెళ్లే ప్రయాణం దారి మల్లంపల్లి నుంచి శ్రీనగర్,శ్రీనగర్ నుంచి పందికుంట కు ప్రయాణిస్తూ వెళ్లాలి.తిరుగు ప్రయాణం దారి పందికుంట నుంచి శ్రీనగర్,శ్రీనగర్ నుంచి మల్లంపల్లి కి వెళ్ళాలి. నర్సంపేట నుంచి ములుగు (భారీ వాహనాలు) వెళ్లే ప్రయాణ దారి వరంగల్ నుంచి గుడెప్పాడు కు,గూడెప్పాడు నుంచి పరకాల కు,పరకాల నుంచి రేగొండ కు,రేగొండ నుంచి జంగాలపల్లి దారి లో ప్రయాణించాలి. తిరుగు ప్రయాణం దారి జంగాలపల్లి నుంచి రేగొండ కు,రేగొండ నుంచి పరకాల కు, పరకాల నుంచి గూడెప్పాడు కు, గుడెప్పాడ్ నుంచి వరంగల్ కు ప్రయాణించాలి.ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యం ఆర్టీసీ బస్సులు మల్లంపల్లి నుంచి శ్రీనగర్ నుంచి పందికుంట గ్రామాల ద్వారా మళ్లించబడతాయి.ఈ మార్గంలో భారీ వాహనాలకు అనుమతి లేదు.

# క్షేత్ర స్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలి

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. జిల్లాకు వాతావరణ శాఖ సూచన మేరకు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో బుధవారం ఐడిఓసి కార్యాలయం నుండి ఎస్పి కిరణ్ ఖరే తో కలిసి రెవెన్యూ, పంచాయతి రాజ్, ఇరిగేషన్, వైద్య, విద్యుత్తు, వ్యవసాయ, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 72 గంటల పాటు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్న సందర్భంగా ప్రజలు బయటికి రాకుండా ఇంటిపట్టునే ఉండేలా గ్రామాలు, మున్సిపాలిటీలో టాం టాం వేయించాలని ఆదేశించారు. ఏ సమయంలో క్లౌడ్ బరెస్ట్ అవుతుందో తెలియని పరిస్థితి ఉంటుంది కాబట్టి ముందస్తుగా అన్ని శాఖల అధికారులు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇబ్బందులు ఎదురైతే కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన 9030632608 కంట్రోల్ రూము నంబర్ కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. రానున్న 3 రోజులు వాతావరణ శాఖ భారీ వర్షసూచన చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. భారీ వర్షాల సూచన మేరకు మంగళవారం ముఖ్యమంత్రి వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను అన్ని శాఖల అధికారులు తప్పక పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రతీ శాఖ అధికారులు, సిబ్బంది వారి పరిధిలో గల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్తు ప్రమాదాలు వాటిల్లకుండా సంబంధిత శాఖల అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.అన్ని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, బయటకు వెళ్లకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. పొంగి పోర్లే వాగులు, చెరువులు, రిజర్వాయర్లు, నదుల వద్దకు ప్రజలు వెళ్లకుండా నియంత్రణ చేయాలని సూచించారు. వర్షాల వల్ల నీరు కలుషితమై దోమలు ప్రబలి సీజనల్ వ్యాధులు ప్రబలకుండ వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రసవ సమయం దగ్గర ఉన్న గర్భిణి లను, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులను గుర్తించి ముందస్తుగా ఆసుపత్రిలో చేర్పించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ అధికారులు వారి వారి సిబ్బంది సమావేశం ఏర్పాటు చేసి అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. టామ్ టామ్ వేపించి ప్రజలను అలర్ట్ చేయాలన్నారు. మున్సిపల్, రెవెన్యూ డివిజన్ పరిధిలోని కాటారం సబ్ కలెక్టర్, ఆర్డిఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి, ప్రజలకు కంట్రోల్ నెంబర్లు ఏర్పాటు చేయాలని వివరించారు. ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ అకస్మాత్తుగా వర్షం వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. 25మంది ఎన్ డిఆర్ ఎఫ్ సిబ్బంది సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు వచ్చిన ఎదుర్కొడానికి యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఇరిగేషన్, విద్యుత్తు, పంచాయతీరాజ్, వైద్య, మత్స్య శాఖ, అధికారులతో పాటు అన్ని మండలాల తహసిల్దారులు, ఎంపీడీఓలు, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.


# సాగుకు సరిపడా యూరియా నిల్వలు

- జిల్లాలో సాగు చేసే రైతులకే అమ్మకం జరగాలి
- అవసరాన్ని బట్టే కోనుక్కోవాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ ప్రతినిధి,ఆగస్టు 13 (జనంసాక్షి):** జిల్లా లో సరిపడా యూరియా నిలవలు ఉన్నాయని... అవి సద్వినియోగం అయ్యేలా పర్యవేక్షణ జరగాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం సాయంత్రం క్యాంపు కార్యాలయం నుండి జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రతీ ఒక్క వ్యవసాయ అధికారులతో అలాగే పి ఏ సి ఎస్ అధికారులతో గూగుల్ మీటింగ్ ద్వారా యూరియా అమ్మకాల మీద కలెక్టర్‌లి దిశా నిర్దేశం చేసారు.ఈ సందర్భంగా లికలెక్టర్‌లి మాట్లాడుతూ... మన జిల్లా లో అన్ని ఏజెన్సీ లలో కలిపి 1788 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయని.. వాటిని మన జిల్లా లో సాగు చేసుకునే రైతులకే అమ్మకం జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతీ ఫర్టిలైజర్ షాప్, పీఏసీఎస్ షాప్ ముందు యూరియా నిల్వలను తెలిపే బోర్డు తప్పకుండ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ ఒక్క యూరియా బస్తా అమ్మకానికి సంబంధించిన రైతు పూర్తి సమాచారం నమోదు అయ్యేలా చూడాలన్నారు. పాస్ బుక్ ను తప్పకుండ పరిశీలించాలని... అందులో ఉన్న సాగు భూమి కి తగ్గట్టు గానే యూరియా ను ఆ రైతు కు ఇవ్వాలని... ఒక బస్తా కూడా ఎక్కువ ఇవ్వకుండా వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయి లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు. సాగు కు సరిపడా యూరియా నిల్వలు ఉన్నప్పుడు, ఎక్కడైనా కొరత సమస్య ఎదురైతే సంబంధిత అధికారుల మీద చర్యలు తప్పవన్నారు. యూరియా ఫార్టిలైజర్ షాప్ లోనే కాక పాక్స్ లో అలాగే ఆగ్రో షాప్, ఓడీసీఎంఎస్, హక షాప్ లోనో, ఈఫపి లో కూడా యూరియా అందుబాటులో ఉంటుందని.. రైతులు అక్కడ కూడా కొనుగోలు చేసుకోవచ్చన్నారు.

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మంగళవారం కురిసిన భారీ వర్షానికి జిల్లా ప్రధాన ఆసుపత్రిలోని పలు వార్డులలోకి వరదనీరు చేరి రోగులు ఇబ్బంది పడిన ఘటనపై బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం ఆసుపత్రిని పరిశీలించారు. వైద్యరోగ్య శాఖ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే వర్షపు నీరు చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి పై అంతస్తు నిర్మాణం జరుగుతున్న క్రమంలో ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా నిర్మాణం చేపట్టడం వలన వరద నీరు ఆసుపత్రి లోని వార్డులలో చేరడం జరిగిందని వెంటనే ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్, ఆర్.ఎం.ఓ దివ్య, టిజిఎం ఐడిసి ఏఈ రవి కిరణ్ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
14 ఆగస్టు 2025

# ఐటి మంత్రి శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం

- ఇండియన్ 100 మోస్ట్ ఇన్ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ 2025 జాబితాలో చోటు



**మంథని, ఆగస్టు 13 (జనంసాక్షి) :** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ తాజాగా ప్రకటించిన 'ఇండియాస్ 100 మోస్ట్ ఇన్ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ 2025 జాబితాలో ఆయనకు చోటు లభించింది. తమ సమర్థవంతమైన నాయకత్వం, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహమిస్తూ భారత్ ను ఏఐ రంగంలో అగ్రగామిగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్న వ్యక్తులకు ఇందులో చోటు కల్పించారు. విధాన రూపకర్తల విభాగంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, పీయూష్ గోయల్, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఇండియా ఏఐ మిషన్ సలహాదారు ఆకృత్ వైష్, ఇండియా ఏఐ మిషన్ సీఈవో, ఎన్ఐసీ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఎన్ పీసీఐ సీఈవో దిలీప్ అస్బే, నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్, నాస్కామ్ మాజీ అధ్యక్షులు దేబజాని ఘోష్ తదితర ప్రముఖులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

### ఏఐ రంగంలో రోల్ మోడల్‌గా తెలంగాణ

మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో ఏఐ రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ మారిందని, అందుకే ఆయనను ఈ జాబితాలో చేర్చినట్లు అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ నిర్వాహకులు ప్రకటించారు. 'బాధ్యతాయుతమైన ఏఐ అమలు కోసం సమగ్ర ఏఐ ఆధారిత తెలంగాణ స్ట్రాటజీ అండ్ రోడ్ మ్యాప్ ను రూపొందించడంలో కీలకంగా వ్యవహరించారు. గుడ్ గవర్నెన్స్, నూతన ఆవిష్కరణలు, సురక్షితమైన డేటా షేరింగ్‌ను ప్రోత్సహించేలా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్ ను ప్రారంభించేందుకు చొరవ చూపారు' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబును కొనియాడారు. 'గ్లోబల్ ఏఐ సమ్మిట్ నిర్వహణలోనూ మంత్రి శ్రీధర్ బాబు కీలకంగా వ్యవహరించారు. తెలంగాణలో ఏఐ ఎకో సిస్టమ్ ను మరింత బలోపేతం చేసేలా 2025-26లో 100 గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లను ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. ఆర్ అండ్ డీ, నూతన ఆవిష్కరణలు, అత్యంత నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేయాలనే సంకల్పంతో ఏర్పాటు కానున్న ఏఐ యూనివర్సిటీ విషయంలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నారు' అని ప్రశంసించారు. ఏఐ రంగంలో తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమయ్యేలా మంత్రి శ్రీధర్ బాబుకు దక్కిన ఈ గుర్తింపు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

### సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సహంతోనే ఈ గుర్తింపు : మంత్రి శ్రీధర్ బాబు

ఇది నా ఒక్కడికి లభించిన గుర్తింపు కాదు. యావత్తు తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవం. సమ్మిళిత వృద్ధి, మెరుగైన జీవితాలను అందించేందుకు ఏఐని వినియోగించాలన్న మా ప్రభుత్వ సుదూర దృష్టికి ఈ గుర్తింపు నిదర్శనం. సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతోనే నాకు ఈ జాబితాలో చోటు దక్కింది. ఆయన నాయకత్వంలో తెలంగాణను ఏఐ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్ గా తీర్చిదిద్దేలా పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నూతన ఆవిష్కరణలకు సమానత్వాన్ని జోడించి, సాంకేతిక పురోగతి ఫలితాలు రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందేలా కృషి చేస్తున్నాం.

# పాఠశాలలకు రెండు రోజులు సెలవు

- వికారాబాద్ రెడ్ అలర్ట్‌గా ప్రకటించిన వాతావరణ శాఖ
- ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి) :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా వికారాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా భారీగా కురుస్తున్న వర్షం కారణంగా ఈనెల 14. 15 తేదీల్లో అన్ని పాఠశాలలకు విద్యాశాఖ సెలవు ప్రకటించింది. ఈ మేరకు వికారాబాద్ డి ఈ ఓ రేణుక దేవి ఒక ప్రకటన విడుదల చేశారు. వికారాబాద్ జిల్లాను వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ గా ప్రకటించిన కారణంగా రెండు రోజులపాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు తెలియజేశారు. ఇప్పటికే కురుస్తున్నా భారీ వర్షం కారణంగా జిల్లాలో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో వివిధ గ్రామాల నుంచి వస్తున్న పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని గుర్తించిన విద్యాశాఖ విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా పాఠశాలలకు సెలవు ప్రకటించింది. మరో పక్క ప్రజలు ఎవరు తప్పనిసరి పరిస్థితి అయితే తప్ప ఇంట్లో నుంచి బయటకు రావద్దని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా ఎస్పీ సత్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.

# అతి భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తహసిల్దార్ బి.విజయ్ కుమార్



**కొడంగల్, ఆగస్టు 13 (జనం సాక్షి) :** అతి భారీ వర్షాల దృష్ట్యా కొడంగల్ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ బి.విజయ్ కుమార్ అన్నారు.లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకూడదని సూచనలు చేశారు.ప్రమాద కారణాల దృష్ట్యా చెరువులు, కుంటలను చూడటానికి వెళ్లారాదు.రైతులు పొలాలో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలి.విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను కానీ చేతులతో తాకకకూడదు. నీరు నిలువ ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గర నుండి వెళ్లారాదు.వాగులు వంకలు బ్రిడ్జులపై నుండి పొంగి, పొరలే సమయంలో దాటాడానికి ప్రయత్నించరాదు. పాడైన పాత భవనాల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల ప్రక్కన నివాసం ఉండరాదు అని ప్రజలు భద్రత కోసం అన్ని జాగ్రత్తలు పాటించాలని తాహసిల్దార్ కోరారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా

**గోదావరిఖని, ఆగస్టు 13 (జనంసాక్షి) :** నాషా ముక్త్ భారత్ అభియాన్-2025లో భాగంగా మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం రామగుండం పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంకు రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా హాజరై అధికారులు, సిబ్బందితో కలిసి మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలన, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా తీసుకుంటున్న చర్యలలో భాగంగా మాదకద్రవ్య దుర్వినియోగం యొక్క దుష్ప్రభావాల గురించి విస్తృత అవగాహన కల్పించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా నాషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ ఎం బి ఏ)ను అమలు చేస్తోందని అన్నారు. ఈ అవగాహన ప్రచారం యొక్క 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో మాదకద్రవ్య దుర్వినియోగానికి వ్యతిరేకంగా పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు మరియు ప్రజల నుండి విస్తృత భాగస్వామ్యాన్ని చేయాలనే ముఖ్య ఉద్దేశ్యంతో సామూహిక ప్రతిజ్ఞను నిర్వహించడం జరుగుతుంది అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా సరఫరా సాగుచేసిన చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కేసులు నమోదు చేసి, షీట్స్ ఓపెన్ చేసి పీడియాట్ అమలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం



ద్వారా మాదకద్రవ్య దుర్వినియోగం లేని సమాజాన్ని నిర్మించడానికి మన ఐక్య నిబద్ధతకు శక్తివంతమైన చిహ్నంగా ఉపయోగపడుతుంది అన్నారు.

### మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ

నేను మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, నేను డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తూ, నాతో పాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని, నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్ ఏవో శ్రీనివాస్, యాంటీ నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, సిసిఆర్ బీ ఇన్స్పెక్టర్ సతీష్, పిసిఆర్ ఇన్స్పెక్టర్ రవీందర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ బాబురావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు భీమేష్, శ్రీనివాస్, ఆర్ఐలు శ్రీనివాస్ వామనమూర్తి, సిపిఓ సూపరిండెంట్ లు ఇంద్రసేనారెడ్డి సందీప్, సంధ్య, వివిధ విభాగాలకు చెందిన ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలల శుభ్రత బోధన విధానాల తీరుపై ప్రశంసలు..



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13 (జనంసాక్షి) :** రాష్ట్ర విద్యాశాఖ అకాడమీ మానిటరింగ్‌లో భాగంగా రాష్ట్ర టీమ్ ఫరూక్ నగర్ మండలములో మూడు పాఠశాలలను సందర్శించారు పట్టణంలోని బాలికల పాఠశాలను ఎంఆర్సీ భవిత సెంటర్‌ను పరిశీలించారు. రాష్ట్ర ప్లానింగ్ కోఆర్డినేటర్ జావీద్ స్టేట్ కోఆర్డినేటర్ శశిధర్ రెడ్డి జిల్లా ఏఎస్ఓ నరేందర్ వివిధ జిల్లాల నుండి వచ్చిన అధికారులు పాల్గొని విద్యా సదుపాయాలు, బోధన విధానాలు, విద్యార్థుల ప్రతిభ, పాఠశాలల నిర్వహణను సమీక్షించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఆర్సీ కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు ఆదర్శంగా ఉన్నాయనీ మండలంలోని పాఠశాలల శుభ్రత, పాఠ్య ప్రణాళిక అమలు, విద్యార్థుల హాజరు డిఎస్ఈ ఎఫ్ఆర్ఎస్ వంటి అంశాలలో మంచి ప్రగతిని సాధిస్తున్నాయని ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయడం అభినందనీయమని అన్నారు క్రమశిక్షణ, సృజనాత్మకత, పాఠ్యేతర కార్యక్రమాల్లో విద్యార్థుల ప్రతిభను చూసి సంతోషం వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఫరూక్ నగర్ మండల విద్యాధికారి మనోహర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళ శక్తి కింద ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాల ఏర్పాటు

- జిల్లాలో 23 కేటాయింపు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- గంభీరావుపేట మండలంలో దుకాణం ప్రారంభం
- రైతులకు ఎరువుల పంపిణీని దగ్గరుండి పర్యవేక్షించిన కలెక్టర్




**గంభీరావుపేట, ఆగస్టు 13 (జనం సాక్షి) :** ఇందిరా మహిళా శక్తి కింద ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాల ఏర్పాటు చేసుకునే అవకాశం పొందిన మహిళలు వ్యాపారంలోనూ రాణించాలని, స్వయం సమృద్ధి సాధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. ఇందిరా మహిళా కింద గంభీరావుపేటలో శ్రీ మణికంఠ గ్రామ సమైక్య మహిళా సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ఎరువులు, విత్తనాలు దుకాణాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళ శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డైరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్, ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేస్తున్నామని తెలిపారు. త్వరలో ఇందిరా మహిళా శక్తి జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యలో ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే పలు దుకాణాలు ప్రారంభించామని వివరించారు. ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు రాష్ట్రంలోనే ప్రథమమని వెల్లడించారు. మహిళా సంఘాల బాధ్యులు ప్రణాళిక ప్రకారం నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.

రైతులు తమ పరిధిలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఎరువులు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి మహిళలకు ఆర్థికంగా మద్దతు పలకాలని కోరారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం రైతులకు ఎరువుల పంపిణీని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దగ్గరుండి పర్యవేక్షించారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని స్పష్టం చేశారు. అనవసర ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని సూచించారు. జిల్లాకు సరిపడా యూరియా నిలువలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, వైస్ చైర్మన్ అంజిరెడ్డి, తహశీల్దార్ మారుతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- రేగోడ్ ఎస్సై పోచయ్య



**రేగోడ్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** మాదక ద్రవ్యాలకు యువతఉండాలరేగోడ్ ఎస్సై పోచయ్య అన్నారు.మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు గంజాయి మత్తు పదార్థాలు వాడకంతో జీవితాలు నాశనమై భవిష్యత్ లేకుండా పోతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యతో పాటు మంచి ఆరోగ్యం కోసం నిత్యం యోగా, వ్యాయమం చేయాలన్నారు.అనం తరం విద్యార్థులచే మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ పోలీసు సిబ్బంది ఉన్నారు.

# కరీంనగర్‌లో ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

- ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్న యువత



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి) :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సంచలనం సృష్టించిన రెండు దొంగతనాల కేసులను పోలీసులు ఛేదించారు. కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివేకానందపురిలోని రెండు అపార్ట్‌మెంట్‌లలో ఈ నెల 6వ తేదీన రాత్రి జరిగిన చోరీలకు సంబంధించి ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేసి, వారి నుంచి చోరీకి గురైన దాదాపు 32 తులాల బంగారంలో కొంత భాగాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కరీంనగర్ సీపీ గౌష్ ఆలం తెలిపారు. వివేకానందపురిలోని భార్గవి ఎంక్లేవ్, వెంకటేశ్వర రెసిడెన్సీలలోని రెండు ఫ్లాట్‌లలో సుమారు 32 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ కేసులను సవాలుగా తీసుకున్న కరీంనగర్ సీపీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు, ఏసీపీ ఎన్. వెంకటస్వామి పర్యవేక్షణలో త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ జి.జాన్ రెడ్డి, ఇతర సిబ్బందితో కలిసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు.

### నిందితుల వివరాలు..

దినేష్ రాజ్ పురోహిత్ ఏ ఠాకూర్ జగన్ సింగ్ ఏ (30సం.) ఇతను కరీంనగర్ వాసి అయినప్పటికీ ప్రస్తుతం గడ్డి అన్నారం, రంగారెడ్డి జిల్లాలో నివాసం ఉంటున్నాడు. ఇతనిపై గతంలో 40కి పైగా దొంగతనం కేసులు ఉన్నాయి. ఖమ్మం, సూర్యాపేట, కోదాడ, విశాఖపట్నం, నిజామాబాద్, కామారెడ్డి, రంగారెడ్డి, రాచకొండ, సైబరాబాద్, కరీంనగర్, సిద్ధిపేట కమిషనరేట్ల పరిధిలో నేరాలకు పాల్పడ్డాడని గతంలో ఇతనిపై పీడీ యాక్ట్ నమోదు చేయబడిందని తెలిపారు.

కొత్తోజు సందీప్ చారి ఏ.సందీప్ (26 సం.) వృత్తి రాపిడో డ్రైవర్, జవహర్ నగర్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో నివసిస్తున్నాడు. ఇతనిపై పదికి పైగా కేసులు ఉన్నాయని గతంలో ఇతనిపై పీడీ యాక్ట్ పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ ఇద్దరు నిందితులకు చర్లపల్లి జైలులో పరిచయం ఏర్పడిందని బయటకు వచ్చాక, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పోగొట్టుకుని ఆర్థికంగా చితికిపోయారని దీంతో అప్పులను తీర్చుకోవడానికి దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు.

### రికవరీ వివరాలు..

నిందితులు చోరీ చేసిన బంగారాన్ని యెల్లారెడ్డిగూడలోని ఒక ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్‌లో కుదువబెట్టి డబ్బులు తీసుకున్నారు. ఆ డబ్బుతో జగన్ సింగ్ ఖరీదైన బైక్ కొనుగోలు చేశాడని ఈ బైక్‌ను సూరారం ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన కరీంనగర్ సీపీ గౌష్ ఆలం, ఏసీపీ ఎన్.వెంకటస్వామి, ఏసీపీ సీసీఎస్ నరసింహులు, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ జి. జాన్ రెడ్డి, సీఐ ప్రకాష్, ఎస్.ఐ. చేరాలు, రమేష్ లతోపాటు సిబ్బంది సాయి నేత్ర, ప్రశాంత్, సురేందర్, అభినవ్, ఫరీద్, నరేష్, సురేందర్ పాల్ సింగ్, హెడ్ కానిస్టేబుల్ హాసనొద్దీన్, పీసీ లు రవీందర్, ఖలీఫా అలాగే సిసీఎస్ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, ఇలాంటి అలవాట్ల వల్ల తమ జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో డబ్బులు పోగొట్టుకొని కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అలాంటి చర్యలకు పాల్పడకుండా తమ భవిష్యత్తును కాపాడుకోవాలని కోరారు.

# అభయాంజనేయ స్వామి సన్నిధిలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం

- ప్రత్యేక పూజలు చేసిన తిరుపతి రెడ్డి
- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు



**బొంరాస్‌పేట, ఆగస్టు 13 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో బుధవారం శ్రీ అభయాంజనేయ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది.ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పాటించారు తిరుపతిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంతకుముందు గ్రామస్తులు బొడ్రాయి విగ్రహాల ప్రతిష్ట చేపట్టారు.ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.







**బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి జులైలో రూ.1,256 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జూన్ నెలలో పెట్టుబడులు రూ. 2,081 కోట్లతో పోల్చి చూస్తే ఏకంగా 40 శాతం తగ్గాయి. ఈ ఏడాది మే నెలలోనూ బంగారం ఈటీఎఫ్‌లు రూ.292 కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించడం గమనార్హం.**

పసిడి ధరలు ఆల్‌టైమ్ గరిష్టాల్లో ఉండడంతో ఇన్వెస్టర్లు కొంత అప్రమత్త ధోరణితో వ్యవహరించినట్టు తెలుస్తోంది. అయినప్పటికీ వరుసగా మూడో నెలలోనూ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నికరంగా పెట్టుబడులు వచ్చినట్లు మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) విడుదల చేసిన గణాంకాల ఆధారంగా తెలుస్తోంది.

అంతకుముందు వరుసగా రెండు నెలల్లో.. ఏప్రిల్‌లో రూ.6 కోట్లు, మార్చిలో 77 కోట్ల చొప్పున గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి ఇన్వెస్టర్లు పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు ఏడు నెలల్లో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నికరంగా వచ్చిన పెట్టుబడులు రూ.9,277 కోట్లుగా ఉన్నాయి.ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోలోకి పసిడికి సైతం చోటు కల్పిస్తున్నట్లు ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. జూలై చివరికి గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని మొత్తం పెట్టుబడులు రూ.67,634 కోట్లకు పెరిగాయి. జూన్ చివరికి ఉన్న రూ.64,777 కోట్లతో పోల్చి చూస్తే 4.4 శాతం వృద్ధి చెందాయి.గోల్డ్ ఈటీఎఫ్‌లలో మొత్తం ఫోలియోలు (ఇన్వెస్టర్ పెట్టుబడి ఖాతా) జూలై చివరికి 78.69 లక్షలకు చేరాయి. 2.15 లక్షల కొత్త ఫోలియోలు నమోదయ్యాయి. 'బంగారం గత రెండేళ్లలో బలమైన పనితీరు చూపించినప్పటికీ దీన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం ఇన్వెస్టర్లకు కష్టమే. చాలా మంది ఇన్వెస్టర్లు హెడ్జింగ్ దృష్ట్యా బంగారానికి కొంత పెట్టుబడులు కేటాయించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం గరిష్ట స్థాయిల్లో ఉన్న దృష్ట్యా అప్రమత్తత అవసరం' అని జెర్మిట్ ఇన్వెస్టర్ సర్వీసెస్ సీఈవో సంతోష్ జోసెఫ్ సూచించారు.స్థూల ఆర్థిక అనిశ్చితులు, అంతర్జాతీయంగా వడ్డీ రేట్లలో అస్థిరతలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో పోర్ట్‌ఫోలియో వైవిధ్యం దృష్ట్యా బంగారానికి డిమాండ్ కొనసాగుతున్నట్టు మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా సీనియర్ అనలిస్ట్ నేహల్ మెష్రామ్ పేర్కొన్నారు.

### కాస్త ఊరించిన బంగారం

ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా బంగారం ధరలు ఊగిసలాడుతున్నాయి. కొద్దికాలంగా పెరిగిన పసిడి ధరలు.. వరలక్ష్మీవ్రతం, రాఖీ పండుగ అనంతరం క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. మంగళవారంతో పోలిస్తే బుధవారం బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి.

# లాభాల్లో మార్కెట్లు..





**జనంసాక్షి:**భారత బెంచ్ మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీలు నేడు లాభాల్లో ముగిశాయి. ద్రవ్యోల్బణ గణాంకాలు తగ్గుముఖం పట్టడంతో మార్కెట్ సెంటిమెంట్ బలపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ 304.32 పాయింట్లు లేదా 00.38 శాతం పెరిగి 80,539.91 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 50 131.95 పాయింట్లు లేదా 0.54 శాతం పెరిగి 24,619.35 వద్ద ముగిసింది.బీఎస్ఈలో బీఈఎల్, ఎటర్నల్, ఎంఅండ్ఎం టాప్ గెయినర్స్‌గా నిలవగా, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐటీసీ నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో ఎన్టీపీసీ, టైటాన్, డాక్టర్ రెడ్డీస్ టాప్ గెయినర్స్‌గా నిలవగా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, అదానీ ఎంటర్ప్రైజెస్ టాప్ లూజర్స్‌గా నిలిచాయి.విస్తృత సూచీలు గ్రీన్‌లో ముగిశాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.63 శాతం లాభపడగా, స్మాల్ క్యాప్ 0.66 శాతం లాభపడింది. రంగాలవారీగా పనితీరు మిశ్రమంగా ఉంది. నిఫ్టీ హెల్త్‌కేర్ 2.13 శాతం, ఫార్మా 1.73 శాతం, మెటల్ 1.26 శాతం, ఆటో 1.12 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్, ఆయిల్ అండ్ గ్యాస్ వరుసగా 0.04 శాతం, 0.14 శాతం, 0.05 శాతం నష్టపోయాయి.




# ఫ్లిప్‌కార్ట్ ఒక్కరోజు ప్రత్యేక సేల్

**జనంసాక్షి:**ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న 'క్రాఫ్టెడ్ బై భారత్' పేరుతో ప్రత్యేక సేల్ నిర్వహించనుంది.ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కార్యక్రమం కింద నిర్వహిస్తున్న ఈ సేల్ భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశీయ కళాకారులు, చేనేతలు, మహిళా వ్యాపారవేత్తలకు ప్రోత్సాహం కల్పించే ఉద్దేశంతో ఫ్లిప్‌కార్ట్ ఈ సేల్ నిర్వహిస్తోంది. ఈ ఒక్క రోజు ప్రత్యేక సేల్‌లో 1.4 లక్షలకు పైగా హస్తకళా ఉత్పత్తుల విక్రయానికి అవకాశం కల్పిస్తారు. 2,200 మందికి పైగా కళాకారులు, స్వయం సహాయక సంఘాలు, మహిళా వ్యాపారవేత్తలు పాల్గొంటున్నారు. వార్లీ, పటచిత్ర, మధుబని, పిచ్వాయి, టెర్రకోటా, ప్రాంతీయ చెక్క కళాకృతులు, హోమ్ డెకోర్, ఫర్నిచర్, వంటగది వస్తువులు, దుస్తులు మొదలైనవి ఈ ప్రత్యేక సేల్‌లో అందుబాటులో ఉంటాయి. భదోహి, హత్రాస్, మధురై, కన్నౌజ్, రామనగర, ఉజ్జయిని వంటి చిన్న పట్టణాల మహిళలు తమ ఉత్పత్తులు విక్రయించుకునేందుకు అవకాశం కల్పిస్తోంది.ఈసారి 100 మందికిపైగా కొత్త విక్రేతలు చేరారు. ఎంఎస్ఎంఈలు, స్థానిక కళాకారులకు తమ ఉత్పత్తులను విక్రయించు కునేందుకు ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ మిషన్ సహకారం అందిస్తోంది.




### స్వల్పంగా తగ్గిన
# ప్రత్యక్ష పన్ను వసూళ్లు

- ఆగస్టు 11 నాటికి రూ.6.64 లక్షల కోట్లు
- 10 శాతం పెరిగిన రిఫండ్‌లు

ప్రత్యక్ష పన్నుల రూపంలో ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు (ఏప్రిల్1 నుంచి ఆగస్ట్ 11 వరకు) రూ.6.64 లక్షల కోట్లు వసూలైంది.క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.6.91 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం. 3.95 శాతం మేర తగ్గినట్లు ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి విడుదల చేసిన గణాంకాలతో స్పష్టమవుతోంది. రిఫండ్‌లు పెరగడం ఇందుకు కారణం. వ్యక్తులు, కంపెనీలు, వ్యాపార సంస్థలు చెల్లించే పన్నులు ప్రత్యక్ష పన్నుల కిందకు వస్తాయి.కార్పొరేట్ సంస్థల నుంచి నికర పన్నుల ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 3 శాతం పెరిగి రూ.2.29 లక్షల కోట్లుగా నమోదైంది. వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు, సంస్థల నుంచి వచ్చిన ఆదాయం 7 శాతానికి పైగా పెరిగి రూ.4.12 లక్షల కోట్లుగా ఉంది. రూ.22,362 కోట్లు సెక్యూరిటీల లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) రూపంలో వసూలైంది. ఇదే కాలంలో రిఫండ్‌లు 10 శాతం పెరిగి రూ.1.35 లక్షల కోట్లకు చేరాయి.

# రూ.3 లక్షల కోట్లు ఇస్తా..
### గూగుల్‌కే ఆఫర్ ఇచ్చిన ఇండియన్

**జనంసాక్షి:**ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్‌కే ఆఫర్ ఇచ్చాడో భారతీ య యువకుడు. రాయిటర్స్ కథనం ప్రకారం.. పెర్‌ప్లె క్సిటీ ఏఐ సీఈఓ, భారత సంతతికి చెందిన అరవింద్ శ్రీనివాస్ గూగుల్ క్రోమ? కొనుగోలు చేయడానికి 34.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ.3,02,152 కోట్లు) నగదు బిడ్ చేశారు.దాదాపు 17 ఏళ్ల చరిత్ర ఉన్న సంస్థకు కేవలం మూడేళ్ల ఏఐ స్టార్టప్ ఆఫర్ ఇవ్వడం విశేషం.ఎన్విడియా, సాఫ్ట్ బ్యాంక్ సహా పలువురు ఇన్వెస్టర్ల నుంచి 1 బిలియన్ డాలర్లు సమీకరించిన పెర్‌ప్లెక్సిటీ ఏఐ కంపెనీ ప్రస్తుత మార్కెట్ విలువ 18 బిలియన్ డాలర్లుగా ( సుమారు రూ.1,57,800 కోట్లు) ఉంది. అంటే దాని విలువ కంటే దాదాపు రెట్టింపు ధరను గూగుల్ క్రోమ్ కొనుగోలుకు ఆఫర్ చేసింది. ఈ డీల్ కు పూర్తి స్థాయిలో నిధులు సమకూర్చేందుకు పలు ఫండ్‌లు ముందుకొచ్చాయని చెబుతోన్న పెర్‌ప్లెక్సిటీ ఏఐ.. పేర్లను మాత్రం వెల్లడించలేదు.ఆన్‌లైన్ సెర్చ్ మార్కెట్ గుత్తాధిపత్యాన్నిఆక్షేపిస్తూ కోర్టు తీర్పు నేపథ్యంలో గూగుల్‌పై ఇప్పటికే రెగ్యులేటరీ ఒత్తిడి కొనసాగుతోంది. ఈ క్రమంలో క్రోమ్‌ను వదులుకోవాలన్న ప్రతిపాదన కూడా ఉంది. అయితే కోర్టు తీర్పుపై అప్పీలుకు వెళతాం కానీ బ్రౌజర్ ను విక్రయించే ఉద్దేశం మాత్రం లేదని గూగుల్ తెలిపింది. ఈ పరిణామాలు జరుగుతుండగానే పెర్‌ప్లెక్సిటీ ఏఐ నుంచి కొనుగోలు ప్రతిపాదన రావడం గమనార్హం. చెన్నైలో జన్మించిన అరవింద్ శ్రీనివాస్ ఐఐటీ మద్రాస్ గ్రాడ్యుయేట్. గతంలో గూగుల్‌లోనే పనిచేసిన శ్రీనివాస్ డెనిస్ యారాట్స్, జానీ హెూ, ఆండీ కొన్విన్స్కీలతో కలిసి 2022లో పెర్‌ప్లెక్సిటీ ఏఐ సంస్థను స్థాపించారు.

# ట్రంప్‌తో మోదీ ముఖాముఖీ?

### ఐరాస సమావేశంలో పాల్గొననున్న ఇరువురు నేతలు



**న్యూఢిల్లీజనంసాక్షి:** ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి(ఐరాస) సర్వసభ్య సమావేశం (యూఎన్‌జీఏ) వార్షిక ఉన్నత స్థాయి సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించే అవకాశం ఉందని పీటీఐ తెలిపింది. ఇదేవిధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ సమావేశంలో ప్రసంగించనున్నారని పేర్కొంది.భారత దిగుమతులపై ట్రంప్ పరస్పర సుంకాలు విధించడంతో భారత్‌- అమెరికా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగిన తరుణంలో ప్రధాని మోదీ యూఎన్‌జీఏ సమావేశంలో పాల్గొనబోతున్నారు. ఈ సమావేశం అమెరికాలోని న్యూయార్క్‌లో జరగనుంది. సెప్టెంబర్ 23 నుండి 29 వరకు జరిగే ఈ సదస్సును సాంప్రదాయకంగా బ్రెజిల్ ప్రారంభించనుంది. ఆ తరువాత యునైటెడ్ స్టేట్స్ సెషన్ ఉంటుందని సమాచారం. భారత ప్రతినిధి సెప్టెంబర్ 26న ఉదయం అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు పీటీఐ పేర్కొంది. అదే రోజున ఇజ్రాయెల్, చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ ప్రతినిధులు కూడా ప్రసంగించే అవకాశం ఉంది.గత ఫిబ్రవరిలో ప్రధాని మోదీ అమెరికాలోని వైట్ హౌస్‌లో ట్రంప్‌తో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుతం భారత్‌తో వాణిజ్య చర్చలు నడుస్తున్న తరుణంలోనే ట్రంప్ భారతదేశంపై 25 శాతం అదనపు సుంకం విధించారు. దీంతో మొత్తం విధించిన సుంకం 50 శాతంగా మారింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ చర్యను అన్యాయమైనదిగా పేర్కొంది. కాగా సెప్టెంబర్ 26న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రధాని మోదీ.. అధ్యక్షుడు ట్రంప్ రెండోసారి భేటీ అయ్యే అవకాశాలున్నాయి. అలాగే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సహా పలు దేశాధినేతలతో మోదీ భేటీ కానున్నారని తెలుస్తోంది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై వివాదం నెలకొన్న ప్రస్తుత తరుణంలో ప్రధాని మోదీ , అధ్యక్షుడు ట్రంప్ భేటీ కానుండటం ఆసక్తికరంగా మారింది.

### ఒక్క నీటి చుక్కా వాడుకోనివ్వం

ఇందులో 1960ల నాటి సింధూ జలాల ఒప్పందం (ఐడబ్ల్యూటీ)నుంచి వైదొలగడం కూడా ఉంది. తద్వారా సింధూ జలాలను దిగువకు విడుదల చేయకుండా ఆపేసింది. దీనిపై పాక్ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఇది యుద్ధ నేరమే అవుతుందంటూ ప్రకటనలు కూడా చేసింది.ఈ నేపథ్యంలోనే మంగళవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న పాక్ ప్రధాని షరీఫ్..'మా శత్రు దేశానికి ఒక విషయం చెప్పాలనుకుంటున్నా.. మా నీళ్లను ఆపుతామంటూ మీరు బెదిరిస్తున్నారు కదా. పాకిస్తాన్‌కు చెందాల్సిన ఒక్క నీటి చుక్కను కూడా మిమ్మల్ని తీసుకోనివ్వం. ఇది గుర్తుపెట్టుకోండి'అంటూ వ్యాఖ్యానించారు. పాక్ మాజీ మంత్రి బిలావల్ భుట్టో కూడా సోమవారం ఇలాంటి ప్రేలాపనలే చేయడం గమనార్హం.ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ మునీర్, మరో నేత బిలావల్ భుట్టో కూడా భారత్‌పై యుద్ధోన్మాదంతో రెచ్చిపోతూ నోటికొచ్చినట్టు- మాట్లాడారు. భారత్‌ను ఉద్దేశిస్తూ మునీర్ అణుయుద్ధ హెచ్చరికలు చేశారు. పాక్ ఉనికికి ముప్పు వస్తే తమతో పాటు- సగం ప్రపంచం అంతమవు తుందని వార్నింగ్ ఇచ్చారు. ఇక భారత్‌కు వ్యతిరేకంగా పాక్ ప్రజలు ఏకం కావాలని బిలావల్ భుట్టో పిలుపు నిచ్చారు.

# వీధి కుక్కల తీర్పుపై సుప్రీం కోర్టు యూటర్న్?



**న్యూఢిల్లీజనంసాక్షి:** దేశ రాజధాని ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తొలగించాలంటూ వెలువరించిన తీర్పుపై సుప్రీంకోర్టు యూటర్న్ తీసుకునే అవకాశం కనిపిస్తోంది.చాలామంది ఈ తీర్పును సమర్థించగా.. కొన్ని వర్గాల నుంచి మాత్రం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఈ తరుణంలో..ఈ అంశాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ముందు కొందరు న్యాయవాదులు లేవనెత్తారు. అయితే అభ్యంతరాల నేపథ్యంలో ఆ తీర్పును పునపరిశీలిస్తానని బుధవారం స్పష్టం చేశారు. దీంతో తీర్పు వెనక్కి తీసే అవకాశాలు ఉండొచ్చనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు జంతు ప్రేమికులు.రాజధాని రీజియన్‌లో పసికందులు, వృద్ధులుపై వీధి కుక్కల దాడుల ఘటనలపై పలు మీడియా సంస్థలు ఇచ్చాయి. అందులో ఘటనలతో పాటు రేబిస్ బారిన పడి మరణించిన దాఖలాలను ప్రస్తావించాయి. ఈ కథనాలను సుమోటోగా స్వీకరించిన సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది.వీధి కుక్కలను నివాస ప్రాంతాల్లో సంచరించడం ఏమాత్రం యోగ్యం కాదని, వాటిని పట్టుకుని షెల్టర్లకు తరలించాలని, ఇందుకు 8 వారాల గడువు విధిస్తూ ఢిల్లీ సర్కార్‌కు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం (ఆగస్టు 11వ తేదీ) ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో..ఏదైనా సంస్థలు ఈ చర్యలను అడ్డుకోవాలని చూస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఇది ప్రజల మేలు కోసం చేస్తున్నది స్పష్టం చేసింది. అయితే వీధి కుక్కల కోసం షెల్టర్లు నిర్మించడం, తరలించడం ఆచరణ సాధ్యం కాకపోవచ్చని ఢిల్లీ అధికార యంత్రాంగం అంటోంది. అదే సమయంలో రాజకీయ, సినీ, ఇతర ప్రముఖుల నుంచి సుప్రీం కోర్టు తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి.

## అమితాబ్ పరువు తీస్తోంది.. సిగ్గులేని మనిషి

### జయపై కంగన ఫైర్

**జనంసాక్షి:**రాజ్యసభ ఎంపీ జయాబచ్చన్‌పై బీజేపీ ఎంపి కంగనా రనౌత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో తనతో సెల్ఫీ తీసుకోవడానికి ప్రయత్నించిన వ్యక్తిని బచ్చన్ తోసేస్తున్న వీడియో వైరల్ అయిన నేపథ్యంలో కంగనా ఆమెపై తీవ్ర విమర్శలు చేసింది.ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో జయాబచ్చన్ వీడియోను షేర్ చేస్తూ ఇలా కామెంట్ చేసింది. "అత్యంత చెడిపోయిన, విశేషాధికారం కలిగిన మహిళ" అని అంటూ విమర్శలు గుప్పించింది. అంతేకాదు భర్త అమితాబ్ బచ్చన్ మర్యాదను మంట గలుపుతోందంటూ వ్యాఖ్యానించింది."ఆమె అమితాబ్ బచ్చన్ భార్య కాబట్టి ప్రజలు ఆమె కోపతాపాలను/ అర్థంలేని తనాన్ని సహించారు. సమాజ్‌వాదీ పార్టీ కోడి పుంజులా పందెంకోడిలా, ప్రవర్తిస్తోందంటూ ఎద్దేవా చేస్తే, ఎంత అవమానం, సిగ్గుచేటు" అని కంగనా మండిపడింది. ప్రస్తుతం కంగనా వ్యాఖ్యాలు నెట్టింట చర్చకు దారి తీశాయి. గతంలో జయాబచ్చన ఇలాంటి విమర్శలొచ్చిన సందర్భంలో కంగనా వెనకేసుకొచ్చింది. నిజం చెప్పాలంటే..ఆమె కోపిష్టిమనిషే కానీ అదే సమయంలో ఆమె గొప్ప వ్యక్తి అంటూ జయాను తెగ పొగిడేసింది. 1970లలో ఆమె సినీరం గంలో రాణించారని, సినీ పరిశ్రమలో అత్యంత గౌరవప్రదమైన మహిళల్లో ఒకరు అంటూ జయను కంగనా ప్రశంసించింది.

# 20 ఏళ్లకే దేశానికి అధ్యక్షుడయ్యాడు




**జనంసాక్షి:**నిండా 25 ఏళ్లు లేవు కానీ ఓ దేశానికి అధ్యక్షుడిగా పాలిస్తున్నాడు . అది కూడా స్వయం ప్రకటిత దేశం. ఆ దేశానికి స్వంతంగా జెండా, కేబినేట్, స్వంత కరెన్సీ కూడా ఉంది.ఇదంతా ఎక్కడ..? అంత చిన్న వయసులోనే అధ్యుకుడైన ఆ టీనేజర్ ఎవరు అంటే..?..స్వయం ప్రకటిత దేశానికి అధ్యుడిగా ఉన్న ఆ వ్యక్తి డేనియల్ జాక్సన్. బ్రిటన్‌కి చెందినవాడు, ఆస్ట్రేలియా మూలాలు ఉన్న వ్యక్తి. ఆ దేశం పేరు ఫ్రీ రిపబ్లిక్ ఆఫ్ వెర్డిస్ అత్యంత ఆసక్తికర విషయం ఏంటంటే 18 ఏళ్ల వయసులోనే సొంతంగా ఓ దేశాన్ని క్రియేట్ చేసి తానే అధ్యక్షుడిగా ఉండాలని కలలు కనేవాడట. అలా క్రొయేషియా, సెర్బియా దేశాల మధ్య ఉన్న వివాదాస్పద భూమిని తన రాజ్యంగా ఎంచుకుని స్వయం ప్రకటిత దేశంగా మార్చాడు. వృత్తి రీత్యా డిజిటల్ డిజైనర్, గేమింగ్ ప్లాట్‌ఫామ్ రోబ్లాక్స్‌లో వర్చువల్ ప్రపంచాన్ని సృష్టించి వేతనం పొందేవాడు. అలాంటి ఈ వ్యక్తి ఈ వెర్రీ ఆలోచనతో మే 30, 2019న ఆ రెండు దేశాల మధ్య ఉండే వెర్రిస్ అనే ఈ వివాదాస్పద భూమిని స్వతంత్ర రిపబ్లిక్ దేశంగా ప్రకటించాడు.డానుబే నది ఒడ్డున దాదాపు 125 ఏకరాల్లో ఈ దేశం ఉంది. ఈ దేశానికి స్వంత జెండా, కేబినేట్, స్వంత కరెన్సీతో సహా సుమారు 400 మంది రిజిస్టర్ పౌరులు కూడా ఉండటం విశేషం. ఈ చిన్న దేశాన్ని స్థానికంగా 'పాకెట్ త్రీ' అని కూడా పిలుస్తారు.హాయిగా అధ్యక్షుడి సాగిపోతున్న డేనియల్‌కి అక్టోబర్ 2023లో క్రొయేషియా దేశం నుంచి ఊహించని షాక్ తగిలింది. ఆ చిన్న దేశంలోని ఉంటున్న కొందరు స్థిరనివాసులను, ఆ దేశ అధ్యక్షుడిగా చెప్పుకునే డేనియల్‌ని క్రోయేషియా పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఆ తర్వాత అతడిని దేశం నుంచి బహిష్కరించారు.ఇంత జరిగినా డేనియల్ తన చిన్న దేశాన్ని రిమోట్‌గా నడుపుతూనే ఉన్నాడు. క్రొయేషియా తనను జాతీయ భద్రతకు ముప్పు అని చెప్పి.. బహిష్కరించారని చెబతున్నాడు డేనియల్. అంతేగాదు తాను ఏదోలా క్రోయేషియా దేశంతో శాంతియుతంగా ఒప్పందం చేసుకుని..ఈ చిన్న దేశాన్ని అధికారికంగా ప్రకటించేలా చేస్తానని నమ్మకంగా చెబుతున్నాడు.ఆ చర్చలు సఫలమై తన దేశం అధికారికంగా ప్రకటించబడిన వెంటనే తాను అధికారం నుంచి తప్పుకుంటానని కూడా అంటున్నాడు. తానొక సాధారణ పౌరుడిగానే ఉంటానని చెబుతున్నాడు. అదీగాక ఇది తాను సృష్టించిన దేశమే కాబట్టి దీన్ని చూసి గర్విస్తుంటానని, తనకు అదే చాలని గొప్పగా చెబుతున్నాడు డేనియల్. ఇక డేనియల్ సృష్టించిన ఈ దేశానికి పౌరుడిగా మారాలంటే..వైద్యం లేదా పోలీసింగ్ అనుభవం వంటి నైపుణ్యాలు ఉంటే చాలట. దెబ్బకు సులభంగా ఆ దేశ పౌరసత్వం లభించేస్తుందట. అలాగే తమ దేశానికి చేరుకోవడానికి ఏకైక మార్గం క్రొయేషియా నగరం ఒసిజెక్ నుంచి పడవ మార్గం ద్వారా చేరుకోవాలట.

# మునీర్ మంతనం..

### పాక్ మద్దతుగా అమెరికా సంచలన నిర్ణయం

**జనంసాక్షి:** బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ), మజీద్ బ్రిగేడ్‌లను విదేశీ ఉగ్రవాద సంస్థ (ఎఫ్‌టీఓ)లుగా అమెరికా ప్రకటించింది. బీఎల్ఏని 2019లోనే..స్పెషల్లీ డెజిగ్నేటెడ్ గ్లోబల్ టెర్రరిస్ట్ (ఎస్‌డీజీటీ) జాబితాలో చేర్చిన అమెరికా.. తాజాగా మజీద్ బ్రిగేడ్‌ను కూడా బీఎల్ఏలో భాగంగానే భావిస్తున్నట్టు ప్రకటించింది. 2019 నుంచి ఆ రెండు సంస్థలు చేసిన ఉగ్రవాద దాడుల నేపథ్యంలో ఎఫ్‌టీవోలుగా గుర్తిస్తున్నట్టు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకటించారు.ఈ సంస్థల హింసాత్మక చర్యలు పౌరుల భద్రతకు ముప్పు కలిగిస్తున్నాయని, ఈ ప్రాంతంలో స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్నాయని తెలిపారు. ఉగ్రవాద కార్యకలాపాలను ఎదుర్కోవడంలో అమెరికా ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. 'ఉగ్రవాద సంస్థలను ఇలా గుర్తించడం వల్ల వాటికి లభించే సహాయాన్ని, నిధులను నిరోధించవచ్చు. ఈ సంస్థలకు ఆర్థికంగా, భౌతికంగా లభించే మద్దతును చట్టపరంగా నిలిపివేయడం ద్వారా ఉగ్రవాద కార్యకలాపాలను అడ్డుకోవడం ఈ చర్య ప్రధాన ఉద్దేశం'అని ఆయన పేర్కొన్నారు. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అమెరికా పర్యటనలో ఉండగానే ఈ ప్రకటన రావడం గమనార్హం. ఆయన చేసిన విజ్ఞప్తితోపాటు బలమైన కార ణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. జూన్‌లో అమెరికా అధ్యక్షుడితో ము నీర్ ఒక ప్రైవేట్ విందుకు హాజరైనప్పటి నుంచి పాకిస్తాన్ పట్ల అమెరికా అమితమైన ఔదా ర్యం చూపుతోంది. బీఎల్ఏని విదేశీ ఉగ్రవాద సంస్థగా ముద్ర వేయడం అందులో భాగం. మునీర్ అమెరికా పర్యటన సందర్భంగానే ఈ ప్రకటన రావడం అతనికి దౌత్యపరమైన విజ యాన్ని అందించింది. అయితే.. తమ దేశంలో విధ్వంసక కార్యకలాపాలను నిర్వహించడానికి బీఎల్ఏను భారత్ రెచ్చగొడుతోందని పాక్ ఆరోపిస్తున్న నేప థ్యంలో అమెరికా ఈ ప్రకటన చేయడం పలు ఊహాగానాలకు తావిస్తోంది.

# కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతాం

- సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని సహించేది లేదు
- బకాయిల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేయకుండా ఏఐటియుసి పై విమర్శలు చేయడం ఐఎన్టీయుసి విధానం
- ఏఐటియుసి అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్




**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణిలో కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయిందని, యాజమాన్యం రాజకీయ జోక్యాన్ని అరికట్టకుంటె సహించేది లేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. బుధవారం గోదావరిఖని లో జరిగిన యూనియన్ సెంట్రల్ ఆఫీస్ బేరర్స్ మీటింగ్ అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి లో కార్మికుల సంక్షేమం కోసం వారి హక్కుల సాధన కోసం గుర్తింపు సంఘం ఏఐటియుసి ఒక వైపు కృషి చేస్తా ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కి చెందిన సొమ్మును ఇష్టానుసారంగా వాడుకుంటూ దారాదత్తం చేస్తుందని వారు ఆరోపించారు. గత ప్రభుత్వం రాజకీయ జోక్యం వల్ల సింగరేణి కి 19వేల కోట్ల రూపాయలు బకాయి పడ్డదని, చెల్లించాలని ఏఐటియుసి అనేక పోరాటాలు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి బకాయిలు బిఆర్ఎస్ ప్రభుత్వం వాడుకొని దుర్వినియోగం చేసిందని ఆరోపించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విపరీత రాజకీయ జోక్యం వల్ల నేడు సింగరేణి కి బొగ్గు, విద్యుత్తు వాడుకొని దాదాపు 34 వేల కోట్ల రూపాయలు బకాయి పడ్డదని వారు పేర్కొన్నారు. సింగరేణి కి చెందిన బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వ విధానాలనే అవలంబిస్తూ సింగరేణి కి తీరని నష్టం చేస్తుందని వారు విమర్శించారు. సింగరేణి లో గుర్తింపు సంఘం గా గెలిచిన ఏఐటియుసి సమస్యల పరిష్కారం లో వైఫల్యం చెందిందని ఆరోపిస్తున్న తోటి ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్టీయుసి సింగరేణి కి రావాల్సిన వేల కోట్ల రూపాయలు బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎందుకు ఇప్పించడం లేదని వారు ప్రశ్నించారు. గత ఐదు సంవత్సరాలుగా సింగరేణి లో జరగని స్ట్రక్చర్ సమావేశాలను గుర్తింపు సంఘం ఏఐటియుసి గెలిచిన తరువాత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రెండు సార్లు స్ట్రక్చర్ సమావేశాలు జరిగాయని, అందులో కొన్ని సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం అంగీకరించిందని కానీ అమలు కోసం సర్క్యులర్‌లు జారీ చేయకుండా యాజమాన్యంతో ఐఎన్టీయుసి కుమ్మక్కై అడ్డుకుంటూ ఏఐటియుసిని బద్నాం చేస్తుందని వారు ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం ఇప్పటికేనా స్ట్రక్చర్ సమావేశాల్లో అంగీకరించిన సమస్యల పై వెంటనే సర్క్యులర్‌లు జారీ చేయాలని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి లో రాజకీయ జోక్యం లేకుండా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే సింగరేణి వ్యాప్తంగా సంస్థ పరిరక్షణ కోసం, కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు మిర్యాల రంగయ్య, ఎల్ ప్రకాష్, వై.వి.రావు, మడ్డి ఎల్లాగౌడ్, ముస్కె సమ్మయ్య, వీరభద్రం, అన్ని ఏరియాల కేంద్ర నాయకులు, బ్రాంచి కార్యదర్శులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగష్టు 13(జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో, జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వ్యవసాయ, హెల్త్, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ వంటి వివిధ శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల్లోని లో-లెవెల్ కాజ్‌వేల వద్ద అప్రమత్త చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కంట్రోల్ రూంలో 24 గంటలూ వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ, వర్షాలు, వరదల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు సమాచారం అందించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సహాయం అందిస్తారని తెలిపారు. ఈ నెల 13 నుంచి 16 వరకు అధికారులు కంట్రోల్ రూంలో సేవలు అందిస్తారని చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూం టోల్ ఫ్రీ నంబర్ 1800 233 1495 లేదా వాట్సాప్ నంబర్ 9398684240 ద్వారా సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు తమ కార్యాలయాల్లో, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, వర్షాల వల్ల ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటికి రావద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు.

## మొక్కలు నాటిన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్.. అదనపు కలెక్టర్ అరుణశ్రీ

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్థానిక అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ అరుణ శ్రీతో కలిసి మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వన మహోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలకు పచ్చదనం ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడంలో అందరూ చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపుతో భవిష్యత్ తరాలకు శుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ అరుణ శ్రీ కూడా ఈ సందర్భంగా మాట్లాడుతూ, నగరంలో పచ్చని ప్రదేశాలను విస్తరించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగల అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

## అతి భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**తహసిల్దార్ బి.విజయ్ కుమార్**

కొడంగల్, (జనంసాక్షి): అతి భారీ వర్షాల దృష్ట్యా కొడంగల్ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ బి.విజయ్ కుమార్ అన్నారు.లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకూడదని సూచనలు చేశారు.ప్రమాద కారణాల దృష్ట్యా చెరువులు, కుంటలను చూడటానికి వెళ్లారాదు.రైతులు పొలాలో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలి.విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను కానీ చేతులతో తాకకకూడదు.నీరు నిలువ ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గర నుండి వెళ్లారాదు.వాగులు వంకలు బ్రిడ్జ్ లపై నుండి పొంగి, పొరలే సమయంలో దాటాడానికి ప్రయత్నించరాదు.పాడైన పాత భవనాల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల ప్రక్కన నివాసం ఉండరాదు అని ప్రజలు భద్రత కోసం అన్ని జాగ్రత్తలు పాటించాలని తాహసిల్దార్ కోరారు.



## భారతీయ కిసాన్ సంగ్ మండల శిక్షణ తరగతులు

**సదాశివ నగర్ ఆగస్టు 1(జనం సాక్షి) :** భారతీయ కిసాన్ సంగ్ సదాశివనగర్ మండల శిక్షణ తరగతులు అనగా 13. 8.25 రోజున కుప్రియల్ బాణాల రెడ్డి ఫంక్షన్ లో నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలు అధ్యక్షులు కార్యదర్శులు సభ్యులు పాల్గొనడం జరిగింది. 120 మంది మండలం గ్రామాల సభ్యులు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమానికి సభా అధ్యక్షత మండల అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి నిర్వహించడం జరిగింది .ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు పైడి విట్టల్ రెడ్డి ,రాష్ట్ర విద్యుత్ ప్రముఖ శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందరావు, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు ,జిల్లా కార్యదర్శి శంకర్రావు, మండల కార్యదర్శి మార నారాయణరెడ్డి ,జోనల్ అధ్యక్షుడు లొంక వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇదిగో పక్కా ఆధారాలు

## చూడండి విద్యాశాఖ అధికారులు








### 46 మంది పిల్లలు ఉంటే ఒక్కరే టీచర్

- మరొక్కరిని డిప్యూటేషన్ ఇచ్చిన విద్యాశాఖ అధికారులు
- గ్రామీణ ప్రాంతాల నుండి గండిపేట, గచ్చిబౌలికి..
- జీతాలు మాత్రం పల్లెల్లో పనిచేస్తున్నట్లు..
- గిరిజన ప్రాంతాల్లో చదువును నష్టపోతున్న పేద విద్యార్థులు

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లాలో డిప్యూటేషన్‌ల పర్వం డైలీ సీరియల్ లాగా కొనసాగుతూనే ఉంది. పక్కా ఆధారాలతో జనంసాక్షి వరుస కథనాలు ప్రచురిస్తూనే ఉంది. షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గ్ మండలం చెర్కుపల్లి ప్రాథమిక పాఠశాలలో 46 మంది విద్యార్థులు తమ చదువును కొనసాగిస్తుంటే ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు శివారెడ్డి, సుష్మ విధులు నిర్వహిస్తున్నారు. అయితే గత నాలుగు రోజుల క్రితం ఇక్కడ పనిచేస్తున్న సుష్మ అనే ఉపాధ్యాయురాలిని చెరుకుపల్లి పాఠశాల నుండి డిప్యూటేషన్‌పై గండిపేట మండలంలోని బీరంచెరువు పాఠశాలకు వెళ్ళారు. 46 మంది విద్యార్థులకు కేవలం శివారెడ్డి అనే ఒక్కరే ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు ఆగ్రహంతో మండల విద్యాధికారి కార్యాలయం ముందు, జాతీయ రహదారిపై గ్రామస్తులు విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడికి ఈ మధ్యకాలంలో రోడ్డు ప్రమాదం జరిగి కాలు విరిగి ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఇబ్బంది పడుతూ విద్యార్థులకు చదువును బోధిస్తున్న దుస్థితి నెలకొంది. ఇక ఇదే మండలంలోని అగిర్యాల గ్రామ పాఠశాల నుండి ఏకంగా స్కూల్ అసిస్టెంట్ డిప్యూటేషన్‌పై డీఈఓ ఆఫీసులో వయోజన విద్య కింద విధులు నిర్వహిస్తున్నారు. లక్ష్మీదేవిపల్లి గ్రామ పాఠశాల నుండి ఆరుట్ల పాఠశాలకు హతిరామ్ అనే ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ముట్పూర్ గ్రామ పాఠశాల నుండి శ్రావణి అనే పిడి ఆరుట్లకు, ఉమ్మెంత్యల గ్రామ పాఠశాల నుండి నరేందర్ రెడ్డి హైదరాబాద్‌కు డిప్యూటేషన్ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి మండల విద్యాధికారికి ఆర్డర్స్‌తో పాటు ఆదేశాలు జారీ చేశారు. కానీ స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు రిలీవ్ చేయకూడదని గట్టిగా చెప్పడంతో వారి మాటలను దృష్టిలో ఉంచుకొని కొంతమందిని రిలీవ్ చేశారు. మరికొందరిని రిలీవ్ చేయలేదు. మండల విద్యాధికారులు ఇక చౌదర్ గూడ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు డిప్యూటేషన్ పై వెళ్ళారు.

గణిత శాస్త్ర ఉపాధ్యాయురాలు వాణి చౌదర్ గూడా నుండి మన్సూరాబాద్‌కు డిప్యూటేషన్ పై వెళ్తే.. తెలుగు ఉపాధ్యాయురాలు శైలజ వనస్థలిపురం ప్రాంతానికి డిప్యూటేషన్ పై వెళ్ళింది. ఇదే పాఠశాల నుండి ఇంగ్లీషు ఉపాధ్యాయురాలు మహేశ్వరం డిప్యూటేషన్ పై వెళ్తే మహేశ్వరం నుండి మరొకరు డిప్యూటేషన్ పై చౌదర్ గూడ మండలానికి డిప్యూటేషన్‌పై వచ్చారు. ఫరూక్ నగర్ మండలం వెల్జర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో 250 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు ప్రవీణ కర్మన్ ఘాట్, శైలజ మన్సూరబాద్ ఇలా హైదరాబాదు పట్టణానికి శివారుగా డిప్యూటేషన్ పై వెళ్ళారు.

జీతాలు మాత్రం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలో పనిచేస్తున్నట్టే తీసుకుంటున్నారు. దీంతో విద్యార్థి సంఘాల నాయకులు గ్రామస్థులు తమ విద్యార్థులకు న్యాయం చేయాలని, అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని ఆందోళనకు సైతం దిగారు. ఇలా ఈ డిప్యూటేషన్‌లు ఎందుకు ఇస్తున్నారో.. ఎవరు చెబితే ఇస్తున్నారో మరి..!



## మా టీచర్ మాకు రావాలి

- కొందుర్గ్ ఎంఈఓ కార్యాలయం ఎదుట విద్యార్థుల ఆందోళన
- మొన్ననే పంపించిన ఉపాధ్యాయురాలిని తిరిగి రప్పించాలని డిమాండ్

రంగారెడ్డి జిల్లా కొందుర్గు, చౌదర్ గూడా మండలాల్లో డిప్యూటేషన్ల పర్వం కొనసాగుతూనే ఉంది. కొందుర్గు మండలం చెరుకుపల్లి ప్రాథమిక పాఠశాలలో 46 మంది విద్యార్థులు ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా.. మొన్న ఓ ఉపాధ్యాయురాలు చెరుకుపల్లి పాఠశాల నుండి రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని బీరంచెరువు పాఠశాలకు డిప్యూటేషన్ పై వెళ్ళింది. ఈ సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు విద్యార్థులను తీసుకొని కొందుర్గ్ మండల విద్యాధికారి ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. 46 మంది పిల్లలు ఉన్న పాఠశాలలో ఒక్కరే ఇలా విధులు ఎలా నిర్వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ డిప్యూటేషన్ పై వెళ్లిన ఉపాధ్యాయురాలిని తిరిగి పాఠశాలకు రప్పించాలని డిమాండ్ చేశారు. జీతం తమ వద్ద పనిచేస్తున్నట్టు తీసుకొని గండిపేటలో ఎలా విధులు నిర్వహిస్తారని ప్రశ్నించారు. అసలు విద్యాశాఖ అధికారులు ఎలా డిప్యూటేషన్లు ఇస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

# పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కలెక్టర్




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (జనం సాక్షి) :** బుధవారం కామారెడ్డి పట్టణంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అడిషనల్ కలెక్టర్ బి చందర్ మున్సిపల్ కమిషనర్,జాయింట్ డైరెక్టర్ అగ్రికల్చర్, తహసీల్దార్ ఇతర అధికారులతో కలిసి విద్యానగర్ కాలనీలోని సాయిబాబా గుడి వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలించి అధిక వర్షాల హెచ్చరికల నేపథ్యంలో కామారెడ్డి పట్టణంలో డ్రైనేజీలు బ్లాక్ అయి మురుగునీరు రోడ్ల మీదికి, ఇండ్లలోకి రాకుండా ముందస్తుగా అన్ని డ్రైనేజీలను శుభ్రం చేయాలని, రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని, తడి మరియు పొడి చెత్త ఎక్కడపడితే అక్కడ పడేయకుండా ప్రతిరోజు వాహనాల ద్వారా చెత్తను సేకరించి డిస్పోజల్ చేయాలని, పట్టణంలో ఎక్కడ వర్షం నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు చేపట్టాలని, దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని, ఫాగింగ్ చేయాలని, భారీ వర్షం సంభవించినప్పుడు పట్టణ ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుండి బయటకు రాకుండా ముందస్తుగా ప్రచారం కల్పించాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డిని ఆదేశించారు.

అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు పనిముట్లను అందజేసి ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా పనిచేసే కార్మికులకు రైన్ కోట్స్ మరియు అత్యవసరమైన ఇతర సామాగ్రి అందజేయుటకు వెంటనే ప్రపోజల్స్ పంపించవలసిందిగా ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ వర్ష సూచనల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలి

**నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**



**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 13 (జనం సాక్షి) :** రానున్న రెండు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన దృష్ట్యా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. పట్టణాలు, గ్రామాలు, తండాలలో ప్రజలను కూడా అప్రమత్తం చేయాలని, ఎక్కడ కూడా ఏ చిన్న అవాంచనీయ సంఘటన చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి కలెక్టర్ బుధవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, జాగ్రత్తలు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది కార్యస్థానాల్లో అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఏర్పడితే వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మొదలుకుని జిల్లా పంచాయతీ అధికారి వరకు, ఆశాలు, ఏఎన్ఎంల నుండి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వరకు ఇలా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అందరూ కార్యస్థానాల్లో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితి దృష్ట్యా సెలవులను కూడా రద్దు చేయడం జరిగిందని గుర్తు చేశారు. రానున్న 48 గంటలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, అత్యవసరం అయితేనే ప్రజలు ఇళ్ళ నుండి బయటకు రావాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ మేరకు అన్ని నివాస ప్రాంతాలలో టాంటాం, మైకుల ద్వారా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ నగరంతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ పట్టణాలలో అత్యవసర పరిస్థితులు తలెత్తిన సమయాలలో చేపట్టే సహాయక చర్యలపై ప్రజలకు భరోసా కల్పించేలా ఆయా వార్డులలో మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. లోతట్టు ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాల వద్దకు ప్రజలు ఎవరూ వెళ్ళకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చేపల వేట, ఈత కోసం చెరువులు, కాలువలు, రిజర్వాయర్లలోకి దిగకుండా కట్టడి చేయాలని, అవసరమైన చోట పోలీసు బందోబస్తు, పికెటింగ్ లను ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. ఇదివరకు వరద ప్రభావానికి గురైన ప్రాంతాలపై మరింత ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ, అప్రమత్తతతో కూడిన చర్యలు చేపట్టాలని అన్నారు. ఇదివరకు ఏర్గట్ల మండలం తడ్ పాకల్ గోదావరి పరీవాహక ప్రాంతంలో పలువురు వరద ప్రవాహంలో చిక్కుకున్న సంఘటనను కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేస్తూ, అలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రాంతాలలో పూడిక పేరుకుపోకుండా వెంటదివెంట శుభ్రం చేయించాలని, అవసరమైన వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా జేసీబీలు, ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. అన్ని మండలాలలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి, ప్రజలకు సమాచారం తెలియజేయాలన్నారు. భారీ వర్షాల వల్ల ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే, తక్షణమే స్పందిస్తూ పునరుద్ధరణ చర్యలు చేపట్టేలా సిబ్బందిని క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉంచాలని ట్రాన్స్కో ఎస్.ఈ రవీందర్ ను ఆదేశించారు. తెగిన విద్యుత్ వైర్ ల సమీపంలోకి ప్రజలు వెళ్ళకుండా చూడాలన్నారు. వరద నీటి కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, ఆసుపత్రులలో వైద్యులు, సిబ్బంది విధుల్లో అందుబాటులో ఉండాలని, అవసరమైన ఔషధ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్ళలో ఉంటున్న వారిని తక్షణమే ఖాళీ చేయించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. భారీ వర్షాలు, పిడుగుపాటు వల్ల మూగజీవాలకు సైతం ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నందున, ఈ విషయం రైతులను, పశువుల పెంపకందార్లను అప్రమత్తం చేయాలని సూచించారు. విద్యుత్, రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్ బీ, పంచాయితీరాజ్, ఇరిగేషన్, వైద్యారోగ్యం, వ్యవసాయ తదితర శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో భారీ వర్షాల వల్ల ఎలాంటి ఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఏ క్షణమైనా మంజీరా బ్యారేజి గేట్ల ఎత్తివేత



**హైదరాబాద్, (జనంసాక్షి) :** సింగూర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్ష సూచన వలన మరియు ప్రాజెక్టుకు లోకి 5,000 క్యూసెక్కులు వరద నీరు వస్తున్నది. కావున, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టు పవర్ హౌస్ మరియు ప్రాజెక్టు గేట్ల ద్వారా వరద నీటిని ఈరోజు ఏ సమయంలోనైనా నదిలోకి వదలడం జరుగుతుందని నీటిపారుదల శాఖ ప్రకటించిన నేపథ్యంలో జలమండలి అధికారులు సైతం మంజీరా డ్యామ్ నుండి నీటిని విడుదల చేయనున్నారు. అందువల్ల, మంజీరా డ్యామ్ దిగువ ప్రాంతాల వారు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోగలరు. మంజీరా నది పరివాహక ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పశువులు, గొర్ల కాపరులు మరియు చేపల వేటకు పోయే వారు నది లోనికి వెళ్లరాదని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది.

**పాస్‌పోర్టు పోయినది**

నేను, **కిషన్ కుమార్ అగర్వాల్ తండ్రి. బన్వారి లాల్ అగర్వాల్ , వయస్సు 59, నివాసము 1-5-1115/50,51 70, 71 లైన్ నెంబర్ 4 పంచశీల ఎంక్లేవ్, ఓల్డ్ అల్వాల్ జీడిమెట్ల, పోస్ట్ సుచిత్రా జంక్షన్, జిల్లా మేడ్చల్ మల్కాజ్‌గిరి,** నా యొక్క ఫ్యాక్టరీ శ్రీ రాజు ఐరన్ స్టీల్ అండ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, చిన్న శంకరంపేట మండలంలోని రుద్రారం గ్రామం నుండి తేదీ 07-8-2025 ఫ్యాక్టరీకి వెళ్ళి, అక్కడ పని ముగించుకుని నేను తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్లి చూసేవరకు నా యొక్క పాస్‌పోర్ట్ కనబడ లేదు, ఎక్కడో పడిపోయినది, కావున పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికితే ఇవ్వగలరని కోరుచున్నాను నా యొక్క పాస్ పోర్ట్ నెంబర్ : **U5377088**



# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ సత్తా

### టాప్ 2లోకి రోహిత్ శర్మ

టీమ్ఇండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటాడు. ఒక స్థానం మెరుగుపర్చుకొని రెండో ప్లేస్ దక్కించుకున్నాడు. ప్రస్తుతం హిట్‌మ్యాన్ 756 రేటింగ్స్‌తో రెండో స్థానంలో కొనసాగడం విశేషం. యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానం పదిలం చేసుకున్నాడు. 784 రేటింగ్ పాయింట్స్‌తో గిల్ టాప్‌లో ఉండగా, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 736 రేటింగ్స్‌తో నాలుగో ప్లేస్‌లో ఉన్నాడు. ఇలా టాప్ 2 ర్యాంకులు మనోళ్లవే కాగా, టాప్ 5లో ముగ్గురు టీమ్ఇండియా బ్యాటర్లు ఉండడం విశేషం.అయితే 2025 ఐపీఎల్ తర్వాత రోహిత్ ఇప్పటిదాకా బరిలోకి దిగలేదు. రోహిత్ ఆఖరి మ్యాచ్ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ఆడాడు. అప్పట్నుంచి మళ్లీ టీమ్ ఇండియా వన్డేలు ఆడలేదు. అయినప్పటికీ హిట్ మ్యాన్ ఒక స్థానం మెరుగుపర్చుకోవడం విశేషం. ఇప్పటిదాకా ఆ స్థానంలో ఉన్న పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ రీసెంట్‌గా వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో ఫెయిల్ అయ్యాడు. మూడు మ్యాచ్‌ల్లో కేవలం 56 పరుగులే చేశాడు. దీంతో బాబర్ 751 రేటింగ్స్‌తో మూడో స్థానానికి పడిపోయాడు.

## కామన్వెల్త్ క్రీడలకు బిడ్

### భారత ఒలింపిక్ సంఘం ఆమోదం

ఒలింపిక్ తర్వాత అత్యంత ఆదరణ ఉన్న, ఎక్కువ దేశాలు బరిలో నిలిచే కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ సిద్ధమవుతోంది. 2030 క్రీడలను గుజరాత్‌లో నిర్వహించేందుకు బిడ్ దాఖలు ఇప్పటికే వార్తలు వచ్చాయి. 2030 కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడానికి భారత ఒలింపిక్ సంఘం బిడ్‌కు ఆమోదం తెలిపింది. ఆగస్టు 31 గడువుకు ముందే ప్రతిపాదనలను సమర్పించాలని ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో నిర్ణయించింది. కామన్వెల్త్ క్రీడలకు 2010లో తొలిసారి భారత్ ఆతిథ్యం ఇచ్చింది. మరోసారి నిర్వహించాలనే ఆలోచనలో ఉన్న కేంద్ర ప్రభుత్వం, 2030లో జరిగే పోటీల కోసం ముమ్మర కసరత్తు చేస్తోంది. 2036 ఒలింపిక్ క్రీడల నిర్వహణకు ఆసక్తి కనబరుస్తున్న కేంద్రం, వాటిని కూడా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోనే నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించింది. అంతకు ముందే కామన్‌వెల్త్ క్రీడల సమర్థ నిర్వహణ ద్వారా దేశ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పాలని యత్నిస్తోందని నిపుణులు అంటున్నారు.

## మూడు ఫార్మాట్లకు శుభ్‌మన్‌ను కెప్టెన్ చేయండి

### మాజీ సెలెక్టర్ దేవాంగ్ గాంధీ

భారత క్రికెట్ జట్టు కెప్టెన్సీ వ్యవహారంపై ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చ జరుగుతోంది. టీ20 ప్రపంచకప్ 2024 తర్వాత రోహిత్ శర్మ టీ20ల నుంచి తప్పుకోవడంతో, బీసీసీఐ స్ప్లిట్ కెప్టెన్సీ (వేర్వేరు కెప్టెన్లు) విధానాన్ని అధికారికంగా అమల్లోకి తెచ్చింది. ప్రస్తుతం టీ20లకు సూర్యకుమార్ యాదవ్, వన్డేలకు రోహిత్ శర్మ, టెస్టులకు యువ సంచలనం శుభ్‌మన్ గిల్‌లు సారథ్యం వహిస్తున్నారు. ఈ ముగ్గురు కెప్టెన్ల విధానంపై మాజీ సెలెక్టర్ దేవాంగ్ గాంధీ ఆసక్తికరమైన, సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత క్రికెట్‌కు దీర్ఘకాలంలో స్ప్లిట్ కెప్టెన్సీ విధానం సరిపోదని దేవాంగ్ గాంధీ అభిప్రాయపడ్డారు.




. పాకిస్తాన్‌తో జరిగిన మూడో వన్డేను వెస్టిండీస్ గెలవడమే కాకుండా, సిరీస్‌ను కూడా గెలుచుకుంది. ఈ విధంగా, వెస్టిండీస్‌పై వన్డే సిరీస్‌ను కోల్పోకుండా 34 ఏళ్లుగా పాకిస్తాన్ నెలకొల్పిన రికార్డును మహ్మద్ రిజ్వాన్ కెప్టెన్సీలో బద్దలు కొట్టింది. 1991 తర్వాత పాకిస్తాన్‌పై వెస్టిండీస్ తన తొలి వన్డే సిరీస్‌ను గెలుచుకుంది. ఈ శతాబ్దంలో అంటే 2000 తర్వాత ఏ ఫార్మాట్‌లోనైనా పాకిస్తాన్‌పై వెస్టిండీస్ సాధించిన తొలి సిరీస్ విజయం కూడా ఇదే కావడం గమనార్హం.

# పాకిస్థాన్ చిత్తు

### 2-1తో మూడు వన్డేల సిరీస్.. విండీస్ వశం

### టాపార్డర్ వైఫల్యం వల్లే వెస్టిండీస్ చేతిలో ఘోర పరాజయం
### పాకిస్థాన్ వన్డే కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్




వెస్టిండీస్ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. తాజాగా పాకిస్థాన్‌తో జరిగిన మూడో వన్డేలో 202 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు 294/6 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో పాకిస్థాన్ తేలిపోయింది. 29.2 ఓవర్లలో 92 పరుగులకే ఆలౌటైంది. ఈ విజయంతో విండీస్ 2-1తో మూడు వన్డేల సిరీస్‌ను దక్కించుకుంది. సొంతగడ్డపై జరిగిన ఈ సిరీస్‌లో విండీస్ సత్తా చాటింది. సిరీస్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో ఓడినప్పటికీ, తర్వాత రెండు వన్డేల్లో పుంజుకొని అద్భుత విజయాలు నమోదు చేసింది. దీంతో 34 ఏళ్ల తర్వాత తొలిసారి పాకిస్థాన్?పై వెస్టిండీస్ వన్డే సిరీస్ నెగ్గింది. దీంతో విండీస్ ఫ్యాన్స్? ఆనందంలో మునిగిపోయారు. కాగా, వెస్టిండీస్ చివరిసారిగా 1991లో జరిగిన వన్డే సిరీస్‌లో పాకిస్థాన్‌ను ఓడించింది.కాగా, ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ సూపర్ సెంచరీతో అదరగొట్టాడు. 94 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సర్లతో 120 పరుగులు చేశాడు. ఎడాపెడా బౌండరీలతో స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు.

దీంతో వెస్టిండీస్ మంచి స్కోర్ 294-6 చేసింది. అనంతరం 295 పరుగుల ఛేదనలో దిగిన పాకిస్థాన్?ను విండీస్ బౌలర్లు ఆటాడేసుకున్నారు. ఏకంగా ఐదుగురు బౌలర్లు డకౌట్ అయ్యారు. ఇందులో కెప్టెన్ రిజ్వాన్ (0) సున్నాకే ఔట్ అవ్వగా, బాబర్ ఆజమ్ (9) స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్?లో పాక్ 92 పరుగులకే ఆలౌట్ అవ్వడంపై సోషల్ మీడియాలో ఆజట్టుపై ట్రోల్స్ వస్తున్నాయి. వెస్టిండీస్ జట్టులో హోప్ ఒక్కడే 120 రన్స్ చేయగా, పాక్ జట్టు మొత్తం కలిసి 92 పరుగులే చేసిందని పాక్?ను నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఈ లెక్కన హోప్ ఒక్కడే పాక్‌పై 28 రన్స్‌తో నెగ్గాడంటూ కామెంట్లు చేస్తున్నారు.విండీస్ బౌలర్ జెయిడెన్ సీల్స్ ఈ మ్యాచ్?లో ఆదరగొట్టాడు. ఈ ఒక్కడే 6 వికెట్లు నేలకూల్చి పాక్ పతనాన్ని శాసించాడు. టాప్ 4 వికెట్లు సీల్స్‌కే పడ్డాయి. ఓపెనర్లు సైమ్ అయూబ్ (0), అబ్దుల్లా (0) ఇద్దర్నీ సీల్స్ డకౌట్‌గా పెవిలియన్ పంపాడు. ఆనంతరం రిజ్వాన్, బాబర్ ను కూడా ఔట్ చేసి విండీస్?కు బ్రేక్ ఇచ్చాడు. చివర్లో నసీమ్ షా, హసన్ అలీ వికెట్లు కూడా కూల్చాడు. ఇలా సీమ్స్ ఆరు వికెట్లతో సత్తా చాటగా, గుడాకెశ్ 2, రోస్టన్ చేజ్ 1 వికెట్ దక్కించున్నారు. పాక్ జట్టులోని ఇద్దరు అనుభవజ్ఞులైన బ్యాటర్లు బాబర్ ఆజామ్, మహ్మద్ రిజ్వాన్ ఫెయిల్ అయ్యారు. రిజ్వాన్ డకౌట్ కాగా, బాబర్ 23 బంతుల్లో 9 పరుగులకే పెవిలియన్ చేరాడు. దీంతో ఈ ఇద్దరిపై సోషల్ మీడియాలో ట్రోల్స్ ఎక్కువయ్యాయి. మూడో వన్డేలో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 294 పరుగులు చేసింది. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో వెస్టిండీస్ ఇంత పెద్ద స్కోరును చేరుకోవడంలో కెప్టెన్ షాయ్ హోప్ కీలక పాత్ర పోషించాడు. అతను బ్యాటింగ్‌తో తన జట్టును ముందుండి నడిపించాడు. షాయ్ హోప్ సెంచరీ చేశాడు. ఇది వన్డే క్రికెట్‌లో అతనికి 18వది, పాకిస్తాన్‌పై అతని రెండవ సెంచరీ. షాయ్ హోప్ కేవలం 94 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సర్లతో అజేయంగా 120 పరుగులు చేశాడు. కెప్టెన్ హోప్ విధ్వంసక బ్యాటింగ్ కారణంగా, మొదటి 42 ఓవర్లలో 6 వికెట్లకు 185 పరుగులు చేసిన వెస్టిండీస్ జట్టు చివరి 8 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 109 పరుగులు జోడించింది. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో పాకిస్థాన్‌కు 295 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. నేటి క్రికెట్ యుగంలో ఈ లక్ష్యం అసాధ్యం కాదు. కానీ, వెస్టిండీస్‌పై దానిని ఛేదించడంలో పాకిస్తాన్ చాలా కష్టపడింది, మొత్తం జట్టు కలిసి 100 పరుగులు కూడా చేయలేకపోయింది, ఆ లక్ష్యాన్ని చేరుకోవడం గురించి చెప్పనక్కర్లేదు. మూడవ వన్డేలో, పాకిస్తాన్ జట్టు 92 పరుగులకే ఆలౌట్ అయింది. ఫలితంగా, వెస్టిండీస్ ఈ మ్యాచ్‌లో 202 పరుగుల తేడాతో గెలిచింది.

ఇది పరుగుల పరంగా పాకిస్తాన్‌పై అతిపెద్ద ఓటమిగా నిలిచింది. ఈ సందర్భంలో, 2015లో క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన వన్డేలో 150 పరుగుల తేడాతో ఓడిపోయిన రికార్డును అది బద్దలు కొట్టింది.వన్డే క్రికెట్‌లో వెస్టిండీస్ 200ం పరుగులు సాధించి విజయం నమోదు చేయడం ఇది నాల్గవసారి. కెప్టెన్ షాయ్ హోప్ బ్యాటింగ్‌తో పాకిస్తాన్‌ను దెబ్బతీయడంలో కీలక పాత్ర పోషించగా, జేడెన్ సీల్స్ బంతితో విధ్వంసం సృష్టించాడు. అతను ఒంటి చేత్తో పాకిస్తాన్ జట్టులో సగం మందిని పెవిలియన్ చేరాడు. అతను 7.2 ఓవర్లలో 18 పరుగులకు 6 వికెట్లు పడగొట్టాడు. ఇది అతని కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది

# పిల్లలకు బూస్టర్ డోస్ కీలకం

- హోప్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ఎండి పీడియాట్రిక్స్ డాక్టర్ పి మదన్ మోహన్




**ఖైరతాబాద్ (జనంసాక్షి)**

టీకా ద్వారా నివారించగల వ్యాధుల నుండి పిల్లలను రక్షించడానికి భారతదేశం చేస్తున్న ప్రయత్నాల నడుమ, పాఠశాల ప్రవేశ వయస్సులో పిల్లలకు డిఫ్తీరియా, ధనుర్వాతం, కోరింత దగ్గు, పోలియోకు వ్యతిరేకంగా బూస్టర్ డోస్‌ను సకాలంలో అందించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. బాల్యంలో అందించే టీకాలు ముందస్తు రక్షణకు పునాది వేసినప్పటికీ, ఆ రోగనిరోధక శక్తి కాలక్రమేణా బలహీనపడుతుంది. అందుకే పిల్లలకు నాలుగు మరియు ఆరు సంవత్సరాల మధ్య ఆ రక్షణ ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఇండియన్ నేషనల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ (ఎన్ ఐపి) 6, 10, 14 వారాలలో డీటీపీ టీకాలు, 16 నుండి 24 నెలలకు బూస్టర్‌తో కూడిన టీకాలు వేయాలని వివరిస్తుంది. పోలియో టీకాలు కూడా 6, 14 వారాలలో పాక్షిక మోతాదులలో ఇవ్వబడతాయి. అయితే, నాలుగు సంవత్సరాల వయస్సులో యాంటీబాడీ స్థాయిలు గణనీయంగా తగ్గుతాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి, ముఖ్యంగా పిల్లలు పాఠశాల పరిసరాలలో ఎక్కువ మంది పిల్లలను కలవటం ప్రారంభించినప్పుడు ఈ సమస్య మరింత ఎక్కువ అవుతుంది. హైదరాబాద్ లోని హోప్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో ఎండి పీడియాట్రిక్స్ డాక్టర్ పి మదన్ మోహన్ మాట్లాడుతూ.. "పిల్లల ఆరోగ్యాన్ని ప్రణాళిక చేయడం అనేది మొదటి కొన్ని సంవత్సరాలకు మించి ఉంటుంది. 4 నుండి 6 సంవత్సరాల వయసులో బూస్టర్ అనేది పాఠశాల విద్య ప్రారంభ దశలో చేయటం ద్వారా శాశ్వత రక్షణను అందించే ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. పోషకాహారం, అభ్యాసం, భావోద్వేగ సంసిద్ధతతో పాటు తమ చెక్‌లిస్ట్‌లో తల్లిదండ్రులు చేర్చవలసిన కీలక అంశం ఇది" అని అన్నారు. "పాఠశాల ప్రవేశ వయస్సులో బూస్టర్ మోతాదులు అందించబడినప్పుడు, మనం మరింత బలమైన, మరింత స్థిరమైన ప్రజారోగ్య వ్యవస్థను సృష్టించగలం. ఇది వ్యాధుల వ్యాప్తిని , చికిత్స భారాన్ని తగ్గిస్తుంది. భారతదేశం చాలా కష్టపడి నిర్మించిన నివారణ సంస్కృతిని బలోపేతం చేస్తుంది" అని అన్నారు.

# మాజీ క్రికెటర్ రైనాకు ఈడీ సమన్లు

### ఆన్ లైన్ బెట్టింగ్ యాప్ స్కామ్‌లో ఆరోపణలు




టీమిండియా మాజీ క్రికెటర్ సురేశ్ రైనాకు షాక్ తగిలింది. బెట్టింగ్ ప్రమోషన్లకు సంబంధించి ఈడీ నుంచి అతనికి సమన్లు అందాయి. బుధవారం ఆఫీస్ కు హాజరు కావాలని అందులో పేర్కొన్నట్లు సమాచారం. దేశవ్యాప్తంగా కోట్లాది మంది నుంచి వేల కోట్ల రూపాయలను దోచుకుని, మనీ లాండరింగ్ కు పాల్పడినట్లుగా ఈ బెట్టింగ్ యాప్ నిర్వాహకులపై ఆరోపణలు ఉన్నాయి. నిజానికి భారత ప్రభుత్వం ఈ బెట్టింగ్ యాప్ లను ఎప్పటి నుంచో నిషేధించింది. అయితే పలు మార్గాల ద్వారా ఈ యాప్ లు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. ఇక ఈ బెట్టింగ్ యాప్ లకు ప్రమోషన్ కల్పించిన విషయమై ఇప్పటికే రానా దగ్గుబాటికి తాజాగా ప్రశ్నించారు. అంతకుముందు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవర కొండ, లక్ష్మీ మంచు తదితరులకు సమన్లు పంపినట్లు తెలుస్తోంది. సరోగేట్ యాడ్ల ద్వారా ఈ బెట్టింగ్ యాప్ లను ప్రచారం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బెట్టింగ్ దందా దేశవ్యాప్తంగా వేళ్లునూకోవడం పలువురిని విస్మయానికి గురి చేస్తోంది. ఈ ఏడాది తొలి మూడు నెలలలోనే ఆన్ లైన్ బెట్టింగ్ వెబ్ సైట్లలో 1.6 బిలియన్ విసిట్లు నమోదు కావడం విశేషం. ఇండియాలో ఆన్ లైన్ బెట్టింగ్ మార్కెట్ విలువ వంద మిలియన్ డాలర్లకు పైబడి ఉంటుందని ఈడీ అధికారులు భావిస్తున్నారు. ఇక ప్రతి ఏటా పన్నుల ఎగవేసి, 27వేల కోట్లకుపైగా మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు పేర్కొంటున్నారు. బెట్టింగ్ యాప్ దందాపై మంగళవారం దేశంలోని 15 చోట్ల ఏకకాలంలో దాడులు జరిగాయి. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, జైపూర్, మధురై, సూరత్ తదితర ప్రదేశాల్లో ఈ దాడులు జరిగాయి. పరి మ్యాచ్ అనే బెట్టింగ్ యాప్ దందాకు సంబంధించి ఈ దాడులు జరిగినట్లు తెలుస్తోంది. ప్రివేన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద ఈ విచారణ చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ బెట్టింగ్ దందాలో కోట్లాది మంది భారతీయులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు పరోక్షంగా 22 కోట్ల మందికిపైగా ఈ బెట్టింగ్ రాకెట్ ప్రభావానికి గురయ్యారని, 11 కోట్ల మంది రెగ్యులర్ గా బెట్టింగ్ యాప్ లో విసిట్స్ చేస్తున్నట్లు పలు విధాలుగా సేకరించిన సర్వేల్లో నమోదైనట్లు సమాచారం. ఏదేమైనప్పటికీ, బెట్టింగ్ దందా వల్ల ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ప్రజలకు చైతన్య పరిచేందుకు సోషల్ మీడియాలో వివిధ రకాల క్యాంపెయిన్ల కూడా నడుస్తున్నాయి. ఇక బెట్టింగ్ దందా ద్వారా సంపాదించిన సొమ్మును హవాలా మార్గంలో విదేశాలకు వెళుతున్నట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల వివిధ అకౌంట్లకు తరలించి, నగదు రూపంలో ఉప సంహరణ జరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

## బుచ్చి బాబు టోర్నమెంట్‌కు కెప్టెన్‌గా ఆయుష్ మాత్రే

ఇంగ్లాండ్‌లో టీమిండియాను అద్భుతమైన విజయానికి నడిపించిన అండర్-19 జట్టు కెప్టెన్ ఆయుష్ మాత్రేకు మరో కీలక బాధ్యత అప్పగించారు. కొత్త జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ఈ జట్టులో చాలా మంది స్టార్ ఆటగాళ్లు ఉన్నారు. భారత జట్టు తరపున టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన సర్ఫరాజ్ ఖాన్ కూడా ఈ జట్టులో చోటు సంపాదించాడు. ఆయుష్ మాత్రే కెప్టెన్సీలో ఇంగ్లాండ్‌లో జట్టు చాలా బాగా రాణించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఈ 18 ఏళ్ల ఆటగాడిని ఆస్ట్రేలియా పర్యటనకు కూడా కెప్టెన్‌గా నియమించారు. ఇప్పుడు ఆయుష్‌కు మరో జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. వచ్చే నెలలో ప్రారంభమయ్యే బుచ్చిబాబు టోర్నమెంట్‌లో అండర్-19 జట్టు కెప్టెన్, ఓపెనర్ ఆయుష్ మాత్రే ముంబై జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. భారత జట్టు మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ సర్ఫరాజ్ ఖాన్ కూడా ఈ 17 మంది సభ్యుల ముంబై జట్టులో చోటు దక్కించుకున్నాడు. దీంతో పాటు, అతని సోదరుడు ముషీర్ ఖాన్ కూడా జట్టులో చోటు సంపాదించాడు. ముంబై తరపున 8 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన సువేద్ పార్కర్‌ను జట్టుకు వైస్ కెప్టెన్‌గా నియమించారు. బుచ్చి బాబు టోర్నమెంట్ ఆగస్టు 18 నుంచి సెప్టెంబర్ 9 వరకు చెన్నైలో జరుగుతుంది. ఆగస్టు 18న తమిళనాడు డిస్ట్రిక్ట్స్ ఎలెవన్‌తో ఆడటం ద్వారా ముంబై తన ప్రచారాన్ని ప్రారంభిస్తుంది.

## మాదక ద్రవ్యాల కట్టడిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

### జీహెచ్ఎంసీ కమిషనర్



**హైదరాబాద్, ఆగస్టు 13:** జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వి కర్ణన్ మాదక ద్రవ్యాల కట్టడిలో ప్రతి ఒక్కరూ క్రియాశీలకంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా అధికారులు, సిబ్బందితో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాల రహిత భవిష్యత్ భారత్ కోసం ఉద్యోగులు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. సమాజ, దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, డ్రగ్ ఫ్రీ ఇండియా ప్రచారంలో యువత ప్రధాన పాత్ర పోషించాలని కమిషనర్ కర్ణన్ అన్నారు. తాము మాత్రమే కాకుండా, కుటుంబ సభ్యులు, స్నేహితులను కూడా ఈ కార్యక్రమంలో భాగం చేయాలని సూచించారు. నగరం, జిల్లా, రాష్ట్రాన్ని మాదక ద్రవ్యాల రహితంగా మార్చే సంకల్పం యువత తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు రఘుప్రసాద్, వేణు గోపాల్, పంకజ, గీతారాధిక, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వెంకటేశ్వర్ రెడ్డి, జాయింట్ కమిషనర్ (ఐటీ) రాధ, సీపీఆర్ఓ మహ్మద్ ముర్తుజా అలీ, పీఆర్వో దశరథం పాల్గొన్నారు.




# 24×7 సేవల్లో హైడ్రా

### అనుక్షణం అప్రమత్తం.. విధుల్లో 3565 మంది

**హైదరాబాద్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో హైడ్రా అప్రమత్తమైంది. 24×7 సేవలందించే పనిలో నిమగ్నమైంది. ఎక్కడా రహదారులపై నీరు నిలవకుండా.. ఎప్పటికప్పుడు క్యాచ్పిట్లలో, కల్వర్టుల్లో చెత్తను తొలగిస్తూ.. వరద సాఫీగా సాగేలా హైడ్రా బృందాలు పని చేస్తున్నాయి. నగరవ్యాప్తంగా 436 ప్రాంతాలు నీట మునిగే అవకాశం ఉందని హైడ్రా గుర్తించింది. ఇందులో 150 ప్రాంతాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించి అక్కడ హెవీ మోటార్లు పెట్టడమే కాకుండా.. వరద సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లను హైడ్రా చేసింది. మరో 142 ప్రాంతాల్లో కూడా ఇవే ఏర్పాట్లు చేసింది. కొద్దిపాటి సమస్య ఉండే ప్రాంతాలను 144గా గుర్తించి అక్కడ వరద ముంచెత్తకుండా చర్యలు తీసుకుంటోంది. హైడ్రా డీఆర్ ఎఫ్ బృందాలు 51 రంగంలో ఉండగా మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్లు 150 పని చేస్తున్నాయి. యిలా 3565 మంది విధుల్లో నిమగ్నమై ఉన్నారు. వీటికి తోడు 9 బోట్లను సిద్ధం చేసుకుని.. సమస్యాత్మక ప్రాంతాలకు వాటిని చేరవేసింది.

### 309 ప్రాంతాల్లో నిత్యం నిఘా

నగరంలో 309 ప్రాంతాల్లో నిత్యం నిఘా పెట్టింది. వర్షం వస్తున్నప్పుడు వరదను అంచనా వేసి మ్యాన్ హోళ్లను తెరవడం.. తర్వాత మూసేయడం.. క్యాచ్పిట్ల వద్ద చెత్తను నిరంతరం తీయడం వంటి విధుల్లో వీరంతా ఉంటారు. వీరికి తోడు 20 బృందాలు నిత్యం ట్రాఫిక్ పోలీసులతో ఉంటూ.. వర్షం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. చెట్లు పడిపోతే వెనువెంటనే తొలగించేందుకు ప్రత్యేకంగా ఉన్న బృందాలకు తోడు.. ట్రాఫిక్జామ్లలో సులభంగా వెళ్లేందుకు 21 బైకు బృందాలు కూడా ఉన్నాయి. 212 డీవాటరింగ్ పంపులను నీరు నిలిచే ప్రాంతాల్లో అందుబాటులో ఉంచింది. ఐఎండీ, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, తెలంగాణ డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ, మూడు పోలీసు కమిషనరేట్లతో పాటు జీహెచ్ ఎంసీ, ఫైర్ కంట్రోల్ రూంలలో హైడ్రా సిబ్బంది ఉంటూ ఎప్పటికప్పుడు హైడ్రా కంట్రోల్ రూంకు సందేశాలను పంపే వ్యవస్థను ఏర్పటు చేసింది.

### అన్ని శాఖలతో అనుసంధానం

వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు సంక్షిప్త సమాచారం చేరవేయడమే కాకుండా.. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ ఇలా సంబంధిత విభాగాలతో సమన్వయంగా పనిచేస్తూ ఎక్కడా సమస్య తలెత్తకుండా ఏర్పాట్లుచేసింది. హైడ్రా సిబ్బంది వద్ద వైర్లెస్ సెట్లను ఉంచి తక్షణం స్పందించేలా హైడ్రా చర్యలు తీసుకుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. హైడ్రా అదనపు సంచాలకులు శ్రీ వర్ల పాపయ్యగారు హైడ్రా కంట్రోల్ రూంతో కోఆర్డినేషన్ చేసుకుంటూ క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

# బీసీ బిల్లుకు మోడీ ప్రభుత్వం ఆమోదం తెలపాల్సిందే

- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో బిల్లు కోసం నిలదీయండి
- విలేకరుల సమావేశంలో మధుయాష్కీ గౌడ్ పిలుపు

**కోరుట్ల (జనంసాక్షి) :**

ప్రజల అభీష్టం మేరకు కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపాల్సిందేనని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. కోరుట్ల నియోజకవర్గం మెట్ పల్లి లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి మధుయాష్కి గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల కోరిక మేరకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఏ విధంగా అయితే జరిగిందో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కూడా అలానే సాధిస్తామని మధుయాష్కి పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజల డిమాండ్కు తలోగ్గి బీసీ రిజర్వేషన్ బిల్లును అమలు చేయాల్సిందేనని పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లుపై బిజెపి ఎమ్మెల్యేలు మద్దతు తెలిపినప్పటికీ.. ఢిల్లీలో మాత్రం అడ్డుకోవడం విడ్డూరమన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగానైతే పార్టీలపై, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి చేసి నిలదీశారో.. అదేవిధంగా బీసీ బిల్లును అడ్డుకుంటున్న రాష్ట్రంలోని బిజెపి ఎంపీలను ఎక్కడికక్కడ నిలదీసి వారిపై ప్రజలు ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. తమిళనాడులో 68 శాతం రిజర్వేషన్స్ సాధ్యమైనప్పుడు.. తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదని, ప్రజలు భాగస్వామ్యమై ఉద్యమించాలని పేర్కొన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం.. ఎన్నికల కమిషన్ కలిసిపోయాయని.. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో, ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో ఓటు చోరీకి పాల్పడ్డారని, ఆయా నియోజకవర్గలలో లక్షల సంఖ్యలో బోగస్ ఓట్లను చేర్చాలని విమర్శించారు. ఎన్నికల పోలింగ్ ముగిసిన తరువాత అనూహ్యంగా ఓటు పర్సంటేజ్ ని పెంచడం బిజెపి - ఎన్నికల కమిషన్ అక్రమాలకు




నిదర్శనంగా నిలుస్తుంది అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఓట్ చోరీ పై రాహుల్ గాంధీ గారు చేపడుతున్న ప్రజా ఉద్యమానికి మద్దతు తెలపాలని, ప్రజా సంఘాలు ప్రజాస్వామిక వాదులు ఇందులో భాగస్వామమై పోరాడాలని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం దోపిడీయే లక్ష్యంగా పాలన సాగిందన్నారు. 2014 ముందు తర్వాత వాళ్ళ ఆస్తులు ఎంతో తేల్చితే వాళ్ళ దోపిడీ ఎంత స్థాయిలో ఉందో బయట పడుతుందన్నారు. సారా అజెండాగా బీఆర్ఎస్ పాలన సాగితే.. సామాజిక న్యాయం ఎజెండాగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ.. ప్రజల మన్ననలను పొందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువాడి కృష్ణారావు, కిసాన్ సెల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జలపతి రెడ్డి, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకటేష్ గౌడ్, మెట్ పల్లి టౌన్ అధ్యక్షులు జెట్టి లింగం తదితర నాయకులు ఉన్నారు.

## పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడొద్దు: హర్భజన్ సింగ్

ఆసియా కప్ 2025 టోర్నమెంట్‌లో భారత్ పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడొద్దని మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ సూచించాడు. సరిహద్దుల్లో సైనికులు పోరాడుతున్న సమయంలో పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడటం సమంజసం కాదని, దేశం కంటే ఏదీ ముఖ్యం కాదని అతను అభిప్రాయపడ్డాడు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు, పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో యుద్ధ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో ఆసియా కప్ 2025లో భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌పై అనిశ్చితి నెలకొంది. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీలో యువరాజ్ సింగ్ నేతృత్వంలోని భారత లెజెండ్స్ జట్టు పాకిస్థాన్‌తో మ్యాచ్‌లను బహిష్కరించి, సెమీఫైనల్ చేరినా టోర్నీ నుంచి వైదొలిగింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభమయ్యే ఆసియా కప్‌పై అందరి దృష్టి నెలకొంది. సెప్టెంబర్ 14న భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనుండగా, ఈ టోర్నీలో మూడు సార్లు ఇరు జట్లు ఆడే అవకాశం ఉంది. అయితే, ఈ విషయంపై బీసీసీఐ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. హర్భజన్ సింగ్ మాట్లాడుతూ, సరిహద్దుల్లో సైనికుల త్యాగాలతో పోలిస్తే క్రికెట్ మ్యాచ్ చాలా చిన్న విషయమని, ఒక మ్యాచ్ ఆడకపోతే ఏమీ పోయేది లేదని అన్నాడు.



# శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోకి వరద నీరు

**పరవళ్లు తొక్కుతున్న రాళ్లవాగు**

**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 13 (జనంసాక్షి) :** రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పరవళ్లు తొక్కుతున్నాయి. ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా చేరుతోంది. చిన్న చిన్న వాగులు ఉధృతంగా ప్రవహించడంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర సమయంలో సైతం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాగులు దాటే పరిస్థితి నెలకొంది. తాండూరు మండలంలోని నర్సాపూర్ వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఈరోజు నిండు గర్భిణిని తాళ్ల సాయంతో స్థానికులు ,పోలీసులు వాగు దాటించారు. బుధవారం నాడు మంచిర్యాల జిల్లాలో జిల్లాకేంద్రంలోని రాళ్లవాగు పరవళ్ళు తొక్కుతూ ప్రవహించింది. కాజ్ వే పైనుండి ప్రవాహం వెళ్లడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పైన కురుస్తున్న భారీ వర్షాలకు కడెం ప్రాజెక్ట్ రెండు గేట్లు ఎత్తి వరదనీటిని దిగువకు వదలడంతో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ లోకి భారీగా వరద నీరు చేరుతుంది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 20. 175 టీఎంసీలకు గాను ప్రస్తుతం12. 777 టీఎంసీల నీరు చేరింది. 148ని అడుగులకు గాను 145 అడుగులకు వరద నీరు చేరింది. గతంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం ఇప్పుడిప్పుడే వరద నీరు చేరుతుంది. ప్రాజెక్ట్‌కు క్యాచ్‌మెంట్ ఏరియా నుండి 452 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది.

# వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి

- మూడు రోజులు కచ్చితంగా హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలి
- హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్ సూచించారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, ఇతర ఉన్నతాధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు కమిషనర్, డీహెచ్ పలు సూచనలు చేశారు. రాష్ట్రానికి నేటి నుంచి 3 రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో అందరి సెలవులు రద్దు చేస్తున్నామని తెలిపారు. హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, ఆర్‌ఎంవోలు, మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు, సిబ్బంది ఈ మూడు రోజులు కచ్చితంగా హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలన్నారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. డ్యూటీలకు గైర్హాజరు అయినా, నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్, డీహెచ్ హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు, గర్భిణులకు తక్షణమే వైద్య సేవలు అందించాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్ దగ్గరగా ఉన్న గర్భిణులను హాస్పిటల్స్‌లోని బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించి సేవలందించాలన్నారు. అన్ని హాస్పిటల్స్‌లో అవసరమైన మెడిసిన్, టెస్టింగ్ కిట్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పాము, తేలు కాటు పేషెంట్లకు ఇచ్చే ఇంజక్షన్లు, మెడిసిన్ అన్ని ప్రైమరీ హెల్త్ సెంటర్ల నుంచి టీచింగ్ హాస్పిటళ్ల వరకూ అందుబాటులో ఉండాలన్నారు. అంబులెన్స్‌లు, 102 వాహనాలు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, ఎక్కడ ఎమర్జెన్సీ ఉన్నా తక్షణమే వెళ్లి పేషెంట్‌ను తరలించేలా డ్రైవర్లు, ఈఎంటీలను 24 గంటలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హాస్పిటళ్లలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, పవర్ కట్ అయిన మరుక్షణమే జనరేటర్స్ ప్రారంభించి రోగులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో హాస్పిటల్స్ లోపలికి నీరు చేరకుండా, నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్లు, ఇతర డిపార్ట్‌మెంట్ల ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ వైద్య సేవలు కొనసాగించాలని డీఎంహెచ్‌వోలకు సూచించారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, వైద్య సేవలు అందించాలని అధికారులకు కమిషనర్ సంగీత సత్యనారాయణ సూచించారు.

# ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీలు.. ప్రమాణాలు పాటించాలి

- ఆయా కంపెనీలపై పీసీబీ అధికారులు తరచూ నిఘా ఉంచాలి
- ప్రజల ఆరోగ్యంపై ఉదాశీనత వద్దు... పీసీబీ అధికారులపై మంత్రి కొండా సురేఖ ఆగ్రహం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలోని పర్యావరణాన్ని పరిరక్షించే ప్రక్రియలో ఫార్మా, డ్రగ్ కంపెనీలు... ప్రమాణాలు పాటించాలని తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. బుధవారం సెక్రటేరియట్‌లో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫార్మా, బల్క్ డ్రగ్ పరిశ్రమల అనుమతుల విషయంలో అవకతవకలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ముందు ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను మంత్రికి పీసీబీ అధికారులు వివరించారు. సీపీసీబీ(సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు)కి అందిన ఫిర్యాదుల వివరాలు కూడా అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో సెక్రటేరియట్‌లో బుధవారం ఫారెస్టు మినిస్టర్ ఛాంబర్‌లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. కాగా, ఈ సమావేశానికి హాజరైన అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ అహ్మద్ నదీం, పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి, సీఈ రఘు, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, వెంకన్న, రవిశంకర్, పోచంపల్లి, చౌటుప్పల్, చిట్యాల నుంచి పరిశ్రల ప్రతినిధులు సైతం పాల్గొన్నారు. అనుమతులు లేని, అనుమతుల టైం అయిపోయిన కంపెనీలను ఎన్నిసార్లు రైడ్స్ చేశారో... స్థానికంగా గ్రౌండ్ వాటర్ కలుషితం అవుతున్న స్టేటస్ చెక్ చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రౌండ్ వాటర్ కలుషితం అయిన ప్రాంతాల్లో టాస్క్ ఫోర్స్ నుండి డ్రైవ్ చేపించారా? అంటూ మంత్రి ప్రశ్నలు వేశారు. ఎంతటి వారైనా పర్యావరణ పరిరక్షణ ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. అవసరం అయితే ప్రభుత్వం తరఫున టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఆ టాస్క్ ఫోర్స్ కమిటీలో ఒక ఐఏఎస్ ఆఫీసర్, ఒక ఐపీఎస్ ఆఫీసర్, ఫారెస్ట్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఎన్విరాన్మెంటల్ పరిరక్షకులు, సెంట్రల్ పిసిబి అధికారులు కూడా ఇందులో చేర్చి ఉన్నత స్థాయి కమిటీని వేస్తామని స్పష్టం చేశారు. అయితే, ప్రతి ఆరు నెలలకి ఒకసారి ఇన్‌స్పెక్షన్ చేస్తున్నట్టు మంత్రి సురేఖకి పీసీబీ మెంబర్ సెక్రటరీ జి.రవి వివరించారు. కంప్యూటరైజ్డ్ ఇన్‌స్పెక్షన్ ప్రక్రియ కూడా చేపడుతున్నట్టు వెల్లడించారు. జనావాసాలున్న చోట ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీలు వాటిని స్థానచలనం చేసేందుకు కసరత్తు చేయాలన్నారు. కొన్ని ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీల ప్రతినిధులు మంత్రికి వివరించారు. నీటి కలుషితం కాకుండా ఉండేందుకు ఏ చర్యలు తీసుకుంటున్నారో మంత్రికి తెలిపారు. నీటి కలుషితం కావొద్దని... భావి తరాలకు నీటి వనరులను అందజేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని మంత్రి సురేఖ సూచన చేశారు. చౌటుప్పల్ ఏరియా నుంచి పర్యావరణ పరిరక్షణ, నీటి కలుషితం మీద విపరీతమైన ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వాటిపై చాలా కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు. పర్యావరణ చట్టాల మేరకు పీసీబీకి, రాష్ట్ర ప్రభుత్వంకు అన్ని అధికారులున్నాయన్న విషయం మరిచిపోవద్దన్నారు. నిబంధనలు, ప్రమాణాల మేరకు చర్యలు తీసుకుంటనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. నీటి కలుషితం కూడా తగ్గుతుందని వివరించారు. రెయిన్ వాటర్ ను కలుషితం చేయకూడదన్నారు. గాలి కలుషితం చర్యలు సాధ్యమైనంత తగ్గించాలన్నారు. కలుషితం జరిగి మానవ ఇబ్బందులు జరిగే కంటే ముందు నివారిస్తే మంచిదని మంత్రి పరిశ్రమ ప్రతినిధులు, పీసీబీ అధికారులకు హితవు పలికారు. కరోనా తర్వాత చిన్న చిన్న విషయాలకే మరణాలు సంభవిస్తున్నాయని... అయితే, కరోనా తర్వాత పర్యావరణ పరిరక్షణ మరింత కీలకమైందన్నారు. సిగాచి ఘటన తర్వాత కంపెనీల్లో మరింత భద్రత అవసరమన్న విషయం గుర్తించాలన్నారు. తమ కంపెనీల్లో ఏది ఎలా ఉందో వారికే బాగా తెలుసు అని గుర్తు చేశారు. అందుచేత, సెల్ఫ్ ఇన్స్‌పెక్షన్ చేసుకోవాలన్నారు. పీసీబీ తరఫున కూడా రైడ్స్ జరుగుతాయని అన్నారు.

# నేటి బాలలే రేపటి తెలంగాణ భవిష్యత్తు పౌరులు

- తెలంగాణ రైజింగ్ - 2047 లక్ష్యసాధనలో చిన్నారుల పాత్రే కీలకం
- బాలల హక్కుల కమిషన్ కార్యకలాపాలపై మంత్రి సీతక్క సమీక్ష



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధ్యక్షతన బాలల హక్కుల కమిషన్ కార్యకలాపాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ సృజన, సంబంధిత అధికారులు హాజరయ్యారు. సమావేశంలో బాలల హక్కుల కమిషన్ ఏర్పాటైన నాటి నుండి ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, అమలు చేసిన చర్యలు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి అవసరమైన వనరులపై చర్చ జరిగింది. జిల్లాస్థాయిలో మహిళా శిశు సంక్షేమ శాఖ నుండి మరింత సహకారం అందించాలని కమిషన్ విజ్ఞప్తి చేసింది. ప్రతి చిన్నారికి ఆరోగ్యకరమైన, సంతోషకరమైన బాల్యం అందించడానికి మిషన్ వాత్సల్య ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని మంత్రి సీతక్క సూచించారు. అలాగే జిల్లాల వారీగా సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యుల నియామకానికి దరఖాస్తుల గడువు ఈ నెల 8తో ముగిసినప్పటికీ ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో, గడువు పెంపు సాధ్యాసాధ్యాలను పరిశీలించి, న్యాయపరమైన సలహా తీసుకొని తగిన నిర్ణయం తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో బాలల హక్కుల కమిషన్ మరింత క్రియాశీలకంగా పని చేయడానికి మహిళా శిశు సంక్షేమ శాఖ పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. నేటి బాలలే రేపటి తెలంగాణ భవిష్యత్తు పౌరులని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన "తెలంగాణ రైజింగ్– 2047" లక్ష్య సాధనలో నేటి బాలలదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు.

# గణేశ్ మండపాలన్నీ జియో ట్యాగ్

**హైదరాబాద్, ఆగస్ట్13 (జనంసాక్షి) :** గణేశ్ నవరాత్రుల సందర్భంగా సెక్టార్ ఎస్‌ఐలు తమ పరిధిలో ఏర్పాటు చేసిన మండపాల పూర్తి వివరాలు సేకరించి జియో ట్యాగింగ్ చేయాలని నగర సీపీ సీవీ ఆనంద్సూచించారు. మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బందోబస్తు ఏర్పాట్లపై అధికా రులతో ఆయన సన్నా హక సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఇన్‌స్పెక్టర్‌లు మండపాల నిర్వాహకులతో తరచూ సమావేశాలు నిర్వహించి వారికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# ఇకపై ఒక్క రోజులోనే వీసా జారీ

- నిబంధనల సరళ తరం చేసిన కేంద్రం
- అక్రమ వలసదారుల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి
- విదేశీ విభాగం ఉన్నతాధికారులతో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సమావేశం
- వీసా విధానం సులభతరం, అక్రమ వలసదారుల నియంత్రణపై సమీక్ష



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఇప్పటి వరకు వీసా జారీ చేయడానికి కొన్ని వారాల సమయం పట్టేది. అన్ని పత్రాలు సమర్పిస్తే ఇకపై ఒక్క రోజులోనే వీసాను పొందే అవకాశాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనల్లో వెసులు బాటు తీసుకొచ్చింది. అట్లాగే అక్రమ వలసదారులు, గడువు మించి ఉండే విదేశీయులపై పర్యవేక్షణను మరింత బలోపేతం చేసేందుకు డిస్ట్రిక్ట్ పోలీస్ మాడ్యూల్, ఫారినర్స్ ఐడెంటిఫికేషన్ పోర్టల్ అనే రెండు కొత్త పోర్టల్స్ ను ప్రారంభించింది. కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధ్యక్షతన ఈరోజు న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో విదేశీ విభాగం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీసాల విధానాల సరళతరం, ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టుల ఆధునీకరణ వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయా అంశాల్లో పురోగతిని అధికారులకు కేంద్ర మంత్రికి వివరించారు. వీసా విధానాన్ని సులభతరం చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గతంలో వీసా పొందేందుకు 26 సబ్ కేటగిరీలుండగా వాటిని 22కి కుదించామని, అట్లాగే గతంలో 104 సబ్ కేటగిరీలుంటే 69కి తగ్గించినట్లు వెల్లడించారు. 2024లో జారీ చేసిన మొత్తం వీసాలలో ఈ వీసాల వాటా 65.15 శాతం. వీసా విధానాల సులభతరం వల్ల వీసా జారీ సగటు సమయం కొన్ని వారాల నుండి ఒక రోజులోపు తగ్గినట్లు తెలిపారు. ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టుల ఆధునీకరణలో భాగంగా ఆటోమేటెడ్ ట్రావెల్ డాక్యుమెంట్ స్కానింగ్, బయోమెట్రిక్ నమోదు సదుపాయాలను కల్పించినట్లు అధికారులు పేర్కొన్నారు. 2014 నాటికి దేశంలో 82 ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టులుండగా, ప్రస్తుతం 114కి (వీటలో 37 ఎయిర్, 37 రోడ్డు, 34 సముద్ర, 6 రైల్వే) పెంచినట్లు వివరించారు. అట్లాగే ఢిల్లి, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్, కొచ్చి, అహ్మదాబాద్‌లలో ఫాస్ట్–ట్రాక్ ఇమ్మిగ్రేషన్ ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రాం అమలు చేస్తున్నట్లు పేర్కొన్న అధికారులు ప్రీ-వెరిఫైడ్ ప్రయాణికులు ఈ విమానాశ్రయాల్లో కేవలం ఒకే ఒక్క నిమిషంలోనే ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ పొందవచ్చునని వివరించారు. త్వరలో ఈ సౌకర్యాన్ని కోజికోడ్, లక్నో, తిరువనంతపురం, అమృతసర్, తిరుచిరాపల్లి, నోయిడా, నవి ముంబై విమానాశ్రయాలకు విస్తరించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 50 లక్షల ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా కార్డులు జారీ చేయడంతోపాటు ఓసీఐ పోర్టల్‌ను పునరుద్ధరించి మరింత సులభమైన సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌లకు చెందిన 6 నిర్దిష్ట మైనారిటీ సమూహాల పౌరసత్వ దరఖాస్తుదారులకు సాయం చేయడానికి 'సీఏఏ–2019' మొబైల్ యాప్ అభివృద్ధి చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరును అభినందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ వీసా, ఇమ్మిగ్రేషన్ విషయంలో ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాలను, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో సాధారణ ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు.

# ఇరుకు రోడ్డులో ఇరుక్కున్న బస్సులు



**ఖానాపూర్ ఆగస్టు 13 (జనంసాక్షి) :** నియోజకవర్గ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుండి మెట్పల్లి వెళ్లే ఇరుకు రోడ్డులో రెండు బస్సులు ఇరుక్కున్నాయి. బుధవారం ఎదురెదురుగా వచ్చిన రెండు బస్సులు ముందు వెళ్లలేక వెనక వెళ్లలేక నిలిచిపోవడంతో ప్రయాణికులకు అంతరాయం ఏర్పడింది. ఆ దారిలో వాహనాల రాకపోకలు సుమారు 20 నిమిషాల పాటు నిలిచిపోయాయి. అనంతరం నెమ్మదిగా రెండు బస్సులను అటు ఇటుగా కదిలించి డ్రైవర్లు చాకచక్యంగా వ్యవహరించి ఎలాంటి ప్రమాదం సంభవించకుండా బస్సులు కదిలించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీలో రద్దీ

- మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు
- అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు
- సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడి



**హైదరాబాద్, ఆగస్ట్13 (జనంసాక్షి) :** రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ బస్సులను మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకున్నారని.. ఆరు రోజుల్లో మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించగా.. అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నాయని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఈ నెల 9న రాఖీ పండుగ రోజున 45.62 లక్షల మంది మహిళలు ప్రయాణించగా.. ఈ నెల 11న అత్యధికంగా 45.94 లక్షల మంది రాకపోకలు సాగించారని పేర్కొన్నారు. ఒక్కరోజులో ఇంతమంది మహిళలు ప్రయాణించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. గత ఏడాది రాఖీకి 2.75 కోట్ల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేసిందని, ఈ ఏడాది 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించారన్నారు. గతేడాదితో పోలిస్తే 92.95 లక్షల మంది ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని.. ఈ ఏడాది 2.28 కోట్ల కిలోమీటర్లు ఆర్టీసీ బస్సులు తిరిగాయన్నారు. గత ఏడాదితో పోల్చితే 53 లక్షల కిలోమీటర్లను అదనంగా సంస్థ బస్సులను తిపిందని చెప్పుకొచ్చారు. రాఖీ పౌర్ణమికి మహాలక్ష్మి పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకుని ఉచితంగా రాకపోకలు సాగించడంపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం హర్షం వ్యక్తం చేశారు. అన్నాచెల్లెల్ల బంధం ఎంత గొప్పదో ఈ రాఖీ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. సంస్థ సామర్థ్యాన్ని అంతా ఉపయోగిం చుకుని రాఖీ పండుగకు రికార్డుస్థాయిలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసిన ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రాఖీ పండుగను త్యాగం చేసి, భారీ వర్షాల్లోనూ నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేశారంటూ ప్రశంసించారు. రద్దీలోనూ మహాలక్ష్మి–మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకాన్ని విజయవంతంగా అమలు చేశారన్నారు. ముందస్తు ప్రణాళికతో పాటు– సిబ్బంది నిబద్ధతతో పనిచేయడం వల్లే రాఖీ పండుగకు లక్షలాది మంది ప్రయాణికులను క్షేమంగా సిబ్బంది గమ్యస్థానాలకు చేర్చారని టీ–జీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ తెలిపారు. ఈ రాఖీ పండుగ ఆపరేషన్స్ సంస్థలో సరికొత్త రికార్డులను నమోదు చేసిందని, ఈ నెల 11న ఒక్క రోజులో అత్యధికంగా 68.45 లక్షల మంది ప్రయాణించారని చెప్పారు. ప్రజారవాణా వ్యవస్థపై ప్రజల ఆదరాభిమానాలు ఎంతలా ఉన్నాయో చెప్పేందుకు ఈ రికార్డులే నిదర్శనమని చెప్పారు. ఆర్టీసీకి సహకరిస్తూ.. ప్రజా రవాణా వ్యవస్తను ఆదరిస్తోన్న, ప్రోత్సహిస్తోన్న ప్రయాణికులందరికీ సజ్జనార్ కృతజ్ఞతలు తెలిపారు.

# కుక్కల తరలింపు తీర్పు పరిశీలిస్తా

- అభ్యంతరాల నేపథ్యలో సుప్రీం చీఫ్ జస్టిస్ వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్ట్13 (జనంసాక్షి) :** కుక్కల తరలింపు అంశపై సుప్రీం చీఫ్ జస్టిస్ సానుకూలంగా స్పందించారు. దీనిని సమీక్షిస్తానని వెల్లడించారు. దిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తొలగించాలంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుప్రీం తీర్పుపై జంతు హక్కుల సంస్థలు ఆక్షేపణ తెలిపాయి. ఈ నేపథ్యంలో తీర్పు ఉత్తర్వులను తాను పరిశీలిస్తానని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. వీధి కుక్కల దాడుల వల్ల దిల్లీ, ఎన్సీఆర్‌ల పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. దిల్లీ (ఉ।తె)లో ఎక్కడా వీధి కుక్కలు ఉండటానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ చర్యలను అడ్డుకోవడానికి ఏవైనా సంస్థలు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370